దాశరథి సాహిత్యం-3
రూ॥ 450/-
పేజీలు: 480

ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★




బాంబులు, బెదిరింపులకు లొంగం

తెహ్రాన్ సహా ఇరాన్ వ్యాప్తంగా భారీ ప్రదర్శనలు 02


సంపుటి 28, సంచిక: 02 | శనివారం | 21-06-2025 | హైదరాబాద్   Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar   పేజీలు: 12 | వెల రూ. 5.00


# చర్చలకు సిద్ధం

- ఎపి ప్రభుత్వంతో వివాదాలు కోరుకోవడంలేదు
- కేంద్ర ప్రభుత్వానికి ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు ఇవ్వడంవల్లే గందరగోళం మొదలు
- పిఎఫ్ఆర్ ఇచ్చేముందు తెలంగాణతో చర్చించాల్సి ఉండేది
- ఎపి చర్యలకు కేంద్రం వెంటనే స్పందిస్తోంది
- విభజన చట్టంలో పోలవరం ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి ఉంది
- ఈ ప్రాజెక్టులో మార్పులకు తెలంగాణ అనుమతి తప్పనిసరి
- ఢిల్లీలో మీడియా 'చిట్‌చాట్'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

"తెలంగాణకు సాగునీటి విషయంలో అన్యాయం చేసిందే కెసిఆర్, హరీశ్‌రావు. బనకచర్లకు 2016లోనే బీజం పడింది. 2016, 2018లో సర్వే చేయాలని ఎపి గవర్నమెంట్ జీఓలు ఇచ్చినప్పుడే తెలంగాణ ప్రభుత్వం కోర్టులను ఎందుకు ఆశ్రయించలేదు. హరీశ్‌రావు, కెసిఆర్‌ల అబద్ధాలు చూస్తే దేవుడు కూడా ఆశ్చర్యపోతాడు. నేనేనా వీళ్లను సృష్టించింది అని ఆశ్చర్యపోయేలా అబద్ధాలు ఆడుతున్నారు."
– సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం / హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌తో ఎలాంటి వివాదాలు కోరుకోవడం లేదని, గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో చర్చలకు సిద్ధమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రీ ఫీజిబులిటి రిపోర్ట్ (పిఎఫ్ఆర్)ను ఎపి ఇవ్వడం వల్లే వివాదం మొదలైందని, పిఎఫ్ఆర్ ఇచ్చే ముందే తెలంగాణతో చర్చించి ఉంటే వివాదం ఉండేదికాదన్నారు. ఆంధ్రప్రదేశ్ పిఎఫ్ఆర్ ఇచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందిస్తోందని, బనకచర్లపై కేంద్రం అన్ని రకాల చర్యలకు సిద్ధమైందన్నారు. ఢిల్లీలో శుక్రవారం మీడియా ప్రతినిధులతో సిఎం రేవంత్‌రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. విభజన చట్టంలో పోలవరం ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి ఉందని, బనకచర్ల ప్రాజెక్టు అనేది పోలవరానికి అనుబంధ ప్రాజెక్టు అని, పోలవరం ప్రాజెక్టులో మార్పులకు తెలంగాణ అనుమతి తప్పనిసరి అని సిఎం అన్నారు. 'ఇద్దరు సిఎంలు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై చర్చిద్దాం. ఒక రోజు కాదు నాలుగు రోజులైనా చర్చిద్దాం. రాష్ట్రాల మధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయి. న్యాయ, సాంకేతిక అంశాలను పరిశీలిద్దాం. వివాదాల పరిష్కారంలో నాకెలాంటి బేషజాలు లేవు. ఇద్దరు వ్యక్తులు కాదు. రాష్ట్రాల మధ్య వ్యవహారం ఇది. విభజన చట్టం ప్రకారం ప్రాజెక్టుల్లో మార్పులు చేస్తే చెప్పుకోవాలి. విభజన చట్టం ప్రకారం గతంలో సిఎంల స్థాయిలో చర్చలు జరిపాం. అనేక అంశాలను సిఎం స్థాయిలో చర్చించాం' అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చర్చల ద్వారానే రెండు రాష్ట్రాల తరువాయి 2లో



# ఆ మూడింటిని పక్కనపెట్టండి

- కాళేశ్వరంలో దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునర్నిర్మాణం లేదా మరమ్మత్తులపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకోవాలి
- తుమ్మిడిహట్టి వద్ద తక్షణమే బ్యారేజీ నిర్మించాలి
- ప్రభుత్వానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని విజ్ఞప్తి
- గోదావరి–బనకచర్ల ప్రాజెక్టును ఎపి ప్రభుత్వం నిలిపివేయాలని డిమాండ్
- ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి చేపట్టిన కాళేశ్వరాన్ని గతంలోనే సిపిఐ వ్యతిరేకించిందని వెల్లడి

ప్రజాపక్షం/ హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులో మూడు ప్రధాన బ్యారేజీలు దెబ్బతిన్న నేపథ్యంలో, వాటిని పక్కనబెట్టి తక్షణమే తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరంలో దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునర్నిర్మాణం లేదా మరమ్మతులు, సాధ్యాసాధ్యాలపై అఖిల పక్షం, ఇరిగేషన్ మేధావులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఏకపక్షంగా తలపెట్టిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టును నిలిపి వేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ లో సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మలతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత–చేవెళ్ళ ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో గత ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును సిపిఐ మొదటి నుంచి వ్యతిరేకించిందని తరువాయి 2లో

"తెలంగాణ రాష్ట్రానికి నష్టం చేకూర్చేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్మిస్తున్న బనక చర్ల ప్రాజెక్టును నిలిపివేయాలి. వరద జలాలపై తెలంగాణకు సైతం హక్కు ఉంటుంది. ఇందుకు సంబంధించి వాటాను తేల్చకుండా ఆంధ్రప్రదేశ్ ఏకపక్షంగా ప్రాజెక్టును ఎలా నిర్మిస్తుంది. జల వివాదాలు ఉభయ తెలుగు రాష్ట్రాలకు మంచిది కాదు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు సాగునీటి పారుదల రంగం నిష్ణాతులతో అన్నివిధాలా చర్చించి సరైన నిర్ణయం తీసుకోవాలి."
– కూనంనేని

అంతర్జాతీయ దౌత్యంలో

## మోదీ విఫలం

అజీజ్ పాషా

అంతర్జాతీయ దౌత్య సంబంధాలను పటిష్ట పర్చుకోవడంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పూర్తిగా విఫలమెయ్యారని సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా విమర్శించారు. పాక్తిసాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పహల్గాంలో దాడికి పాల్పడిన ఘటన, అనంతర పరిణామాలపై కనీసం ఒక్క దేశం సంపూర్ణ మద్దతును కూడగట్టలేక పోయామన్నారు. తనకు తను విశ్వ గురువుగా చెప్పుకునే ప్రధాని దీనిని ఎందుకు సాధించలేకపోయ్యారని ప్రశ్నించారు. మరోవైపు అమెరికా అధ్యక్షులు డొనాల్ ట్రంప్ పదే పదే పాక్తిసాన్ పొగడమే కాకుండా కాల్పుల విమరణకు తనే కారణం చెప్పుకుంటూ దేశాన్ని అవమానిస్తున్నారన్నారు. దీనిపై ఇంత కాలం మౌనంగా ఉన్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇటీవల గట్టిగా స్పందించడం మంచి పరిణామన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ ఉగ్రవాదుల టెర్రరిస్టుల క్యాంప్ భారత సైనం విజయవంతంగా ధ్వంసం చేశాయని, అయితే పహల్గాంలో దాడికి పాల్పడిన ఒక్క ఉగ్రవాదిని కూడ కేంద్ర ప్రభు త్వం అరెస్టు చేయలేకపోయిందన్నారు. ఇరాన్, పాలస్తీనాతో భారత దేశం శతాబ్దాలుగా మంచి దౌత్య సంబంధాలు కల్గి ఉందని, మోదీ అధికారం చేపట్టి తర్వాత దీనిని విస్మరించారన్నారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులకు తెగబడుతున్న నేపథ్యంలో నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని కోరారు.



# ఇంగ్లీషు సిగ్గుచేటు కాదు

సాధికారతనిస్తుంది...

ప్రతి బిడ్డకూ నేర్పించాలి

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ : విదేశీ భాషలకు సంబంధించి కేంద్రమంత్రి అమిత్ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీషులో మాట్లాడే వారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. దీనిపై తాజాగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఇంగ్లీషు 'సిగ్గుచేటు' కాదు, ప్రతి బిడ్డకు నేర్పించాలి అని పేర్కొన్నారు. పేద పిల్లలు ప్రశ్నలు తరువాయి 2లో



అమిత్ షా వ్యాఖ్యలు

# భారతీయ భాషలపై దాడి

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

న్యూఢిల్లీ : ఇంగ్లీషు భాషపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు భారతీయ భాషలపై ప్రేమతో కూడుకున్నవి కావు అని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఇది ఆర్ఎస్ఎస్— బిజెపిల ఒకే జాతి ఎజెండాకు అనుగుణంగా జాతీయ అనుసంధాన భాషను హిందీతో భర్తీ చేయాలనే స్పష్టమైన ప్రయత్నమిది అని ఒక ప్రకటనలో విమర్శించారు. ఇంగ్లీషును బ్రిటిష్ వారు తీసుకొచ్చినప్పటికీ,తరువాయి 2లో



మావోయిస్టులపై మారణ హోమం..

# విచారణ జరిపించాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

మావోయిస్టులపై జరుగుతున్న మారణ హోమంపై విచారణ జరిపించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు అన్నీ బూటకమేనన్నారు. మావోయిస్టుల హననాన్ని దేశంలోని పౌర సమాజం మొత్తం తరువాయి 2లో

హనుమకొండ

# కోర్టులో డిటోనేటర్లు

బెదిరింపు కాల్‌తో బైటపడిన వైనం

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్

హన్మకొండ కోర్టు ప్రాంగణంలో బాంబు పెట్టినట్లు ఓ ఆగంతకుడు పోలీసులకు ఫోన్ చేసి బెదిరించాడు. డయల్100 నెంబర్‌కి ఫోన్ రావడంతో పోలీసులు వెంటనే అప్రమత్తం అయ్యారు. కోర్టు ప్రాంగణంలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో కోర్టు ప్రాంగణంలో ఆరు డిటోనేటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. కోర్టు పరిసరాల ప్రాంతాలను పోలీసులు బాంబ్ స్క్వాడ్ సహాయంతో పరిశీలించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజలను కోర్టు ప్రాంగణం నుంచి దూరంగా పంపించి వేశారు. ఫోన్ ఎక్కడ నుంచి వచ్చింది.. ఎవరు చేశారనే విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

పోలవరం–బనకచర్లపై మాట్లాడే

# నైతికత కెసిఆర్‌కు లేదు



- ఈ ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర బిజెపి నాయకత్వం మౌనం ఎందుకు?
- ఉమ్మడి ఎపిలో నష్టం ఆధారంగా తెలంగాణకు నీటి కేటాయింపులు జరగాలి
- టిజెఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్

ప్రజాపక్షం/హైదరాబాద్

పోలవరం–బనకచర్ల లింకు ప్రాజెక్టు పనులను, ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని హామీల ఉల్లంఘనను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపాలని టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న తెలంగాణ ప్రాజెక్టులకు నీటి వాటాలను కేటాయించి, వెంటనే అనుమతులను మంజూరు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు కలిసొచ్చే అన్ని శక్తులతో కలిసి బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేక పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తరువాయి 2లో

కెసిఆర్‌ను విలన్‌ను చేసేందుకు

# హరీశ్‌రావు యత్నం



- గత బిఆర్ఎస్ ప్రభుత్వం నీళ్ల రాజకీయం చేసింది
- హరీశ్ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడే బనకచర్ల పంచాయతీ మొదలైంది
- కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్

నీళ్ళు అనే పదంతో బిఆర్ఎస్ రాజకీయం చేసిందని, బిఆర్ఎస్ నేతలు బేసిక్ నాలెడ్జ్‌తో ప్రాజెక్టులు కడితే బాగుండేదని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం కూలిన తర్వాత తెలంగాణ ప్రజలకు నీళ్ల సంగతి పూర్తిగా అర్థమైందని, మాజీ మంత్రి హరీష్‌రావును ఆయన మామ మాజీ సిఎం కెసిఆర్‌ను విలన్‌ను చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఢిల్లీలో 2016 లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో అప్పటి సిఎం కెసిఆర్ ఏమి మాట్లాడారో వెల్లడించాలన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బేస్ వదిలి దోచుకునే ప్రయత్నం చేసినందునే తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్ నేతలను పక్కన పెట్టారని, బేసిక్స్ కాదు కాంగ్రెస్‌కు ఎథిక్స్ ఉన్నందునే ప్రజలు కాంగ్రెస్‌కు తరువాయి 12లో

# బాధ్యతతో పారిశ్రామిక వేత్తల చర్యలు




- దానంలా ఉండకూడదు
- ప్రశంసలకోసం కాకుండా సామాజిక మార్పుకోసం పనిచేయాలి
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్థిక అభివృద్ధితో పాటు మానవీయ కోణాన్ని జోడిస్తూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం అభివృద్ధికి ఓ కొత్త నిర్వచనాన్ని రూపొందిస్తుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 'పారిశ్రామికవేత్తల చర్యలు దానం కోసం కాకుండా బాధ్యత కోసం కావాలి. వారి పని ప్రశంసల కోసం కాదు సామాజిక మార్పు కోసం' అని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. హైదరాబాదులోని వెస్టిన్ మైండ్ స్పేస్‌లో శుక్రవారం జరిగిన అసోచామ్ సదరన్ సిఎస్ఆర్, సస్టైనబిలిటీ కౌన్సిల్ సదస్సు, తరువాయి 2లో

ముఖం చాటేసిన వరుణుడు..

# మరి సాగు ఎలా?

ముందుకు సాగని మెట్ట పంటలు
సూర్యాపేట జిల్లాలో 75శాతం లోటు వర్షపాతం



ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి

ముందు మురిపించిన వరుణుడు తీరా కాలం నెత్తిమీదకు వచ్చిన తర్వాత ముఖం చాటేశాడు. దీంతో రైతులు వానల కోసం ఎదురుచూస్తున్నారు. వానమ్మా వానమ్మా... ఒక్కసారి వచ్చి పోవమ్మా అనే పాటను గుర్తు చేసుకుంటున్నారు. జూన్ మాసంలో నైరుతి రుతుపవనాలు రాకపోవడం, వానలు కురవకపోవడంతో జిల్లాలో మెట్ట పంటల సాగు ముందుకు సాగడంలేదు. వాతావరణ శాస్త్రవేత్తలు ఈ ఖరీఫ్ సీజన్‌లో గతం కన్నా 15 రోజుల ముందే నైరుతి రుతుపవనాలు రావడం జరిగిందంటూ ప్రకటనలు చేయడంతో రైతులు తమ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నారు. కానీ వానలు కురవకపోవడంతో పంటు సాగు చేయలేని పరిస్థితి. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 6,17,480 పంట సాగు కానున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం వరి 4,85,069 ఎకరాలలో, పత్తి 91,000 ఎకరాలు, జొన్న 45 ఎకరాలు, కంది 2,650 ఎకరాలు, పెసర 2700 ఎకరాలు, వేరుశనగ 400 ఎకరాలు, చెరకు 60 ఎకరాలు, మిర్చి 15,150 ఎకరాలు, పామాయిల్ 4000 ఎకరాలు, పండ్లు, కూరగాయలు 16,200 ఎకరాలు, ఇతర పంటలు 150 ఎకరాలలో రైతులు సాగు చేయనున్నారు. నైరుతి రుతు పవనాలు ఈ ఏడాది 15 రోజుల ముందుగానే వస్తాయని వాతావరణ శాఖ అధికారులు ముందు ప్రకటించడంతో రైతులు, పంటసాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసుకున్నారు. గత నెలలో కురిసిన అడపదడప వానలతో మెట్ట పంటసాగు చేసేందుకు రైతులు తమ భూములను చదును చేసుకుని విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు. వర్షాలు పడకపోవడంతో రైతులు మెట్ట పంటల విత్తనాలను 90శాతం విత్తలేదు. జిల్లాలోని నూతన్‌కల్, తిరుమలగిరి, మద్దిరాల, నాగారం తదితర మండలాల్లో నల్లరేగడి భూములు అధికంగా ఉండటంతో కొంతమంది రైతులు పత్తి విత్తనాలను గత 15 రోజుల క్రితమే వేయ డం జరిగింది. కాని వానలు కురవకపోవడంతో భూమిలో వేసిన విత్తనాలు మొలకెత్తని పరిస్థితి. దీంతో రైతులు వానల కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. వానమ్మా వానమ్మా... ఒక్కసారైన వచ్చిపోవమ్మా అంటూ వరుణ దేవున్ని తరువాయి 12లో

ఎన్నికల ఖర్చులో

# బిజెపి టాప్

- 2024 లోక్‌సభ ఎన్నికల్లో రూ. 1,494 కోట్లు ఖర్చు
- మొత్తం ఎన్నికల ఖర్చులో 44.56 శాతం : ఎడిఆర్




న్యూఢిల్లీ : గత ఏడాది (2024) జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) దాదాపు రూ.1,494 కోట్లు ఖర్చు చేసింది. ఇది మొత్తం ఎన్నికల ఖర్చులో 44.56 శాతం కావడం గమనార్హం. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) తెలిపింది. 32 జాతీయ, ప్రాంతీయ పార్టీల రికార్డులను విశ్లేషించగా, కాంగ్రెస్ పార్టీ రూ.620 కోట్లు లేదా మొత్తం ఖర్చులో 18.5 శాతంతో తర్వాతి స్థానంలో ఉందని ఎడిఆర్ తెలిపింది. మార్చి 16– జూన్ 6, 2024 మధ్య ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కింలలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగగా, ఆ సమయంలో ఈ పార్టీలు కలిసి రూ.3,352.81 కోట్లు ఖర్చు తరువాయి 12లో

స్విస్ బ్యాంకులో భారీగా తగ్గిన

# భారతీయుల డిపాజిట్లు

గత పదేళ్లలో 18 శాతం తగ్గింపు



న్యూఢిల్లీ : గత పదేళ్లలో స్విస్ బ్యాంకుల్లో భారతీయుల డిపాజిట్లు దాదాపు 18 శాతం తగ్గాయి. 2015లో స్విస్ బ్యాంకుల్లో భారతీయుల డిపాజిట్లు సుమారు 425 మిలియన్ స్విస్ ఫ్రాంక్‌లు (సుమారు రూ.45,000 కోట్లు) ఉండగా, అవి 2024 నాటికి 346 మిలియన్ స్విస్ ఫ్రాంక్ లకు (రూ.36,600) తగ్గాయి. ఈ మేరకు స్విస్ నేషనల్ బ్యాంక్ తాజా గణాంకాలను విడుదల చేసింది. స్విస్ నేషనల్ బ్యాంక్ డేటా ప్రకారం, కొవిడ్ మహమ్మారి సమయంలో స్విస్ బ్యాంకుల్లో భారతీయుల డిపాజిట్లు గణనీయంగా పెరిగాయి. ఈ డిపాజిట్లు పది సంవత్సరాల గరిష్ఠ స్థాయి 602 మిలియన్ స్విస్ ఫ్రాంక్ లను తాకాయి. అయితే కొవిడ్ ముగిసిన తర్వాత స్విస్ బ్యాంకులో మళ్లీ భారతీయుల డిపాజిట్లు తగ్గడం ప్రారంభించాయి. 2023లో 309 మిలియన్ స్విస్ ఫ్రాంక్ ల డిపాజిట్లు ఉన్నాయి. 2024లో అవి 37 మిలియన్ స్విస్ ఫ్రాంక్‌లు పెరిగి 346 మిలియన్ తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## సౌదీ దౌత్యంతోనే కాల్పుల విరమణ: పాక్

**ఇస్లామాబాద్:** తమ దేశంపై దాడులు ఆపాలని భారత్‌ను కోరామని, సౌదీ అరేబియా భారత్‌తో జరిపిన చర్చల ఫలితంగానే కాల్పుల విరమణ జరిగిందని పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్ వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో దాడులు ఆపాలంటూ భారత్‌ను తామే స్వయంగా కోరినట్లు ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. పాకిస్థాన్‌లోని నూర్ ఖాన్, ఫోర్కోట్ వైమానిక స్థావరాలపై భారత్ దాడి చేసిందన్నారు. 'మే 67 తేదీల మధ్య రాత్రి ఎదురుదాడికి పాకిస్థాన్ సిద్ధమవుతున్నప్పుడు, భారత్ వైమానిక దాడి చేసింది. నూర్ ఖాన్‌షోర్కోట్ వైమానిక స్థావరాన్ని దెబ్బతీసింది' అని ఇషాక్ దార్ తెలిపారు. భారత దాడుల జరిపిన దాదాపు 45 నిమిషాల తర్వాత సౌదీ యువరాజు ఫైసల్ ఫోన్‌లో మాట్లాడారని చెప్పారు. భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో మాట్లాడాలా అని అడిగారన్నారు. మీరు ఆగిపోతే, భారత్ కూడా దాడులు ఆపవచ్చని ఆయన అన్నారని, ఇందుకు సుముఖత వ్యక్తం చేయడంతో సరే భారత్‌తో మాట్లాడతా అని చెప్పారు. జైశంకర్‌తో మాట్లాడిన తర్వాత నాకు ఫోన్ చేసి విషయం చెప్పారని ఇషాక్ దార్ వెల్లడించారు. సౌదీ దౌత్యంతోనే కాల్పుల విరమణ జరిగిందన్నారు. అయితే ఈ విషయంలో అమెరికానూ సంప్రదించినట్లు చెప్పారు.



# బాంబులు, బెదిరింపులకు లొంగం

### తెహ్రాన్ సహా ఇరాన్ వ్యాప్తంగా భారీ ప్రదర్శనలు: పాల్గొన్న వేలాది మంది

**తెహ్రాన్:** ఇజ్రాయిల్‌‒ఇరాన్ మధ్య ఎనిమిది రోజులుగా భీకర పోరు సాగుతోంది. అణ్వస్త్రాలు కలిగివున్న నెపంతో ఇరాన్ కీలక అణు కేంద్రాలు, స్థావరాలను ఇజ్రాయిల్ ధ్వంసం చేస్తోంది. ఇరాన్ కూడా ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా బాలిస్టిక్ క్షిపణులతో ఇజ్రాయిల్‌ను దెబ్బ తీస్తోంది. ఇజ్రాయిల్‌కు మద్దతుగా అమెరికా రంగంలోకి దిగడంతో యూద దేశం పనైపోయినట్టేనని ఇరాన్ ఎద్దేవా చేస్తోంది. ఇదే క్రమంలో బాంబులకు, బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదని ఇరాన్ ప్రజలు తేల్చిచెప్పారు. తమ నాయకుడు ఆయాతుల్లా ఖామేనీ కోసం ప్రాణాలిచ్చేందుకైనా సిద్ధమని ముక్తకంఠంతో నినదించారు. ఇజ్రాయిల్ దాడులు, అమెరికా బెదిరింపులకు వ్యతిరేకంగా రోడ్ల మీదకు వచ్చి నిరసన తెలిపారు. తలొగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. తమ నాయకుల కు అనుకూలంగా, ఇజ్రాయిల్ అమెరికాకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు ఇచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థన తర్వాత రాజధాని తెహ్రాన్‌తో పాటు దేశంలోని ప్రధాన నగరా ల్లో ప్రదర్శనలు నిర్వహించారు. దేశ సైన్యానికి మద్దతుగా నిర్వ హించిన ప్రదర్శనల్లో ఇరాన్ సీజే గులాం హుస్సేన్ మొహసెనీ, ఐఆర్‌జీసీ మాజీ కమాండర్ మేజర్ జనరల్ మహమ్మద్ అలీ జాఫరీ, పార్లమెంటు డిప్యూ టీ స్పీకర్‌తో పాటు అనేక మంది మంత్రులు, నాయకులు భాగస్వాములయ్యారు. పలస్తీనా, ఇరాన్ జెండాలతో కదం తొక్కారు.



'అవసరమైతే మా నాయకుడి కోసం ప్రాణాలు ఇస్తాం', 'ఇజ్రాయిల్ దాడులను తిప్పికొడతాం', అమెరికా బెదిరింపులకు భయపడబోం' అన్న బ్యానర్లను ర్యాలీలను ప్రదర్శించారు. నినాదాలతో ఆయా ప్రాంతాలను హోరెత్తించారు. వాయువ్య ఇరాన్‌లోని తాబ్రిజ్, దక్షిణ ఇరాన్‌లోని షిరాజ్ లోనూ భారీ ఎత్తున ప్రదర్శనలు జరిగాయి. తమ దేశ వ్యవహారాల్లో అమెరికా జోక్యాన్ని ఇరాన్ ప్రజ లు తీవ్రంగా ఆక్షేపించారు. 'ఇది దేశ ప్రజల సంఘీభావానికి.... ప్రతిఘటనల శు క్రవారం' అంటూ ఈ ర్యాలీలను స్థానిక మీడియా ప్రసారం చేసింది.

## భారత్ కోసం గగనతలాన్ని తెరిచిన ఇరాన్



తెహ్రాన్: ఇజ్రాయిల్‌ఇరాన్ మధ్య భీకర యుద్ధం జరుగుతున్నప్పటికీ అక్కడున్న భారతీయుల్ని వారి స్వదేశానికి తరలించేందుకు తె హ్రాన్ చర్చలు తీసుకుంది. భారత్ కోసం తమ గగనతలాన్ని శుక్రవారం తెరిచింది. దీంతో ఇరాన్ నుంచి దాదాపు వెయ్యి మంది భారతీ య విద్యార్థులతో తొలి విమానం భారత్‌కు బయల్దేరింది. ఇది రాత్రి 11 గంటలకు (భారత కాలమానం ప్రకారం) దిల్లీకి చేరుకునే అవకాశం ఉంది. మరో రెండు విమానాలు శనివారం బయల్దేరుతాయని సమాచారం. యుద్ధం కారణంగా గగనతలాన్ని మూసివేసిన ఇరాన్ కేవలం భారత్ కోసం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. భారతీయ విమానాలకు మాత్రమే అనుమతిచ్చింది

## ఫోన్‌కాల్ తెచ్చిన తిప్పలు

### థాయిలాండ్ ప్రధానికి పదవీ గండం



**బ్యాంకాక్:** థాయిలాండ్ ప్రధాని పెటోంగటార్న్ షినావత్రాను ఒక ఫోన్ కాల్ చిక్కుల్లో పడేసింది. ఆమె పదవికి గండం ఏర్పడింది. కంబోడియా మాజీ ప్రధాని హున్ సేన్‌తో ఆమె ఫోన్ సంభాషణ లీకైంది. దీంతో రాజకీయ దుమారం రేగింది. ఆమె రాజీనామాకు డిమాండ్ వచ్చింది. ఫోన్ కాల్‌లో తనకు ప్రత్యర్థిగా సంబోధించిన సీనియర్ సైన్యాధికారిని ఆమె శుక్రవారం కలిశారు. అందుకోసం ఆమే ఈశాన్య థాయిలాండ్‌లోని చోంగ్ బోక్ అనే ప్రాంతానికి వెళ్లారు. సెకెండ్ ఆర్మీ రీజన్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ బూన్‌సిన్ పడ్‌క్లాంగ్‌తో తన సంబంధాలను చక్కబెట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ మేరకు బ్యాంకాక్ పోస్టు వెల్లడించింది. 38 ఏళ్ల షినావత్రా ప్రధానిగా బాధ్యతలు చేపట్టి ఏడాది కూడా కాలేదు. ఈలోగా వివాదంలో చిక్కుకోవడంతో ఆమె బహిరంగంగా క్షమాపణ చెప్పుకోవాల్సి వచ్చింది. తమ సంభాషణను హున్ సేన్ ఆన్‌లైన్‌లో పెట్టడంతో వివాదం మొదలైంది. వీరిద్దరి మధ్య ఈనెల 15న ఫోన్ సంభాషణ జరిగింది. ఇటీవల థాయిలాండ్, కంబోడియా మధ్య సరిహద్దు ఘర్షణ గురించి ఇద్దరు చర్చించుకున్నారు. హున్ సేన్‌ను 'అంకుల్' అని సంబోధించిన షినావత్రా... లెఫ్టినెంట్ జనరల్ పడ్‌క్లాంగ్‌ను విరోధిగా వ్యవహరించారు. వీరిద్దరి ఫోన్ సంభాషణ లీకైంది. కంబోడియాథాయ్‌లాండ్ మధ్య సరిహద్దు వివాదాలతో సంబంధాలు దెబ్బతిన్న తరుణంలో తాజా పరిణామం వివాదాస్పదమైంది. ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. దేశ పరువు, ఆర్మీ గౌరవం మంటగలిపారంటూ ఆరోపణలు వచ్చాయి. తక్షణమే పదవిలో నుంచి తప్పుకోవాలని డిమాండ్ ఉంది. ఈ క్రమంలోనే షినావత్రా నేతృత్వ సంకీర్ణ ప్రభుత్వం నుంచి కన్జర్వేటివ్ భూమ్‌జాయ్‌థాయ్ పార్టీ విడిపోయింది. పార్లమెంట్‌లో 69 మంది ఎంపీలు ఆమెకు మద్దతు విరమించుకున్నారు. దీంతో మెజార్టీ పడిపోయింది. ఈ పరిస్థితి సంకీర్ణ ప్రభుత్వంలో తిరుగుబాటుకు సంకేతాలిస్తున్నది. అదే జరిగితే ప్రభుత్వం కుప్పకూలుతుంది. ఇది రాజకీయ అనిశ్చితికి దారితీయొచ్చు. మళ్లీ ఎన్నికలు రావచ్చు.

## పారిశ్రామిక వేత్తల చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సదస్సులో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక, పర్యావరణ బాధ్యతలతో కూడిన తెలంగాణను నిర్మించేందుకు యావత్ మంత్రివర్గం కట్టుబడి పనిచేస్తుందన్నారు. అన్నారు. అపార వనరులు ఉన్నా కానీ అసమానతలు ఉన్న ప్రపంచంలో జీవిస్తున్నామని, 'ట్రికిల్ డౌన్' ఆర్థిక వ్యవస్థలు పనిచేయలేవని స్పష్టమైందని, ఇప్పుడు కేవలం 'లిఫ్ట్ ఆల్' అందరినీ అభివృద్ధి చేయాలన్నది అనివార్యమన్నారు. ఆర్థిక వృద్ధి సామాజిక న్యాయం పునాదిపై నిలవాలని కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతమని, తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఆ సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. 'పారిశ్రామికవేత్తల చర్యలు దానం కోసం కాకుండా బాధ్యత కోసం కావాలి. వారి పని ప్రశంసల కోసం కాదు సామాజిక మార్పు కోసం' అని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. అందరి ప్రయత్నం సంస్థల నిర్మాణం కోసం మాత్రమే కాకుండా సమాజాల శ్రేయస్సు కోసం కూడా పనిచేయాలని సూచించారు. కార్పొరేట్ సంస్థలు సిఎస్ఆర్ నిధులను ఖర్చు చేసేందుకు తెలంగాణ రాష్ట్రం సరైన వేదిక అని, ఈ రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలు అనుకున్న లక్ష్యాలను నూటికి నూరు శాతం నెరవేర్చడమే కాకుండా ప్రతి పైసాను పారదర్శకంగా ఖర్చు చేసేందుకు అవకాశం ఉందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ సంస్థలు తెలంగాణ రాష్ట్రంలో సిఎస్ఆర్ నిధులను ఖర్చు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, నిర్వాహకులు అసోచామ్ ప్రతినిధులు సురేష్ చుక్కపల్లి, బారుల్ ఇస్లాం, అభిషేక రంజన్, కృష్ణ ఏదుల తదితరులు పాల్గొన్నారు.

## సిగ్గుచేటు కాదు

(మొదటి పేజీ తరువాయి)

అడగడం, సమానత్వం పొందడం ఇష్టం లేనందున బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ పేద పిల్లలు ఈ భాషను నేర్చుకోవాలని కోరుకోవడం లేదని ఆరోపించారు. 'ఇంగ్లీషు ఒక ఆనకట్ట కాదు, అది ఒక వంతెన. ఇంగ్లీష్ సిగ్గుచేటు కాదు, అది సాధికారతనిస్తుంది. ఇంగ్లీష్ ఒక గొలుసు కాదు... ఇది గొలుసులను విచ్ఛిన్నం చేయడానికి ఒక సాధనం' అని శుక్రవారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. భారతదేశంలోని పేద పిల్లలు ఇంగ్లీషు నేర్చుకోవాలని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కోరుకోవడం లేదు.. ఎందుకంటే వారు ప్రశ్నలు అడగాలని, ముందుకు సాగాలని, సమానత్వం పొందాలని అనుకోవడం లేదని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. నేటి ప్రపంచంలో ఒకరి మాతృభాష వలె ఇంగ్లీషు ముఖ్యమైనది. ఎందుకంటే అది ఉపాధిని అందిస్తుంది, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది అని చెప్పారు. 'భారతదేశంలోని ప్రతి భాషకు ఆత్మ, సంసృ్కతి, జ్ఞానం ఉన్నాయి. మనం వాటిని గౌరవించాలి అదే సమయంలో ప్రతి బిడ్డకు ఇంగ్లీష్ నేర్పించాలి. ప్రపంచంతో పోటీపడే, ప్రతి బిడ్డకు సమాన అవకాశాన్ని ఇచ్చే భారతదేశానికి ఇదే మార్గం' అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అన్నారు. ఇటీవల ఓ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. ఈ దేశంలో ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని అన్నారు. మన దేశాన్ని, మన సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదని పేర్కొన్నారు. విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలేమన్నారు. అయితే, ఇది ఎంత కష్టమో తనకు తెలుసని, అయినప్పటికీ ఇందులో భారత సమాజం విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు.

## చర్చలకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

మధ్య పరిష్కారం లభిస్తుందని, అనవసరమైన వివాదాలను కోరుకోవడంలేదన్నారు. కర్ణాటకతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నట్లే ఎపితోనూ కొనసాగించుకోవాలనేది తమ విధానమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఎలాంటి సమస్యలు ఉన్నాయో ఇప్పటికీ అలాంటి సమస్యలే ఉన్నాయన్నారు. బిఆర్‌ఎస్ సెంటిమెంటును అడ్డంపెట్టుకుని రాజకీయం చేయాలని చూస్తుందని, ఇప్పుడు గోదావరి జలాల సమస్యను చచ్చిపోయిన టిఆర్‌ఎస్ సంజీవనిలా వాడుకోవాలని చూస్తుందన్నారు. బనకచర్లపై తెలంగాణ అభిప్రాయం తప్పక తీసుకోవాల్సిందేనన్నారు. తెలంగాణా నీటి కేటాయింపులను వాడుకునే అవకాశం ఇవ్వకపోవడంతోనే వివాదం మొదలైందన్నారు. కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకోవడం మంచిదని, ఈ వివాదం పరిష్కారానికి ఎలాంటి డెడ్‌లైన్ లేదన్నారు. కింది రాష్ట్రంగా ఎపికి హక్కులు ఉన్నాయంటున్నారని, అదే రకమైన హక్కులు తెలంగాణకు కూడా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

**చంద్రబాబును తానే చర్చలకు ఆహ్వానిస్తా**

ఈ నెల 23వ తేదీన జరగనున్న తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో మంత్రులతో ఈ వ్యవహారాన్ని చర్చిస్తామని, అనంతరం బనకచర్లపై ఎపిని చర్చలకు ఆహ్వానిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అవసరమైతే ఏ ఎపి సిఎం చంద్రబాబును తానే స్వయంగా సమావేశానికి ఆహ్వానిస్తానన్నారు. ఎవరి ప్రయోజనాల కోసమో తమ రాష్ట్ర హక్కులను వదిలేసుకోబోమని సిఎం రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు.

**కాళేశ్వరంతో 50వేల ఎకరాలే కొత్త ఆయకట్ట**

కాళేశ్వరంతో 50 వేల ఎకరాలకు మాత్రమే కొత్తగా ఆయకట్ట లభించిందని సిఎం చెప్పారు. మొత్తం రూ.2 లక్షల కోట్ల ప్రాజెక్టుకు రూ.127,872 కోట్ల టెండర్లకు పిలిచారని, అందులో రూ.96 వేల కోట్లు చెల్లింపులు చేశారని, ఇంకా ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.50 వేల కోట్లు అవసరమని వివరించారు. కమీషన్ల కోసమే పేర్లు మార్చి అంచనాలు పెంచి ప్రాజెక్టులు కట్టారన్నారు. కిషన్ రెడ్డి ట్యూటర్ కెటిఆర్ అని, కెటిఆర్‌కు కిషన్‌రెడ్డి లైజనింగ్ ఆఫీసర్ అని సిఎం వ్యాఖ్యానించారు.

## భాషలపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

అది ప్రాంతాలను కలిపిందని, స్వాతంత్ర్య పోరాటంలో ఐక్యతను సాధించడానికి సహాయపడిందని గుర్తుచేశారు. అప్పటినుండి కుల,వర్గ, ప్రాంతీయ భేదాలు లేకుండా లక్షలాది మందికి సాధికారత కల్పించిందన్నారు. దానిని అవమానకరమైన మూలంగా అభివర్ణించడం భారతదేశ యువత, శ్రామిక ప్రజల ఆకాంక్షలపై దాడి చేయడమేనని వ్యాఖ్యానించారు. ఇది కేవలం ఇంగ్లీషు గురించేకాదని, సంఘ్‌పరివార్ హిందీ‒హిందూ‒హిందూస్థాన్ కోణంలో సరిపోని ప్రతి భారతీయ భాషపై దాడి అని పేర్కొన్నారు. భాష అధికారం ఇవ్వాలి, ఆధిపత్యం చెలాయించకూడదు లేదా ఇబ్బంది పెట్టకూడదని, ఈబెదిరింపును సంపూర్ణశక్తితో ప్రతిఘటించాలని డి.రాజా పిలుపునిచ్చారు.

**హిందీని రుద్దే దిశగా అమిత్‌షా వ్యాఖ్యలు : సిపిఐ ఎంపి పి.సందోష్ కుమార్...**ఇంగ్లీష్ మాట్లాడేవారు ఒకరోజు 'సిగ్గుపడతారు' అని చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్య భారతదేశ భాషా వైవిధ్యాన్ని అపఖ్యాతి పాలు చేయడానికి, ఆర్‌ఎస్‌ఎస్‒బిజెపిల సాంస్కృతిక ఆధిపత్యాన్ని ముందుకు తీసుకెళ్ళే ఉద్దేశపూర్వక ప్రయత్నంమని సిపిఐ రాజ్యసభ సభ్యులు పి.సందోష్‌కుమార్ విమర్శించారు. ఇంగ్లీష్ భారతదేశానికి అనుసంధాన భాషగా పనిచేస్తున్నదని, ప్రాంతాలను కలుపుతుందని, విద్య, ఉద్యోగం, ప్రపంచ అవకాశాలకు మార్గాన్ని సుగమం చేస్తుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దానిపై దాడి చేయడం అంటే ప్రజల, ముఖ్యంగా యువత, అట్టడుగు వర్గాల ఆకాంక్షలపై దాడి చేయడమేనని మండిపడ్డారు. అమిత్ షా వ్యాఖ్య భారతీయ భాషలను ఉన్నతీకరించడం గురించి కాదని, ఇది ఆర్‌ఎస్‌ఎస్ భాషా, సాంస్కృతిక ఆధిపత్య పథకానికి అనుగుణంగా ఇంగ్లీష్ స్థానంలో హిందీని తీసుకురావడానికి చేసే పనికిమాలిన చర్య అని అన్నారు. ఇది భారతదేశ బహుభాషా, సమాఖ్య స్వభావం, అన్ని భాషల మధ్య సమానత్వం అనే రాజ్యాంగ సూత్రాన్ని పూర్తిగా ధిక్కరణను సూచిస్తుందన్నారు. బిజెపి భినత్వంలో ఏకత్వాన్ని కోరుకోవడం లేదని, బలవంతంగా రుద్దడం ద్వారా ఏకరూపతను కోరుకుంటుందన్నారు. అమిత్ షా చేసిన వ్యాఖ్య కేవలం ఇంగ్లీష్‌పై మాత్రమే దాడి కాదని, అది తమిళం, మలయాళం, బెంగాలీ, తెలుగుపై దాడి అని, సంఘ్ పరివార్ హిందీ‒హిందూహిందుస్థాన్ భావనకు అనుగుణంగా లేని ప్రతి భాషకు అవమానం అని పేర్కొన్నారు. భాష అనేది సాధికారతకు ఒక సాధనమని, భావజాల నియంత్రణకు ఒక పరికరం కాదన్నారు. సాంస్కృతిక బెదిరింపు, హిందీ రుద్దే అన్ని ప్రయత్నాలను సిపిఐ గట్టిగా ప్రతిఘటిస్తుంది అని అన్నారు.

## విచారణ జరిపించాలి

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రంగా ఖండిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. వామపక్ష పార్టీలు, ప్రజాతంత్ర శక్తులు, పౌర హక్కుల సంఘాలు ఆపరేషన్ కగారును నిలిపివేయాలని నిరసన ధర్నాలు చేపడుతున్నా, శాంతి చర్చలకు తాము సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినప్పటకీ మావోయిస్టులను బూటకపు ఎన్కౌంటర్లు చేసి చంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా విశాఖ ఏజెన్సీలో ముగ్గురు మావోయిస్టులను చంపడం దుర్మార్గమన్నారు. ఈ ఎన్‌కౌంటర్లు మొత్తం బూటకమని, వీటిపై విచారణ జరిపించాలని సిపిఐ కోరుతుందన్నారు. 2026 మార్చి 31 వరకు దేశంలో నక్సలైట్లను పూర్తిగా అంతం చేస్తామనే కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రకటనకు అనుగుణంగా ప్రధాని మోదీ మావోయిస్టుల అంతానికి పూనుకున్నారని చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ మావోయిస్టులపై కుట్రలు చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. సమాజంలో అంతరాలు లేని సమాజం కోసం ఉద్యమిస్తున్న మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపి వారి డిమాండ్లను పరిష్కరించే దిశగా కృషి చేయాలని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.

## కెసిఆర్‌కు నైతికత లేదు

(మొదటి పేజీ తరువాయి)

కోదండరామ్ మాట్లాడుతూ పోలవరంబనకచర్ల ప్రాజెక్టుపై కెసిఆర్‌కు కనీసం మాట్లాడే నైతికతలేదని, ఈ ప్రాజెక్ట్ విషయంలో తెలంగాణ రాష్ట్ర బిజెపి నాయకత్వం ఎందుకు మౌనంగా ఉన్నదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రాంతానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన నష్టాన్ని ప్రాథమికంగా పరిగాణలోనికి తీసుకోవాలని, ఆ వెలుగులోనే నీటి కేటాయింపులు, ప్రాజెక్టులకు సంబంధించిన నిర్ణయాలు జరగాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగంలో తెలంగాణకు నష్టం జరిగిందని,ఎత్తున ఉన్నదనే నెపంతో నీళ్ళు ఇవ్వ కపోవడంతో తెలంగాణ ప్రధానంగా బావులు,బోర్లపైన ఆధారపడాల్సి వచ్చిందని కోదండరామ్ వివరించారు. మొత్తం తెలంగాణలో కాలువల కింద అయ్యే సాగు,ఆంధ్రప్రదేశ్‌లోని ఒక గుంటూరు జిల్లాలోని కాలువల కింద జరిగే సాగు కంటే తక్కువ అని అన్నారు. చట్టాలను, నిబంధనలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బేఖాతారు చేస్తూ పోలవరంబనకచర్ల ప్రాజెక్టు అనుమతుల కోసం నేరుగా కేంద్ర ప్రభుత్వానికి నివేదించిందన్నారు. ఫెడరల్ స్పూర్తికి తూట్లు పొడుస్తూ, తమ రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఎపి ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం పట్ల వివక్ష పూరితంగా వ్యవహరిస్తోందని మరోసారి స్పష్టమవుతోందన్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతగా ఉమ్మడి రాష్ట్రంలో జల వనరుల కేటాయింపుల్లో తలెత్తిన అసమానతలను సరి చేయాలని, రెండు రాష్ట్రాల మధ్య న్యాయసమ్మతమైన నీటి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నాడు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు అన్యాయం చేసి, ప్రస్తుతం మళ్లీ తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు రాకుండా ఆంధ్రాపాలకులు అభ్యంతరాలు లేవనెత్తుతున్నారని, ఢిల్లీతో ఉన్న రాజకీయ సంబంధాలతో తెలంగాణ ప్రాజెక్టులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పోలవరం బనకచర్ల నిర్మాణం పూర్తయితే గోదావరి జలాల్లో తెలంగాణ రాష్ట్రం తన వాటాను శాశ్వతంగా కోల్పోవల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి జలాల్లో తెలంగాణ నీటి వాడకాన్ని తక్కువగా చూపించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అక్రమంగా హక్కును పొందే ప్రయత్నం చేస్తోందని, వరద లేదా మిగులు జలాల పేరుతో నికర జలాలను తరలించుకునే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. ఈ కుట్రకు గత కెసిఆర్ ప్రభుత్వ హయాంలోనే బీజాలు పడ్డాయని, దీనిని ఎదుర్కొని తెలంగాణ హక్కులను కాపాడాల్సిన కెసిఆర్, బేసిన్లు లేవు భేషజాలు లేవని ఆంధ్ర పాలకులకే వంతపాడారని, తనస్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణను బలిపెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు అంబటి శ్రీనివాస్, ధర్మార్జున్, బైరి రమేష్, గోపగని శంకర్ రావు, పల్లె వినయ్, నిజ్జన రమేష్, సలీం పాషా, ఎం.నర్సయ్యగౌడ్, హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పక్కనపెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

గుర్తు చేశారు. దాని బదులుగా గతంలో నిర్ణయించిన ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్దనే బ్యారేజీ నిర్మిస్తే, ఒక్క లిఫ్టు ద్వారా ఎల్లంపల్లికి గ్రావిటీతో నీళ్ళు తీసుకెళ్ళే అవకాశం ఉండేదన్నారు. రీడిజైన్ పేరుతో దానిని పక్కనబెట్టి, కాళేశ్వరం పేరుతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు దిగువన నిర్మించిన మేడిగడ్డ,అన్నారం, సుందిళ్ల వద్ద బ్యారేజీల నుంచి ఎగువన ఎల్లంపల్లికి నీటిని లిఫ్టు చేయడం వ్యయ, ప్రయాసలతో కూడుకున్నదని చెప్పారు. ఆ మూడు బ్యారేజీలు పనిచేసినా విద్యుత్‌కు, అప్పుల తిరిగి చెల్లింపులకు ఏటా రూ.25 వేల కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఒకవేళ వాటిని తిరిగి నిర్మించినా, మరమ్మతులు చేసినా భవిష్యత్తులో ఎలా ఉంటాయని చెప్పలేమని, కాబట్టి విజిలెన్స్ నివేదిక, ఎన్‌డిఎస్‌ఎ తుది నివేదిక, జస్టిస్ పి.సి.ఘోష్ నివేదికలు వచ్చాక అఖిలపక్షాలు, ఇరిగేషన్ నిపుణులతో చర్చించాల్సిన అవసరం ఉందని కూనంనేని సూచించారు.

ఈ నేపథ్యంలో తక్షణమే తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని చేపట్టి, ఎల్లంపల్లికి నీరు తీసుకెళ్ళాలని, మధ్యలో ఆదిలాబాద్ జిల్లాకు నీళ్ళు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరంతో పాటు తుమ్మిడిహట్టిని కూడా చేపడతామన్నారని, ఎందుకు దానిని పూర్తి చేయాలని ప్రశ్నించారు. సుమారు రూ.లక్ష కోట్ల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరంలో ప్రధాన భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిరుపయోగంగా మారాయన్నారు. అయితే, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఎల్లంపల్లి నుంచి దిగువన మల్లన్నసాగర్, రంగనాయక సాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ తదితర రిజర్వాయర్‌లు ఉన్నందున, తుమ్మిడిహట్టి నుంచి నీళ్లు తీసుకున్నా ఇబ్బంది ఉండబోదన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన ఆ రిజర్వాయర్ లలో ఎక్కువ గతంలో ప్రాణహిత‒చేవెళ్ళ ప్రాజెక్టులో భాగంగా ఉన్నవేనని, కాకపోతే వాటి సామర్థ్యాన్ని భారీగా పెంచారని చెప్పారు.

తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కింద ఇప్పటికే 70 కిలో మీటర్ల మేరకు కాలువలు కూడా పూర్తయ్యాయని తెలిపారు. అక్కడి నుంచి దిగువ ప్రాంతాలకు నీరు వస్తున్న మైలారం వద్ద 20 మీటర్ల లిఫ్ట్ ఏర్పాటు చేస్తే అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా 40 కిలోమీటర్ల కాల్వ తవ్వితే నేరుగా ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీరు వస్తుందన్నారు. అందువలన కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను మినహాయించి మిగితా మేడారం, మోతే, మిడ్ మానేరు, అనంతగిరి, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, తిప్పారం రిజర్వాయర్‌లను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మూడు బ్యారేజీలను అలాగే వదిలివేసి వాటిలో అమర్చిన మోటర్లు, పంపులైన్లను ప్రాణహిత ప్రాజెక్టుకు వినియోగించుకోవచ్చాన్నారు. తమ్మిటి హట్టి ప్రాజెక్టు నిర్మిస్తే విద్యుత్ భారం ఏడాదికి కేవలం రూ.2వేల కోట్లు మాత్రం కానుండగా, కాళేశ్వర ప్రాజెక్టుతో ఏడాది అవుతున్న రూ.10వేల కోట్ల విద్యుత్ భారం కూడ తప్పుతుందన్నారు. రూ. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం నిర్మాణంలో అవినీతి చోటు చేసుకుందనేది నిజమని, ఎందుకంటే ఆ ప్రాజెక్టు ఇంజనీర్లపై ఎసిబి దాడుల్లో కోట్లు బట్టైపడుతున్నాయని, అయితే ఏమేరకు జరిగిందనే విచారణ సంస్థలు నిగ్గు తేల్చుతాయని ఓ ప్రశ్నకు కూనంనేని సాంబశివరావు జవాబు చెప్పారు.

**బనక చర్లను ఎపి తక్షణమే నిలిపి వేయాలి :**

తెలంగాణ రాష్ట్రానికి నష్టం చేకూర్చేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్మిస్తున్న బనక చర్ల ప్రాజెక్టును నిలిపివేయాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. వరద జలాలపై తెలంగాణకు సైతం హక్కు ఉంటుందని, ఇందుకు సంబంధించి వాటాను తేల్చకుండా ఎపి ఏకపక్షంగా ప్రాజెక్టును ఏలా నిర్మిస్తుందని ప్రశ్నించారు. జల వివాదాలు ఉభయ తెలుగు రాష్ట్రాలకు మంచిది కాదని హితవు పలికారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు సాగునీటి పారుదల రంగం నిష్ణాతులతో అన్నివిధాలు చర్చించి సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మరోవైపు రూ. 85వేల కోట్ల భారీ వ్యయంతో తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును ఎపిలోని రైతు సంఘాలు, ప్రజలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో రెండు రాష్ట్రాలు కూర్చుని సుమారు సముద్రంలో కలిసే 3000 టిఎంసిల జలాలు ఎవరి వాటా ఎంతో తేల్చుకున్న తర్వాతే కట్టుకోవచ్చు అన్నారు. అలాకాకుండా రాజకీయ లబ్ది కోసం అనసర జల వివాదాలు సృష్టించి,తెలుగు ప్రజల మధ్య వైషమ్యాలను పెంచేలా చేయడం సరైంది కాదన్నారు.

**కాళేశ్వరంతో ఎన్ని ఎకరాలకు నీరుఇచ్చారో శ్వేత ప్రతం విడుదల చేయాలి : పశ్యపద్మ**

రూ.1.47లక్షల కోట్ల వ్యయంతో తలపెట్టి ఇప్పటికే లక్ష కోట్లను ఖర్చు చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎన్ని ఎకరాలకు సాగు నీరు అందించారో శ్వేత పత్రం విడుదల చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం గత ప్రభుత్వం రాష్ట బడ్జెట్ నుంచి రూ.32 వేల కోట్లు ఖర్చు చేయగా, మిగిలిన మొత్తం అప్పును తీసుకువచ్చి ప్రజలపై మేయలేని భారం మేపిందని ఆగ్రహంవ్యక్తం చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, కాళేశ్వరం ప్రాజెక్టు మధ్య కేవలం రెండు లక్షల ఎకరాల మాత్రమే తేడా ఉందని, ఇందుకు లక్షకోట్లు ఖర్చుచేయడం ఏమి అవసరమొచ్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిసి పిసి ఘోష్ కమిషన్ విచారణను వేగవంతం చేసి సాధ్యమైనంత తర్వగా ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని కోరారు. అదేవిధంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై బహిరంగ చర్చ జరిపాలని పశ్య పద్మ డిమాండ్ చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS



## రాష్ట్రంలో ముందస్తుగా బోట్ డ్రిల్ నిర్వహణ

అగ్నిమాపక శాఖ డిజి వై.నాగిరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బోట్ డ్రిల్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయా జిల్లాల ఫైర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వర్షాకాలంలో వరదల్లో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలనే అంశంపై అగ్నిమాపక శాఖ డ్రిల్ నిర్వహించింది.




## 7ఎకరాల వరకు రైతు భరోసా రూ.905.89 కోట్ల నిధులు జమ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తొమ్మిది రోజుల్లో వానాకాలం రైతు భరోసా సహాయానికి పూర్తి నిధులు విడుదల చేస్తామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వరుసగా 5వ రోజు ఏడు ఎకరాల వరకు రైతుభరోసా నిధులను విడుదల చేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు శుక్రవారం తెలిపారు. ఇందుకోసం మరో రూ.905.89కోట్లు రైతుభరోసా కోసం విడుదల చేసామని, దీని ద్వారా 2.64 లక్షల మంది రైతులు లబ్ధి పొందారని మంత్రి పేర్కొన్నారు. కేవలం 5 రోజుల్లోనే రూ.7310.59 కోట్లు విడుదల చేసామని, ఇప్పటివరకు 65.12లక్షల మంది రైతులకు రైతు భరోసా సహాయం అందుకున్నారన్నారు. ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన రైతులకు కూడా రైతుభరోసా సహాయం అందచేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.



## 'కైటెక్స్' యూనిట్ల అవినీతి
## కెసిఆర్, కెటిఆర్‌లపై ఎసిబికి ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఔటర్ రింగ్ రోడ్డు టోల్ లీజు టెండర్లు, కైటెక్స్ గార్మెంట్స్ యూనిట్ల ఏర్పాటులో భారీగా అవినీతి జరిగిందని, బాధ్యులైన మాజీ సిఎం కెసిఆర్, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌లపై కేసు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ బిసి పొలిటికల్ జెఎసి రాష్ట్ర ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ శుక్రవారం ఎసిబి డిజికి కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఔటర్ టోల్ టెండర్ పొందిన ఐఆర్‌బి ఇన్ ఫ్రా సంస్థ నుంచి, కైటెక్స్ గార్మెంట్స్ నుంచి బిఆర్‌ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో పెద్ద మొత్తంలో నిధులు అందాయని ఆరోపణలు చేశారు. కెసిఆర్, కెటిఆర్.. క్విడ్ ప్రోకోకు పాల్పడటం ద్వారా అధికారాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ఐఆర్‌బి ఇన్ ఫ్రా సంస్థకు 30 ఏళ్లపాటు ఔటర్ టోల్ వసూళ్లను అప్పగించడం పెద్ద కుంభకోణం అని, ఇందులో రూ.7,380 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు..నిర్వహణ ఖర్చు ఎక్కువ అయ్యే ప్రాంతాన్ని హెచ్‌ఎండీఏ పరిధిలో ఉంచి, ఆదాయం వచ్చే మార్గాన్ని ఐఆర్బీ ఇన్ ఫ్రా సంస్థకు కట్టబెట్టారని తెలిపారు. 2023 ఏప్రిల్ 27న ఐఆర్బీకి ఔటర్ టోల్ కాంట్రాక్ట్ దక్కితే.. 2023 జూలై 4న ఐఆర్బీ సంస్థ రూ.25 కోట్ల ఎలక్ట్రోరల్ బాండ్లు కొనుగోలు చేసిబిఆ రఎస్ పార్టీకి ఇచ్చిందని, వారం రోజుల్లోనే ఆ డబ్బును బిఆర్‌ఎస్ విత్ డ్రా చేసుకుందని వివరించారు. తద్వారా క్విడ్ ప్రోకో చోటుచేసుకుందని పేర్కొన్నారు. కెసిఆర్, కెటిఆర్‌ల పై వెంటనే కేసులు నమోదు చేసి త్వరితగతిన విచారణ జరిపి అరెస్ట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోటూరి రవీందర్ గౌడ్, వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు గూడుషా, తదితరులు పాల్గొన్నారు.

## అర్చకుల జీవితాల్లో 'కొండంత' ఆశలు

రూ.32 లక్షల చెక్కును అర్చకులు, ఉద్యోగులకు అందజేసిన మంత్రి కొండా సురేఖ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేవాదాయ శాఖలో కొన్ని సంవత్సరాల తరబడి పనిచేస్తున్న అర్చకులు, ఉద్యోగుల జీవితాల్లో రాష్ట దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆశలు నింపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకుల దీర్ఘకాలిక కోరికను నెరవేర్చారు. అన్ని ఆలయాల్లో సుదీర్ఘ కాలంగా సేవలు అందిస్తున్న అర్చక, ఉద్యోగ సంక్షేమ నిమిత్తం ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేశారు. రాష్ట దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎండోమెంటు డైరెక్టర్ వెంకటరావు తదితర అధికారులతో అర్చక, ఉద్యోగ సంక్షేమ నిధి చెక్‌ను గురువారం అందజేశారు. 18మంది ఉద్యోగులకు అర్చక సంక్షేమనిధి ట్రస్టు ద్వారా గ్రాట్యుటీ, మెడికల్ సాయం అందజేశారు. రూ.32 లక్షల చెక్కును ఉద్యోగులకు కొండా సురేఖ ఇచ్చారు. విడివిడిగా వారికి ఆర్డర్ కాపీలు అందజేశారు. అనంతరం రిటైర్ అయిన ఉద్యోగుల ను మంత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... అర్చక, ఉద్యోగుల సంక్షేమం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు. ఈ సంక్షేమ ట్రస్టు ద్వారా దేవాదాయ శాఖ పరిధిలో గల సహాయ కమీషనర్ స్థాయివరకు గల దేవాలయాలలో పనిచేసే సుమారు 13,700 మంది అర్చకులు, ఇతర ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని ఆమె చెప్పారు. వారికి మరణానంతరము లేదా రిటైర్మెంట్ గ్రాట్యుటీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ధూప దీప నైవేద్య అర్చకులకు మరణానంతరం చెల్లించే గ్రాట్యుటి నిర్ధారించినట్టు చెప్పారు. మరణానంతరం చెల్లించు ఎక్స్‌గ్రేషియా, అంతిమ సంస్కారాల ఖర్చుల నిమిత్తము చెల్లింపు ఈ నిధి ఉపయోగపడుతుందన్నారు. ఈ నిధి కింద ఉద్యోగులకు.... మెడికల్ రీయింబర్స్‌మెంట్, వివాహ నిమిత్త పథకం, ఉపనయన పథకం, గృహ నిర్మాణ, కొనుగోలు, మరమ్మత్తుల నిమిత్త పథకం, విద్యా పథకం, విధులు నిర్వహించలేని వికలాంగులైన ఉద్యోగులకు ఆర్థిక సహాయ పథకం అందజేయడం జరుగుతుందన్నారు.

**మంత్రికి రుణపడి ఉంటాం: అర్చక, ఉద్యోగులు**

ఏండ్ల తరబడి పెండింగ్ ఉన్న సమస్యను తీర్చినందుకు మంత్రి కొండా సురేఖకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి తమకు కొండంత సాయం చేశారు. వివిధ పథకాలలో రెగ్యులర్ అర్చకులు, ఇతర ఉద్యోగులకు మరణానంతరము లేదా రిటైర్మెంట్ గ్రాట్యూటి పథకానికి మే 28న అర్చక సంక్షేమ బోర్డు ద్వారా గ్రాట్యుటీ రూ.4 లక్షల నుండి రూ.8లక్షలకు పెంచడం హర్షణీయం. ఈ గ్రాట్యుటీ మొత్తమును సదరు ఉద్యోగి యొక్క బ్యాంకు ఖాతాలో ఏక మొత్తములో వారి సర్వీసు కాలమునకు లోబడి చెల్లించడం చాలా సంతోషకరమన్నారు. ఎవరైనా అకారణంగా చనిపోతే, అంతిమ సంస్కారాల ఖర్చుల నిమిత్తం రూ.20,000/–ల నుండి రూ.30,000/–లకు పెంచడం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

## మున్సిపాలిటీల అభివృద్ధే సిఎం లక్ష్యం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** హైదరాబాద్ సమీప మున్సిపాలిటీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్నది రాష్ట ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంకల్పమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) కె.రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శంషాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, సంబంధిత శాఖల సెక్రటరీలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ హైదరాబాద్ చుట్టుపక్కల వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీల అభివృద్ధిని పరిశీలించుటకు సిఎం ఆదేశాల మేరకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే ఈ పర్యటన ఉద్దేశమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. ఇటీవల కొన్ని గ్రామాలు ఒఆర్‌ఆర్ అవతలి వైపు, ఒఆర్‌ఆర్ పక్కన గల గ్రామాలు, జిహెచ్‌ఎంసిలో విలీనమైనందున ఆయా గ్రామాల మౌలిక సదుపాయాలు ఏ మేరకు అభివృద్ధి చెందుతున్నాయో తెలుసుకోవటానికి ఈ మున్సిపాలిటీని సందర్శిస్తున్నానని, ముందుగా శంషాబాద్ మున్సిపాలిటిని సందర్శిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. త్రాగునీటి సౌకర్యం సమీక్షించగా దానిపై జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కాలనీలలో పైప్ లైన్లను వేయాలని, అందుకు సంబంధించిన ఎస్టిమేట్లను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ తాగునీటి కొరత లేకుండా కావలసిన నిధులను గ్రామపంచాయతీలకు, మునిసిపాలిటీలకు విడుదల చేస్తున్నట్లు వివరించారు.తదుపరి ముఖ్య కార్యదర్శి పన్ను వసూళ్లలో ఈ సంవత్సరం 23 శాతం అతి తక్కువగా చేయడంపై లక్ష్యాలను అధిగమించాలని, కొత్త ఇండ్ల అసెస్మెంట్‌లను చేయించి మున్సిపాలిటీల ఆదాయం పెంచాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ ఏ విధంగా ఉందని, ప్రజల నుండి సమస్యలు రాకుండా చూడాలని చెప్పారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, వాటి పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ పరిధిలో విద్యుత్ దీపాలు, వార్డుల్లో నాలాల శుభ్రత, తదితర అంశాల్లో తగిన ప్రాధాన్యత ఇచ్చి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పనిచేయాలని అధికారులకు ముఖ్య కార్యదర్శి సూచించారు. అనంతరం కోత్వాల్ గూడాలో నిర్మాణంలో ఉన్న హెచ్‌ఎండిఎ ఎకో పార్కును సందర్శించి అక్కడి పక్షుల పార్కులోని వివిధ దేశాల పక్షులు, గార్డెనింగ్ ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయని నిర్వాహకులకు తెలియజేశారు. అనంతరం రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు.

ఈ పర్యటనలో రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇలంబర్తి, హెచ్‌ఎండిఎ సెక్రటరీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, ఆర్డిఓ వెంకట్ రెడ్డి, హౌసింగ్ పిడి హనుమంత్ నాయక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 24న టిపిసిసి నూతన కమిటీల సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) నూతన కమిటీల సమావేశం ఈ నెల 24వ తేదీన ఉదయం 11 గంటలకు గాంధీభవన్‌లో జరుగుతుందని టిపిసిసి తెలియజేసింది. సమావేశంలో ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పాల్గొంటారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గాంధీ భవన్‌లో 24న ఉదయం 11 గంటలకు తొలుత టిపిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం, అనంతరం టిపిసిసి సలహా కమిటీ సమావేశం జరుగుతుంది. మధ్యాహ్నం నూతనంగా నియమితులైన టిపిసిసి ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల సమావేశం జరుగుతుంది. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలను అందించనున్నట్లు టిపిసిసి తెలియజేసింది.

## ఘనంగా బ్రాస్ బ్యాండ్ పాసింగ్ ఔట్ పరేడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీలో పోలీసు బ్రాస్ బ్యాండ్ (కానిస్టేబుళ్లు) పాసింగ్ ఔట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా డిజిపి డాక్టర్ జితేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అకాడమీలో శిక్షణ పొందిన 53 మంది బ్రాస్ బ్రాండ్ సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. బ్రాస్ బ్యాండ్ అధికారులు ఇచ్చిన ప్రదర్శన చాలా అత్యున్నతంగా ఉందని, భవిష్యత్తులో రాష్ట్రంలో బెస్ట్ బ్యాండ్‌గా గుర్తింపు పొందుతారని ప్రశంసించారు. రాబోయే ఆగస్టు 15 అలాగే రిపబ్లిక్ డే, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భాలలో ఈ శిక్షణ పొందిన టీమ్ ద్వారా ప్రదర్శనలు ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. ఈ శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరు మందికి డిజిపి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి తదితరులు పాల్గొన్నారు.




## హామీల అమలు తర్వాతనే..స్థానిక ఎన్నికలు

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసిన తర్వాతనే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలను నిర్వహించాలని బిఆర్‌ఎస్ మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ముందుగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఖరారు కావాలన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ వర్షాకాలంలో ముమ్మందు వానలు, వరదల పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదని, ప్రస్తుత వరదలతో రిజర్వాయర్లు నింపేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సంగంబండ గేట్లకు, భూత్పుర్ రిజర్వాయర్ గేట్లను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## కొండా దంపతులపై కాంగ్రెస్‌లో తిరుగుబాటు!

- నాయిని ఇంట్లో వరంగల్ ఎమ్మెల్యేల భేటీ
- వీడియోలతో సహా పిసిసి చీఫ్‌కు ఫిర్యాదు




**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళీధర్ రావు సొంత పార్టీ ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో దూమారం రేపుతున్నాయి. సొంత పార్టీ ఎమ్మెల్యే లపై చేసిన వ్యాఖ్యలతో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మంత్రి సురేఖ మురళీధర్ రావులపై తిరుగుబాటు ప్రకటించినట్లు స్పష్టమవుతోంది. వరంగల్ నగరంలో గురువారం రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చేసిన వ్యాఖ్యలపై నేతలు గరం అవుతున్నారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఇంట్లో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, రేవూరి ప్రకాశ్ శ్రీరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిడబ్ల్యూఎంసి మేయర్ గుండు సుధారాణి, వరంగల్ డిసిసి అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల కొండా దంపతుల తీరుపై సమావేశంలో పాల్గొన్న నాయకులు చర్చించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా మురళిపై అధిష్టానికి ఫిర్యాదు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

**కొండా వివాదాస్పద వ్యాఖ్యలు :** రాహుల్ గాంధీ జన్మ దినాన్ని పురస్కరించుకుని గురువారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ పరకాల, స్టేషన్‌ఘన్పూర్ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరిని లక్ష్యంగా చేసుకుని విమర్శించిన విషయం తెలిసిందే. అలాగే ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లు ఇజ్జత్ ఉంటే పదవులకు రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయాలంటూ కడియం, సారయ్యలను ఉద్దేశించి సవాల్ చేశారు. దీంతో కొండా వ్యాఖ్యలపై సొంత పార్టీ ప్రజాప్రతినిధులలో ఆగ్రహ జ్వాలలు మొదలయ్యాయి. ఈ క్రమంలో టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్‌కు జిల్లా ఎమ్మెల్యేలు మురళీ ప్రసంగం వీడియోలతో సహా ఫిర్యాదు చేశారు.

**పాపాలను మోయలేం–ఎమ్మెల్యేలు :** రాష్ట్ర మంత్రి కొండా సురేఖ దంపతుల పాపాలను ఇక మోయలేమని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఇంట్లో సమావేశం అయిన అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు మీడియా తో మాట్లాడారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్న మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై తక్షణ మే చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. చాలాకాలం నుంచి వారి ని భరిస్తున్నామని, ఇక వారి పాపాలను మోయలేమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ లైను దాటే వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు.

## అన్ని వేళ్లూ కెసిఆర్ వైపే

గోనె ప్రకాష్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో అన్ని వేళ్లు కెసిఆర్ వైపే చూపిస్తున్నాయని మాజీ ఎంఎల్‌ఏ గోనె ప్రకాష్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. సిట్ అధికారులు శుక్రవారం గోనె ప్రకాష్ వాంగ్మూలం రికార్డు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..తన ఫోన్ కూడా బిఆర్‌ఎస్ ప్రభుత్వం ట్యాపింగ్ చేయించిందన్నారు. ఈ కేసులో నిందితులైన పోలీసులు టి.ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌లకు రిటైర్డ్ అయినా బిఆర్‌ఎస్ ప్రభుత్వం తిరిగి పోస్టింగ్‌లు ఇచ్చిందని, అలాగే మరో నిందితుడు డిఎస్‌పి ప్రణీత్‌రావుకు అక్రమంగా పదోన్నతి కూడా ఇచ్చారని ఆరోపించారు. కెసిఆర్ మెప్పుకోసం వీరంతా రాజకీయ, సినిమా, జడ్జిలు, జర్నలిస్టుల ఫోన్‌లను ట్యాపింగ్ చేశారని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్ తతంగమంతా బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ కనుసన్నల్లోనే జరిగిందని అన్నారు. ట్యాపింగ్ చేసిన ఆడియోలను కెసిఆర్‌తో పాటు మాజీ ఎంపి సంతోష్ రావులకు ఇచ్చారని తెలిపారు. నాడు ఓటుకు నోటు అంశం ఈ ఫోన్ ట్యాపింగ్ ద్వారానే వెలుగులోకి వచ్చిందని కామెంట్ చేశారు. అదేవిధంగా సొంత పార్టీ నేతలు ఎంఎల్‌సి కవిత,పైలెట్ రోహిత్ రెడ్డి, రేగా కాంతారావు ఫోన్లకు కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. రాష్ట్రంలోని పెద్ద పెద్ద బిజినెస్మెన్లు, సినిమా వాళ్ల ఫోన్లను కూడా వదిలిపెట్టలేదని అన్నారు. ఎలాగైనా హ్యాట్రిక్ విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ చేశారని ఫైర్ అయ్యారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఫోన్ ట్యాపింగ్ పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో జరిగిందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

**ఐదో సారి విచారించిన సిట్..**

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎ–1 నిందితుడిగా ఉన్న ఎస్‌ఐబి మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావును సిట్ అధికారులు ఐదవసారి శుక్రవారం ఎనిమిది గంటల పాటు విచారించారు. విచారణలో ప్రభాకర్‌రావు సిట్ అధికారులకు సహకరించడంలేదని తెలిసింది.దీంతో పాటు బిజెపి పార్టీకి చెందిన ఇద్దరిని నుంచి వాంగ్మూలం తీసుకున్నారు.

## ముంపు గ్రామాలు తిరిగి తెలంగాణలోకి...

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలవరం ప్రాజెక్టు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన ఐదు ముంపు గ్రామాలను తిరిగి తెలంగాణ రాష్ట్రంలో విలీనం చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. పోలవరం ముంపుపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు సంయుక్త సర్వే నిర్వహించాలని సూచించారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సోమాజి గూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణ రాష్ట్రంలో తలెత్తే ముంపుపై జాయింట్ సర్వేచేసి ముంపు బాధితులకు మెరుగైన పరిహారం ఇచ్చి, పునరావాసం కల్పించాలని, పోలవరం ప్రాజెక్టు డిశ్చార్జి కెపాసిటీని ఏపి ప్రభుత్వం అక్రమంగా 50లక్షల క్యూసెక్కులకు పెంచే ప్రయత్నం చేస్తోందని, పోలవరం జాతీయ ప్రాజెక్టు నేపథ్యంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, ఆ ప్రయత్నాలను అడ్డుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో భద్రాచలం డెవలప్‌మెంట్ ఫోరం, ఐదు గ్రామ పంచాయతీల హక్కుల సాధన సమితి నాయకులు జంగిలి సంపత్, ఆవులూరి సత్యనారాయణ, దాసరి బాలకృష్ణ, వివిధ ప్రజాసంఘాల నాయకులు వీరన్న, తదితరులు పాల్గొన్నారు.






తెలంగాణ వ్యవసాయం, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవనం గేట్ వద్ద జై జవాన్... జై కిసాన్ పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీ బోర్డును శుక్రవారం రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి ఆసక్తిగా పరిశీలిస్తున్న దృశ్యం.

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ
టెండర్ నోటీసు నెం. 03/2025-26 OF DEE/OP/HABSIGUDA
హబ్సిగుడ డివిజన్, హబ్సిగుడ సర్కిల్‌లోని హబ్సిగుడ & ఉప్పల్ సబ్ డివిజన్‌లోని హబ్సిగూడ & ఉప్పల్ భగాయత్ సెక్షన్ యొక్క వివిధ విభాగాలు టెండర్ **1. SP.No.05/25-26** (జనరల్) వార్షిక నివారణ నిర్వహణ, బ్రేక్‌డౌన్ నిర్వహణ మరియు 3-వే, 5-వే ఫ్యాక్టరీ మరమ్మతులు లేదా ఏదైనా ఇతర కాన్ఫిగరేషన్ RMU (ప్రొపెరిటరీ స్పేర్స్ యొక్క యూనిట్ విలువ (అనుబంధం-I) & లేబర్‌తో కూడిన కన్స్యూమబుల్స్ / మైనర్ స్పేర్స్(అనుబంధం-II) కోసం రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించడమైనవి. పైన పేర్కొన్న టెండర్ల అమ్మకానికి చివరి **తేది: 28.06.2025 నుండి 17:00 గంటల వరకు**. మరింత సమాచారం డివిజనల్ కార్యాలయం నుండి పొందవచ్చు. ఇంజనీర్/ఓపి/హబ్సిగూడ. సంప్రదిచవలసిన నెం. శ్రీ, డిఇఇ/ఓపి/హబ్సిగూడ. ఫోన్ నం. 9440813131, ఇమెయిల్ ఐడి: dehabsiguda131@gmail.com
DIPR R.O. No. : 3901-PP/CL/ADVT/1/2025-26, Date: 20-06-2025 సం/- డిఇఇ/ఓపి/హబ్సిగూడ.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.9, చార్మినార్ జోన్.
NIT No. 17/EE.Div.NO.9/GHMC/24-25 షార్ట్ టెండర్ నోటీస్ తేది: 19.06.2025
**పని వివరణ:** నిర్వహణ పని (08) నెం.లు, **అంచనా విలువ:** రూ.36.32లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** ప్రారంభ తేది: 20.06.2025న మ.03.00గం.ల నుండి, ఆఖరి తేది & సమయం: 23.06.2025న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ జి.హరి కిషోర్, సెల్ నెం. 9849906768. జతపరచబడింది: పనుల వివరాలు కాపీ.
**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-9, సిఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి.**
DIPR R.O. No. : 3870-PP/CL/ADVT/1/2025-26, Date: 20-06-2025

ప్రజాపక్షం
శనివారం, 21 జూన్

# యుద్ధాలతో బాల్యం ఛిద్రం

దేశాలు ఆధిపత్య పోరాటం చేస్తుంటే, బాధిత ప్రజలు క్షణమొక యుగంగా రోజులు దొర్లిస్తున్నారు. అక్కడ బాల్యం ఛిద్రమవుతున్నది. ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక ప్రకారం, ఒక్క గాజా ప్రాంతంలోనే పిల్లలపై హింస గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగింది. వారు చదువుకునే పాఠశాలలపై దాడులు… గాయపడి చికిత్స పొందుతున్న ఆసుపత్రులపై దాడు లు… చివరికి శరణార్థి శిబిరాలపైనా దాడులే. ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న ఈ మారణహోమంలో పాలస్తీనా పిల్లలే సమిధలు. గాజాలో ఇజ్రాయెల్ సైన్యం పిల్లల నవ్వులపై తుపాకీ గురిపెడుతున్నది. విద్యను నిలువునా నరికేస్తున్నది. వారి ఉజ్వల భవిష్యత్తును సజీవసమాధి చేస్తున్నది. తల్లి ఒడిలో ఆటలాడాల్సిన చిన్నారులు బాంబుల మోతలకు ఉలిక్కిపడుతున్నారు. ఏమయిందో అర్థమయ్యేలోపే, శిథిల భవనాల కింద సజీవ సమాధులవుతున్నారు. వాళ్ల బాల్యం రక్తమోడుతున్నది. 2024లో పిల్లలపై హింస ఏకంగా 25 శాతం పెరిగినట్టు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. లెక్కకురాని, ఎవరూ పట్టించుకోని ఘటనలు ఇంతకు రెట్టింపు అన్నది చేదు నిజం. పాఠశాలలకు పరుగులు తీయాల్సిన కాళ్లు నిస్సహాయంగా, శవాల మధ్య తడబడడానికి ఇజ్రాయెల్ సామ్రాజ్యవాద ధోరణే కారణం. అక్కడ కాలిపోతున్నవి భవనాలు మాత్రమేకాదు.. పిల్లల కలలు, నవ్వులు, కేరింతలు కూడా. వాస్తవానికి, యుద్ధం ఎప్పటికీ అనర్థదాయకమే. విధ్వంస కాండ ప్రగతికి అడ్డుగోడ. బాలల హక్కులపై దాదాపు అన్ని ప్రపంచ దేశాల్లోనూ ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. వారి మెరుగైన జీవితాల కోసం ఎన్నో పథకాలు ఉన్నాయి. ఇవే చట్టాలు… పథకాలు తాము శత్రువులుగా చూస్తున్న దేశాల్లోని బాలలకు కూడా ఉంటాయన్న కనీస జ్ఞానం యుద్ధోన్మాద దేశాలకు ఎందుకు ఉండదో? గాజా స్ట్రిప్‌లో పిల్లలపై 41,370 అత్యంత తీవ్రమైన హింసాత్మక ఘటనలు నమోదయ్యాయన్న ఐక్యరాజ్యసమితి నివేదిక ఆందోళన కలిగిస్తున్నది. హత్యలు… శారీరక హింసలు.. దూషణలు… లైంగిక దాడులు.. ఇలా, చిత్రహింసలకు ఇజ్రాయెల్ సైనికులు ఏ ఒక్క మార్గాన్నీ విడిచిపెట్టలేదు. హమాస్‌పై యుద్ధం పేరుతో, గాజాలోని జనావాసాలు, పాఠశాలలు, ఆసుపత్రులపై దాడులు ఇజ్రాయెల్ పైశాచికత్వానికి పరాకాష్ట. ఇజ్రాయెల్ సైన్యాన్ని ఐక్యరాజ్యసమితి 'బ్లాక్ లిస్ట్'లో పెట్టడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. ప్రపంచ దేశాలు అందిస్తున్న మానవ తాసాయాన్ని కూడా గాజాలో పిల్లలకు అందకుండా అడ్డుకుంటూ, ఆహారం కోసం వెళ్లిన వారిపై తుపాకీ గుళ్లు కురిపిస్తున్న ఇజ్రాయెల్ సైన్యం వికృతరూపం ప్రపంచ పటంపై ఇప్పటికే ఆవిష్కృతమైంది. ఇలా యుద్ధంతో బాల్యం మసకబారుతున్న వైనం కేవలం గాజాకు మాత్రమే పరిమితం కాలేదు. కాంగో, సొమాలియా, నైజీరియా, హైతీ వంటి ఎన్నో దేశాల్లోనూ కనిపిస్తున్నది. విదేశీ దాడులు లేదా అంతర్యుద్ధాలు… కారణాలు ఏవైనా, బాలలే మొదటి బాధితులు. పెన్ను పట్టుకొని పాఠశాలకు వెళ్లాల్సిన పిల్లల చేతికి గన్నులిచ్చి యుద్ధ భూమికి తరలిస్తున్న దుర్మార్గం. అస్తిత్వపోరాటంలో బాల్యం అంటే ఏమిటో తెలియని పిల్లల దైన్యం. యుద్ధాలకు ముగింపు పలికితేనే వారికి ఊరట. మెరుగైన భవిష్యత్తుకు బాసట. స్వలాభాల కోసం దేశాలను రెచ్చగొట్టి, యుద్ధాలను ప్రోత్సహించే విధానాలకు తెరపడాలి. యుద్ధ బాధిత ప్రాంతాల్లోని పిల్లలకు తక్షణ సాయాన్ని అందించే ప్రత్యేక వ్యవస్థ రావాలి. ఇజ్రాయెల్ వంటి యుద్ధోన్మాద దేశాలను అంతర్జాతీయ సమాజమే కట్టడి చేయాలి. వెలివేసి… ఏకాకులను చేసి… దారికి తేవాలి. సమస్య ఏదైనా, యుద్ధం ఎన్నటికీ పరిష్కారం కాదన్న వాస్తవాన్ని ప్రపంచ దేశాలు గుర్తించాలి. చర్చలు, సంప్రదింపులతో శాంతి స్థాపనకు కృషి చేయాలి. దేశం ఏదైనా బాలలంతా ఒక్కటే. బాల్యం అత్యంత బాల్యాన్ని దోచుకునే హక్కు ఎవరికీ లేదు. వారిపై హింస అసలే పనికిరాదు. ఛిద్రమవుతున్న బాల్యానికి కొత్త ఊపిరిపోసి, సుందరమైన భవిష్యత్తు నిర్మాణానికి ప్రపంచ దేశాలన్నీ ఏకం కావాలి. యుద్ధ కారణాలపై చర్చలు జరపాలి. భేదాభిప్రాయాలను తొలగించుకోవాలి. మైత్రీ సంబంధాలు పునరుద్ధరించుకోవాలి. అప్పుడే బాలలపై హింస తగ్గుతుంది. బాల్యం కొత్త చిగురులు తొడుగుతుంది.

# ప్రభుత్వ సమాచారంలో ఎఎన్ఐ అనధికార గుత్తాధిపత్యం

అవని బన్సల్

భారతదేశం – పాకిస్తాన్ సంఘర్షణపై ఇటీవల వివిధ దేశాలకు వెళ్లిన అఖిలపక్ష ప్రతినిధి బృందం వీడియోలలో ఒక విషయం సర్వసాధారణంగా కనిపించింది. అది ఏషియన్ న్యూస్ ఏజెన్సీ (ఎఎన్ఐ) లోగో. కాబట్టి సహజంగా ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఒక ప్రైవేట్ కంపెనీ అయిన ఒక వార్తా సంస్థ ఎఎన్ఐ (ట్రస్ట్ ద్వారా నడిచే ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పిటిఐ) వంటి వాటికి భిన్నంగా) ప్రభుత్వ సంబంధిత అధికారిక వార్తలను కవర్ చేయడంలో అనధికార గుత్తాధిపత్యాన్ని చెలాయించగలదా? పిటిఐ, ఇండో ఏషియన్ న్యూస్ సర్వీస్ (ఐఎఎన్ఎస్), ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి), లేదా యునైటెడ్ న్యూస్ ఇండియా (యుఎన్ఐ) వంటి ఇతర వార్తా సంస్థలు ఎందుకు ఆ కవరేజ్‌కు దూరంగా ఉన్నాయి? అధికారిక ప్రతినిధి బృందాలతో వెళ్ళేందుకు భారత ప్రభుత్వం వారిని ఆహ్వానించలేదా? లేదా వారిని ఆహ్వానించినప్పటికీ, వారు తమ సొంతంగా ఖర్చులు భరించాల్సిందిగా కోరిందా? అలాగైతే వారికి వాటిని కవర్ చేయడానికి నిధులు లేవా? భారత ప్రభుత్వం ఎవరినీ 'ఆహ్వానించనట్లయితే', ఎఎన్ఐకి వనరులు ఉన్నందున తానంతట తానుగా వెళ్ళినట్లయితే, ఒక ఏజెన్సీకి మాత్రమే అలాంటి అనుమతి ఇవ్వడం ద్వారా సమాన అవకాశాలను దెబ్బతీయడం సమంజసమేనా? అత్యంత ముఖ్యమైన అంశం ఏమిటంటే ప్రజాధనంతో నిధులు సమకూర్చబడిన ప్రభుత్వ ఆధీనంలోని పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ దూరదర్శన్‌ను ఎందుకు విస్మరిస్తున్నారు? కనీసం ఒక జర్నలిస్టుల బృందానికైనా అధికారిక ప్రతినిధి బృందాలతో వెళ్ళేందుకు భారత ప్రభుత్వం నిధులు సమకూర్చగలదు కదా?

ఈ ప్రశ్నలు ఇటీవల జరిగిన అధికారిక అఖిలపక్ష ప్రతినిధి బృందం కవరేజీకి మాత్రమే పరిమితం కావు. ఎఎన్ఐ ఇతర అన్ని సంస్థల ఖర్చుతో అనవసరమైన ప్రయోజనాన్ని పొందుతున్నట్లు అర్థం చేసుకోవడానికి ఇవి ప్రాథమికమైనవి. సారాంశంలో సమస్య ఏమిటంటే కేవలం ఒక వార్తా సంస్థ మాత్రమే అన్ని లేదా ఏదైనా ప్రభుత్వ సంబంధిత అధికారిక కార్యక్రమం/వైఖరిని ప్రత్యేకంగా కవర్ చేయడం రాజ్యాంగబద్ధంగా అనుమతించబడదు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. భారత ప్రభుత్వం , ఎఎన్ఐ మధ్య ఏదైనా స్పష్టమైన ఒప్పందం నుండి ఈ 'ప్రత్యేకం' ఉత్పన్నం కాకపోవచ్చు. కానీ 'అధికారిక ప్రభుత్వ సంబంధిత కార్యక్రమాలను' ప్రసారం చేయడానికి సమాన అవకాశాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఏమీ చేయకపోవడం పరోక్షంగా ప్రభావశీలమైన గుత్తాధిపత్యాన్ని సృష్టించినట్లే. ఎఎన్ఐ 'లాభం' కోసం పనిచేస్తుంది. అది ఇతర వార్తా సంస్థలు, మీడియా, వినియోగదారులు మొదలైన వాటికి సమాచారాన్ని 'ఫీజు' తీసుకొని విక్రయిస్తుంది. కాబట్టి పిఐబి లేదా దూరదర్శన్ లాగా ఇది ప్రభుత్వ ఆధీనంలో లేదు. ఎఎన్ఐ తన సమాచారంపై హక్కును క్లెయిమ్ చేస్తుంది, తద్వారా దాని కంటెంట్‌లో ఏదైనా వినియోగదారుల ద్వారా కాపీరైట్ సవాళ్లకు దారితీస్తుంది అది సముచితమే.

కానీ ఇక్కడ సమాచారం 'అధికారిక ప్రభుత్వ కార్యక్రమం/వైఖరి' అయినప్పుడు, ప్రమాదంలో ఉన్నది ప్రజల తమ స్వంత ప్రభుత్వం, దాని కార్యకలాపాల గురించి తెలుసుకునే హక్కు అనేది ప్రశ్న. ఇప్పుడు, ఎఎన్ఐకి ఎక్కువ వనరులు ఉన్నాయి. తద్వారా ఎవరూ లేని చోట తన ప్రతినిధిని పెట్టే సామర్థ్యం ఉంది. కాబట్టి సమాన అవకాశాలు, స్వేచ్ఛా ప్రజాస్వామ్యంలో సమర్థవంతమైన పోటీదారుగా ఉండటం వల్ల కలిగే ప్రయోజనం ఉండాలి. కానీ, ఇది ప్రభుత్వ సంబంధిత ప్రసారాలతో సహా అన్ని రకాల సమాచారానికి విస్తరించవచ్చా? ఉదాహరణకు, ఇండియా–ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌లను ప్రసారం చేసేందుకు జియోసినిమాకు నిర్దిష్ట డిజిటల్ హక్కులు ఉన్నాయి. కానీ సోనీ కూడా టెలివిజన్ ప్రసార హక్కులను కలిగి ఉంది. బిసిసిఐ వివిధ బ్రాడ్‌కాస్టర్‌లతో ఒప్పందాలను కుదుర్చుకుంటుంది. అయితే సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ వార్తా సంస్థలతో అలాంటి ప్రత్యేక ఒప్పందాలు కుదుర్చుకుందా?




చాలా మటుకు, అలాంటివి ఏవీ లేవు. భారత ప్రతినిధి బృందాలను వివిధ దేశాలలో కవర్ చేయడానికి, లేదా అదే విధంగా, ప్రధానమంత్రుల అధికారిక విదేశీ పర్యటనలను కవర్ చేయడానికి జర్నలిస్టుల బృందాన్ని పంపడానికి ఎఎన్ఐకి మాత్రమే 'వనరులు' ఉన్నాయనేది ఏకైక వాదన.

కానీ ఈ అధికారిక పర్యటనలను కవర్ చేయడానికి పరోక్షంగా ఒక వార్తా సంస్థను మాత్రమే అనుమతించడం ద్వారా, ఎఎన్ఐకి అనధికార గుత్తాధిపత్య హోదా కల్పించబడింది. ఇది సహజంగా జర్నలిస్టులు, మీడి యా సంస్థలు, వార్తా సంస్థలు, దేశ ప్రజలు అడగవలసిన కొన్ని ముఖ్యమైన ప్రశ్నలకు దారితీస్తుంది.

మొదటిది, ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలైన పిఐబి లేదా దూరదర్శన్ ఎందుకు అన్ని ప్రభుత్వ సంబంధిత వార్తలను అధికారికంగా ప్రసారం చేయకూడదు? కచ్చితంగా, వాటికి ప్రజల నిధులు సమకూర్చబడుతున్నందున, ప్రైవేట్ కంపెనీల డబ్బు కాకుండా ప్రజల డబ్బును అన్ని ప్రభుత్వ సంబంధిత సమాచారాన్ని కవర్ చేయడానికి ఉపయోగించాలి. ఏమైనా, ఈ ప్రభుత్వ సంస్థలలో చాలా ప్రజాధనం పెట్టబడుతోంది. కాబట్టి అవి ఆ పర్యటనల నుండి ఎందుకు దూరంగా ఉన్నాయి. ఈ సంస్థల వైఫల్యాన్ని పరోక్షంగా ప్రభుత్వమే అంగీకరించడం కాదా?

రెండవది, ఎఎన్ఐకి మాత్రమే పిఎంఒ లేదా భారత ప్రభుత్వ విదేశీ పర్యటనలను కవర్ చేయడానికి వనరులు ఉన్నందున, మన స్వంత ప్రభుత్వం గురించి ప్రజలకు సమాచారమంతా ప్రవహించే ఒక వాహకంగా వ్యవహరించడానికి వారికి అనుమతి ఇవ్వబడుతుంది. ఇది నకిలీ సమాచారం, మెటా నియంత్రణ కథనం, ప్రభుత్వ అనుకూల పక్షపాతం, క్విడ్ ప్రో కో, వార్తా సంస్థకు పరస్పర లాభం కలిగించే ఏర్పాటును కల్పిస్తుంది. ఎందుకంటే ఈ ఏర్పాటు ప్రభుత్వం నుండి ఏకపక్ష సమాచార ప్రవాహాన్ని సృష్టిస్తుంది. పోటీ లేని కారణంగా అది ప్రశ్నించబడదు.

మూడవది, ఎఎన్ఐ అన్ని ఖర్చులను భరిస్తున్నప్పటికీ, ప్రజా సమాచారం వాహకంగా మారడం ద్వారా, అది ఇతర వార్తా సంస్థలకు ఆ సమాచారాన్ని విక్రయించే ధరను నిర్ణయించే ఏకైక నిర్ణాయకారి అవుతుంది. ఇది వార్తా మార్కెట్‌లో గుత్తాధిపత్యంగా దాని స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ప్రభుత్వ సమాచారాన్ని ప్రత్యేకంగా తను పొందడం, తరువాత లాభం కోసం దానిని వినియోగించుకునే వలయాన్ని ఏర్పాటు చేస్తుంది.

నాల్గవది, ప్రత్యేకమైన కంటెంట్ యాజమాన్యాన్ని కలిగి ఉండటం. ఇది భారత ప్రభుత్వానికి సంబంధించినది కాబట్టి స్వేచ్ఛగా లభ్యం కావాలి. ఎఎన్ఐ కొంత మంది వినియోగదారులు ఆ కంటెంట్‌ను ఉపయోగించకుండా కాపీరైట్ క్లెయిమ్ చేస్తూ నిషేధించగలదు. తద్వారా భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛపై మరింత భయంకరమైన ప్రభావాన్ని సృష్టిస్తుంది.

> ఒక ప్రజాస్వామ్యంలో, ఏదైనా ఒక వార్తా సంస్థ, అది కూడా ఒక ప్రైవేట్ కంపెనీ, ప్రభుత్వ సంబంధిత సమాచారాన్ని కవర్ చేయడానికి ఏకైక వనరుగా మారడానికి అనుమతించడం ఏమాత్రం సమంజసం కాదు. ఏదైనా ఒక ఏజెన్సీ ప్రభుత్వానికి గొంతుకగా, లేదా ఇంకా ఘోరంగా, దాని ప్రతినిధిగా మారడానికి అనుమతించడం ద్వారా, వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛకు ఒక ప్రమాదకరమైన ఉదాహరణ సృష్టించబడుతోంది.

ప్రభుత్వ సంబంధిత సమాచారంపై ఈ ప్రభావవంతమైన గుత్తాధిపత్యం వార్తలలో పెద్ద వక్రీకరణలకు, ఎంపిక చేసిన ఫుటేజ్‌ల విడుదల, అధికారిక కార్యక్రమాల పూర్తి వీడియోలను క్లెయిమ్ చేయడానికి అవకాశాలు లేకపోవడం మొదలైన వాటికి దారితీస్తుంది. తద్వారా ప్రజలు, వారి ప్రభుత్వం మధ్య అపనమ్మకాన్ని సృష్టిస్తుంది.

ఈ భయాలన్నీ అతిశయోక్తి, అన్యాయమైనవి అని వాదించినప్పటికీ (అంగీకరిస్తున్నప్పటికీ), ఎఎన్ఐకి ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వబడదు అనే అభిప్రాయాన్ని కలుగజేయటం ప్రభుత్వ కర్తవ్యం కాదా?

భారత ప్రభుత్వం ఒక నియంత్రిత ఏకపక్ష సమాచార ప్రవాహాన్ని ఎంపిక చేసిన వారి ద్వారా నిర్ధారించడానికి బదులుగా, సమాన అవకాశాలను సృష్టిస్తున్నట్లుగా కనిపించడానికి, భారత ప్రభుత్వం ఈ క్రింది వాటిని పరిగణించవచ్చు:

1. ప్రభుత్వ సంబంధిత సమాచారం ప్రసారం చేయవలసి వచ్చినప్పుడల్లా, వివిధ వార్తా సంస్థలను ఆహ్వానించాలి, వారి ప్రాథమిక ఖర్చులను భరించాలి. ప్రభుత్వ సంబంధిత సమాచారం క్రికెట్ వంటి 'వినోదం' కాదు, దానికి సమాన, ఉచితంగా లభించడాన్ని నిర్ధారించడం పత్రికా స్వేచ్ఛ, ఆర్టికల్ 19కు విస్తృతంగా పునాది కావాలి.

2.వనరులు ఒక ప్రధాన పరిమితి అయితే, భారత ప్రభుత్వం ప్రభుత్వ ఖర్చుతో ప్రభుత్వ ఆధీనంలోని సంస్థల నుండి ఒక అధికారిక బ్రాడ్‌కాస్టర్‌ను అనుమతించి, ఇతర అన్ని వార్తా సంస్థలు దాని నుంచి తీసుకునేందుకు అనుమతించినట్లయితే కవర్ చేయడానికి స్వేచ్ఛగా ఉండవచ్చు. కాబట్టి ఉదాహరణకు, దూరదర్శన్ అన్ని ప్రభుత్వ సంబంధిత కార్యక్రమాలను తప్పనిసరిగా కవర్ చేసి, వాటిని కవర్ చేయడానికి లేదా ఈవెంట్‌లో ఉండటానికి వనరులు లేని ఇతరులతో పంచుకోవాలి, అదనంగా ఎఎన్ఐ లేదా అక్కడ ఉండాలనుకునే ఇతరులు ఉన్నప్పటికీ ఎటువంటి హాని లేదు.

ఇది రాజ్యాంగం 'ప్రభుత్వ సంబంధిత సమాచారానికి అందుబాటులోఉండడం' ఒక వైపు, 'న్యాయమైన అవకాశం' మరోవైపు మధ్య సమతుల్యతను నిర్వహించడానికి అవసరమైన 'సమతుల్యత' అవుతుంది.

3. ప్రభుత్వ సంబంధిత సమాచారం కవరేజీపై తన వైఖరిని స్పష్టం చేస్తూ భారత ప్రభుత్వం ఒక జాతీయ విధానాన్ని రూపొందించాలి. నేరుగా చేయలేనిది, స్పష్టమైన విధానం లేకుండా పరోక్షంగా చేయడానికి అనుమతించబడకూడదు. ఇది ఎల్లప్పుడూ ఆధిపత్య సంస్థచేత దుర్వినియోగం చేయబడుతుంది. ఇతర సంస్థలను పణంగా పెట్టే అనధికార గుత్తాధిపత్యాన్ని సృష్టిస్తుంది.

ఎఎన్ఐ భారత ప్రభుత్వం అనధికారికంగా ఎంపిక చేయబడిన వార్తా సంస్థగా మారినట్లయితే, ప్రభుత్వంలోని మంత్రులందరూ, ప్రధాన ప్రతిపక్ష సభ్యులు మొదలైనవారు కూడా ఎఎన్ఐ జర్నలిస్టులను పిలవడానికి, వారికి ప్రత్యేక బైట్లు లేదా ప్రభుత్వ సంబంధిత సమాచారానికి పొందేందుకు అవకాశం కలిగి ఉంటారు. ఇది గుత్తాధిపత్య వలయాన్ని మరింత బలోపేతం చేస్తుంది. భారత ప్రజలకు తమ ప్రభుత్వాల గురించి, దాని అధికారిక కార్యకలాపాల గురించి తెలుసుకునే హక్కు ఉంది. ఎఎన్ఐ ఎంత పెద్దది కాబట్టే, పిల్లి మెడలో గంట ఎవరు కడతారు? అనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతుంది.

ఈ విషయంపై ఇతర వార్తా సంస్థల ఇప్పటి వరకు పాటిస్తున్న మౌనం ఎందుకంటే దీనిపై ఎవరైనా అడిగితే ఎవరైనా ప్రభుత్వ ఆగ్రహానికి గురై అదుపులో ఉంచబడుతారనే భయాన్ని అది సూచిస్తుంది. కాబట్టి, ప్రజాస్వామ్య స్తంభాలను రక్షించాలంటే, ప్రజల ఉద్యమం మాత్రమే సమాధానం. ఎవరో ఒకరు నాయకత్వం వహించవలసి ఉంటుంది. ఇది చేయగల స్థానంలో ఉన్నవారి మౌనం ప్రభుత్వంతో వారు భాగస్వాములైనట్లు స్పష్టం చేస్తుంది.

(ది లీఫ్‌లెట్ సౌజన్యంతో…)

# యోగాను ఆదరించండి… మోదీ రాజకీయాన్ని నిరసించండి

**జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం**

ఈ ఉత్సవానికి మోదీ ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నారు. మోదీ ప్రాపకం కోసం ఉవ్విళ్లూరుతున్న చంద్రబాబు ప్రభుత్వం దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గత నెల రోజులుగా రాష్ట్రంలో ప్రభుత్వ పాలన అంతా యోగా చుట్టూ తిరుగుతున్నది. మంత్రు లు, శాసన సభ్యులు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ యంత్రాంగం అంతా యోగా కోసం 2 కోట్ల మందిని సమీకరించే పనిలో తల మునకలై వున్నారు.

ఈ యోగా వెనుక అనేక కోణాలు కనిపిస్తున్నాయి. యోగాలో వ్యాయామం వుంది. ధ్యానం వుంది. ఆధ్యాత్మిక ముక్తి మార్గం వుంది. అంతకుమించి వ్యాపారం వుంది. కార్పొరేట్ల ప్రయోజనాలు వున్నాయి. అంతిమంగా మోదీ స్వార్థ పూరిత రాజకీయం వుంది. మోదీని మెప్పించి తమ పబ్బం గడుపుకోవాలనే రాష్ట్ర రాజకీయం వుంది. ఈ కోణాలను మరుగు పరిచే ప్రయత్నాలు ఎన్ని చేసినా అవి తమదైన రూపంలో ప్రత్యక్షమవుతూనే వున్నాయి. ఇలా బహురూపిగా మారిన యోగా రకరకాల కారణాల రీత్యా వివిధ తరగతుల ప్రజల్ని ఆకర్షిస్తున్నది.

మన సామాజిక ఆర్థికాభివృద్ధి క్రమంలో శారీరక శ్రమ చేయనివారు పెరుగుతున్నారు. గ్రామీణ పేదలు, వస్తూత్పత్తి చేసే పారిశ్రామిక కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు మాత్రమే శారీరక శ్రమజీవులు ఉన్నారు వారికి యోగా అవసరం అంతగా లేదు. వివిధ రంగాల మధ్య తరగతి వేతన జీవులు శారీరక శ్రమకు దూరం అయ్యారు. అలాంటి వారికి యోగా ఒక వ్యాయామ సాధనంగా ఆకర్షిస్తుంది. మన సమాజంలో నానాటికి వృద్ధుల సంఖ్య పెరుగుతున్నది. వారు వృద్ధాశ్రమాలలో వున్నా, మరోచోట వున్నా వారికి వ్యక్తిగతంగా శ్రమ చేయడానికి యోగా అనువైన సాధనం అయ్యింది. ఇప్పుడు మన బడి పిల్లలు కూడా వ్యాయామానికి అవసరమైన ఆటపాటలు డ్రిల్లు క్లాసులు లేకపోవడంతో పాఠశాలలు యోగాను ఆశ్రయిస్తున్నాయి. అదొక గౌరవప్రదమైన శిక్షణగా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. అదనపు ఫీజులు చెల్లించి యోగాభ్యాసం చేయిస్తున్నారు.

కార్పొరేట్ సంస్థలు తమ ఉద్యోగాలకు యోగాను అవలంభించమని ప్రచారం చేస్తున్నాయి. ఆ ఉద్యోగులు కూడా అది తప్పనిసరి అవసరంగా భావిస్తున్నారు. కార్పొరేట్ యాజమాన్యం తమ ఉద్యోగులకు పని ఒత్తిడి పెంచింది. ఎప్పుడు ఉద్యోగం ఊడుతుందో తెలియని ఆందోళనకు గురిచేసింది. పనిగంటల తగ్గింపు, రిక్రియేషన్ కార్యకలాపాల ద్వారా పని ఒత్తిడి తగ్గించడానికి బదులు వీరికి తాత్కాలిక ఉపశమనంగా యోగాను, ధ్యానాన్ని పరిష్కారంగా వారి ముందు పెట్టి, కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడే సాధనంగా యోగాను వినియోగించుకున్నారు. ఇలా శారీరక శ్రమలేని తరగతులు, మానసిక ఒత్తిడికి గురవుతున్న తరగతులకు యోగా తప్పనిసరి అవసరంగా కనిపిస్తున్నది. దీనికి కారణమైన సామాజిక, ఆర్థిక కారణాల నుంచి దృష్టి మళ్లించే సాధకంగా యోగా వినియోగపడుతున్నది. ఈ కారణాల రీత్యా మధ్య తరగతి వేతనజీవులు వృద్ధులు పాఠశాల పిల్లలు యోగాను ఎంచుకుంటున్నారు 'ఆచరిస్తున్నారు'. తక్షణ ఉపశమనాన్ని పొందుతున్నారు.

యోగా, ధ్యానం పూర్తిగా వ్యక్తిగతమైనవి. అయితే ప్రారంభంలో నేర్చుకునేటప్పుడు మాత్రమే దానికి కొంత మేరకు గురువు అవసరం వుంటుంది. దానికి స్థానికంగా చాలా మంది గురువులు ఉన్నారు. వారు తగు ఫీజుతో శిక్షణ ఇస్తున్నారు. దేనికైనా వ్యాపారం చేయగల నేర్పరితనం మన పెట్టుబడిదారి వ్యవస్థకు వుంది. యోగాను కూడా వారు వ్యాపారం చేశారు. ప్రయివేటు వైద్యం దోపిడీలాగా ఈ ప్రైవేటు యోగా వ్యాపారం కూడా విపరీతమైన దోపిడీకి నిలయం అయ్యింది. ప్రపంచవ్యాప్తంగా యోగా చుట్టూ 86,000 కోట్ల రూపాయల వ్యాపారం సాగుతున్నది. దీనికి ఆయుర్వేదాన్ని, గోమూత్రాన్ని జత చేసి మరీ విక్రయిస్తున్నారు. ఇప్పుడు యోగా నేర్చుకోవడానికి ఖరీదైన ఆన్‌లైన్ కోర్సులు వచ్చాయి. యోగా చెయ్యడానికి మాట్స్ వ్యాపారం వచ్చింది. యోగా దుస్తుల వ్యాపారం జోరుగా సాగుతున్నది. దేశంలో ఈ వ్యాపారంలో రాందేవ్ బాబాలు, శ్రీశ్రీ రవిశంకర్‌లు అగ్రభాగాన వున్నారు. వారు సాధారణ బాబాలు కాదు. మోదీ ప్రభుత్వ ప్రాపకం వున్న బాబాలు. వీరి ప్రమేయంతో నడుస్తున్న సంస్థలు వెయ్యి కోట్లకు పైబడి ఆస్తులను పోగేసుకున్నాయి. యోగాను కార్పొరేట్ వ్యాపారంగా నడుపుతున్నారు. దీనిని మోదీ రాజకీయంతో జత చేసి మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరింప చేసుకుంటున్నారు.



మోదీ ఏ నినాదం ఇచ్చినా, ఏ కార్యక్రమం తలపెట్టినా అందులో రాజకీయం వుంటుంది. స్వప్రయోజనం వుంటుంది. యోగాకు ప్రజాదరణ కల్పించి దానిని తన ఎన్నికల ఖాతాలో వేసుకోవాలని ఆయన భావిస్తున్నారు. దేశాన్ని విశ్వగురు చేస్తానని మోదీ ప్రకటించారు. దానికి వికసిత్ భారత్‌ను నినాదం చేశారు. అంటే 2047 నాటికి ప్రపంచానికి దారి చూపించే దేశంగా అభివృద్ధి సాధించాలి. ఇప్పుడు ప్రపంచంలో స్థూల జాతీయోత్పత్తిలో 4వస్థానం పొందడం ఘన విజయంగా డప్పు కొడుతున్నారు. 140 కోట్ల జనాభా గల దేశం 3,4 కోట్ల జనాభాగల దేశాల జీడీపీని దాటిపోవడంలోని డొల్లతనాన్ని అసలు లెక్కలు తేల్చి చెబుతున్నాయి. తలసరి జీడీపీలో భారతదేశం 4వ స్థానంలో లేదు,140వ స్థానంలో వుంది. మానవాభివృద్ధిలో 131వ స్థానంలో వుంది. ఆకలిసూచీలో 106వ స్థానంలో వుంది. రాబోయే 2, 3 దశాబ్దాలలో భారత్ ఈ రంగాలలో విశ్వగురు అయ్యే అవకాశాలు లేవని ఆర్థికవేత్తలకు తెలుసు. ఈ విషయం మోదీకి కూడా తెలుసు. విశ్వగురు స్థానాన్ని సంపాదించడానికి మరో మార్గాన్ని ఎంచుకున్నారు. ఐక్యరాజ్యసమితిలో జూన్ 21 యోగా దినోత్సవంగా ప్రకటింపజేశారు. 196 దేశాలు దానిని ఆమోదించాయి. ఇప్పుడు యోగాలో మనమే విశ్వ గురు అని మోదీ దేశ ప్రజలను మభ్యపెట్టదలుచుకున్నారు. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో పేదలున్న దేశం మనది. అత్యధిక అంతరాలు వున్న దేశం మనది. దీనిని యోగాతో కప్పిపుచ్చే ప్రయత్నం మోదీ చేస్తున్నారు.

దేశంలో మోదీ సాగిస్తున్న రాజకీయం మనకు తెలిసిందే. దేశాన్ని మతపరంగా విభజించి, మత విద్వేషరంగా మెజారిటీ ప్రజల ఓట్లు దండుకునే రాజకీయం చేస్తున్నారు. ఇప్పుడు యోగాని ఒక మతపరమైన సాంస్కృతిక సాధనంగా వినియోగించే ప్రయత్నం చేస్తున్నారు.

యోగా పుట్టుపూర్వోత్తరాల గురించి మోదీ మాట్లాడారు. అది హిందూ సాంస్కృతిక సంప్రదాయంగా ప్రచారం చేయడానికి సంఘ్ పరివారం యోగా చరిత్ర వక్రీకరణలకు పూనుకున్నారు. యోగా మీద 100 కీలక గ్రంథాలను ఐదేళ్లపాటు పరిశోధన చేసి మార్క్‌సింగిల్‌టన్, జామెస్ మల్లీసన్‌లు 'ది రూట్స్ ఆఫ్ యోగా' అన్న పుస్తకాన్ని ప్రకటించారు. యోగా ఆదిలో మొదలైంది మతపరమైన సంప్రదాయం నుంచి కాదని ఆ పుస్తకంలో వారు నిగ్గు తేల్చారు. 13వ శతాబ్దికి చెందిన దత్తాత్రేయ యోగశాస్త్రంలో యోగా మతానికి, కులానికి అతీతమైందని పేర్కొంటూ సాధువులు, బౌద్ధులు, బ్రాహ్మలు, జైనులు, భౌతికవాదులకు కూడా ఆచరించదగినదిగా చెప్పారు.

> బౌద్ధం నుంచి వైదిక మతం యోగాను కాపీ కొట్టిందని దేవరాజు మహారాజు ఒక వ్యాసంలో స్పష్టం చేశారు. పతంజలి యోగ శాస్త్రంలోని అభూతకల్పనలను పక్కనబెట్టి మోదీ పరివారం దానిని హిందూ సాంస్కృతిక వారసత్వంగా యోగాను ప్రకటిస్తున్నారు. హిందూ సాంస్కృతిక ఆధిపత్యానికి చిహ్నంగా యోగాపై ప్రచారం సాగిస్తున్నారు. దీని ద్వారా ఇతరమతాలకంటే హిందూ మత ఆధిక్యతను చాటడానికి వాడు-కుంటున్నారు. మతపరమైన విభజనకు యోగాను పరోక్షంగా వినియోగిస్తున్నారు. యోగా వ్యక్తిగతంగా ఆచరించాల్సినది కాగా దానిని సామూహికం చేసి సాంస్కృతికపరమైన గుంపు భావన పెంపొందిస్తున్నారు. ఈ గుంపు తత్వంతో యోగాకు ఏకైక నాయకునిగా మోదీ భజనకు ద్వారాలు తెరుస్తున్నారు.


మోదీ ఇప్పుడు రాజకీయంగా దక్షిణాది జైత్రయాత్రకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింల సంఖ్య తగినంత లేకపోవడం సాధారణ మత విద్వేష రాజకీయం ఇక్కడ అంతగా పనిచేయదు. ఆ పని చేసి పెట్టడానికి సనాతన ధర్మ వేషం ధరించిన చాక్‌లెట్‌బాయ్ పవన్ కల్యాణ్ వున్నారు. చంద్రబాబును వశపరుచుకోడానికి మత విద్వేష రాజకీయానికి బదులు మరోదారి అవసరం. యోగ ద్వారా హిందూ సాంస్కృతిక గుంపు భావోద్వేగాన్ని కల్పించడం ద్వారా రాష్ట్రంలో మెజారిటీ ప్రజలను ఆకట్టుకునే కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. దీనికి చంద్రబాబును పావుగా వాడుకుంటున్నారు.

రాజకీయంగా రాష్ట్రంలో విస్తరించడానికి యోగాడేలో మోదీనే స్వయంగా పాల్గొంటున్నారు. రాష్ట్రంలో మోదీని మెప్పించడానికి తెలుగుదేశం, జనసేన పార్టీలు పోటీ పడుతున్నాయి. మొదటి ఛాన్స్ సనాతన ధర్మం పేరుతో మోదీకి సన్నిహితం కావడంలో పవన్‌కల్యాణ్ ముందున్నారు. వెనుకబడిన చంద్రబాబు మెగా యోగా కార్యక్రమాలతో మోదీ దగ్గర తనస్థానాన్ని మెరుగుపరుచుకోవడానికి శక్తివంచన లేని ప్రయత్నాలు చేస్తున్నారు. జూన్ 21న రెండు కోట్ల మందితో రాష్ట్రవ్యాప్తంగానూ, మోదీ చెంతన రెండులక్షల మందితో యోగా కార్యక్రమాన్ని చేపట్టారు. నెలరోజులుగా స్వర్ణాంధ్రప్రదేశ్ నినాదం పక్కకు పోయింది యోగాంధ్ర నినాదం ముందుకొచ్చింది. మోదీ రాజకీయ విస్తరణకు చంద్రబాబు కొత్త ద్వారాలు తెరిచారు. ఇది రాష్ట్ర భవిష్యత్‌కు మతపరమైన రాజకీయ ముప్పుకానుంది. రాష్ట్ర ప్రజలు తమ తమ శారీరక, మానసిక అవసరాల కోసం యోగాను ఆదరించండి. కాని యోగా ముసుగులో మోదీ రాజకీయ పన్నాగాలను నిరసించండి.

– డివివియస్ వర్మ,
'దారి దీపం' సంపాదకుడు,
8500678977

# తెలంగాణ అస్తిత్వ పతాక జయశంకర్ 'సార్'

అణచివేతకు గురైన ఆకాంక్షలకు ప్రతిరూపం అతను. కన్నీళ్ళను, కష్టాలను, కడుపులో దాచుకుని తెలంగాణ రాష్ట్ర సాధ నే శ్వాసగా, ఆశగా, ఆశయంగా, లక్ష్యంగా, జీవితంగా బతికి, భావజాల వ్యాప్తి చేసిన దార్శనికుడు. 'తెలంగాణ సాధనకు జెండాలు లేవు, ఎజెండాలు మాత్రమే' అని చెప్పి ప్రతి పార్టీ ఇంటి గడప తొక్కి, బొట్టుపెట్టి, మరీ బతిమాలిన వ్యక్తి. తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని ఖండాంతరాలలో వినిపించిన మనసున్న మంచిమనిషి. నాలుగున్నర కోట్ల గొంతుల ఉద్యమ నినాదం.



తల్లిదండ్రులు, ముగ్గురు అన్నదమ్ములు, ముగ్గురు అక్క, చెల్లెళ్ళు, ఉన్నటువంటి ఒక వ్యక్తి పెళ్లి చేసుకోకుండా ఒక అనాథను చేరదీసి, విద్యాబుద్ధులు చెప్పించి, ప్రయోజకుల్ని చేసి మరొక అనాథ అమ్మాయిని పెళ్లి చేసి వారిద్దరికీ పుట్టిన బిడ్డను ఎత్తుకుని ఆడించి ఆనంద పడిన అరుదైన సంఘటనను కేవలం ఒక జయశంకర్ సార్ విషయంలో మాత్రమే చూడవచ్చు. అది అతనికి ఉన్నటువంటి నిబద్ధత, మానవీయత. అధిక సంఖ్యాకుల క్రౌర్యం నుండి అల్పసంఖ్యాకులను కాపాడాలనే అంబేద్కర్ వాదాన్ని శిరసావహించాలని చెప్పిన నికార్సయిన ప్రజాస్వామ్యవాది ఆయన.

'అడుక్కొని అయినా తింటం కానీ ఆంధ్రోళ్లతో కలిసి ఉండం' అని ఫజల్ అలీ కమిషన్‌కు బరాబర్ తెగేసి చెప్పిన నికార్సైన తెలంగాణ మట్టిమనిషి… ఢిల్లీ నుంచి గల్లీ వరకు సమావేశం, సభ, ధర్నా, రాస్తారోకో, ఏం జరిగినా తాను మాట్లాడేది తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరం గురించి మాత్రమే. పలుచనైన తెలంగాణ ఉద్యమాన్ని చిక్కపరిచిన వ్యక్తి అతడు. జీవితాంతం బ్రహ్మచారిగానే బతికిన ఆ మహోద్యమ కెరటం పేరు 'ఆచార్య కొత్తపల్లి జయశంకర్'. సార్ అనే పదం లేకుండా జయశంకర్‌సార్‌ను పిలవలేం. అది ఆయనకు తెలంగాణ సమాజం ఇచ్చే గౌరవం, ఆ హోదాను విడదీసి చూడలేం. జయశంకర్‌ను అలా పిలవడం వలన 'సార్' అనే పదానికే ఔన్నత్యం పెరిగింది. కన్నుల్లో ఆవేశం ఉన్నా, నా గుండెల్లో బాధ ఉన్నా, ఆధిపత్య శక్తులను ఎదుర్కోవాలంటే అవన్నీ మర్చిపోయి రాజ్యాంగబద్ధంగా మనకు రావాల్సిన నీళ్ల నిధులు తెచ్చుకోవాలని చెప్పి మనసా, వాచా, కర్మణా ఆచరించి నిబద్ధత చూపిన తెలంగాణ అస్తిత్వ పతాక ఆచార్య జయశంకర్.

1934 ఆగస్టు 6న వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో లక్ష్మి కాంతారావు, మహాలక్ష్మి దంపతులకు జన్మించాడు జయశంకర్ సార్. ఉర్దూ మీడియంలో ఉన్న హనుమకొండలోని మర్కజీ పాఠశాలలో ప్రాథమిక విద్య, హన్మకొండ న్యూ హైస్కూల్లో మాధ్యమిక విద్య, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎస్‌సి వరకు చదువుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బిఎ పూర్తి చేశాడు. ఎంఎతో పాటు ఎకనామిక్స్‌లో పిహెచ్‌డి కూడా పూర్తి చేశాడు. సమస్యల పట్ల ఏవిధంగా స్పందించాలో ఆయనకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. వరంగల్‌లో డిగ్రీ కాలేజీ లేదు అని ధర్నాలు చేసి, ఉద్యమించిన విద్యార్థుల మొదటి వరుసలో ఉన్న జయశంకర్ పొరపాటున వరంగల్‌కు డిగ్రీ కాలేజ్ అని కాకుండా యూనివర్సిటీ కావాలని నినదించారు. అది పొరపాటు కాదని ఆ తర్వాతి కాలంలో రుజువైంది. 1952లో తెలంగాణ ఉద్యమంలో ఇంటర్మీడియట్ దశలోనే 'జై తెలంగాణ' నినాదం చేసి తరగతిగది నుండి బహిష్కరణకు గురయ్యాడు. అప్పటి నుండి తాను మరణించే వరకు తెలంగాణ పదాన్ని వీడింది ఎన్నడూ లేదు.

నాన్ ముల్కీ గోబ్యాక్ నినాదాలతో హైదరాబాద్‌లో జరిగిన మీటింగ్‌లో పాల్గొనడానికి బయలుదేరిన బస్సు ఫెయిల్ అయిన కారణంగా పోలీసు కాల్పుల్లో నుండి తప్పించుకున్నట్టు అయ్యింది. జయశంకర్ సార్ మిత్రులు ఆ రోజు పోలీసు కాల్పుల్లో చనిపోయారు. 'ఇన్ని ఘోరాలు చూడడానికేనా ఇంకా బతికి ఉన్నాను, ఆ కాల్పుల్లో చనిపోయే అదృష్టం నాకు దక్కక పాయె' అని సభలో బాధపడిన సందర్భాలు ఉన్నాయి.

1969లో ఉవ్వెత్తున ఎగిసిపడ్డ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఉప్పొంగిన ఉడుకు రక్తంతో యువ తరం ఉద్యమకారుడిగా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపాడు జయశంకర్ సార్. తెలంగాణ సాధన మొత్తం ప్రజాస్వామ్యయుతంగా రాజ్యాంగానికి లోబడే జరగాలని, ఏ విధమైన హింస చోటు చేసుకోవద్దని గట్టిగా నమ్మిన వ్యక్తి జయశంకర్ సార్.

> 1960లో ఉపాధ్యాయుడిగా, లెక్చరర్‌గా…, సికెఎం కాలేజీలో ప్రిన్సిపల్‌గా 1975–79 వరకు, కెయు రిజిస్ట్రార్‌గా 1979–81, ఇఫ్లు రిజిస్ట్రార్‌గా 1982–91 వరకు, కాకతీయ యూనివర్సిటీ విసిగా 1991–94 వరకు ఎన్నో పదవులను అలంకరించినా ఎప్పుడు తనకు కేటాయించిన గదిలో ఉండి తానే వంట చేసుకుని తిని సాధారణ జీవితం గడిపిన అసాధారణమైన మహామేధావి జయశంకర్ సార్. తెలంగాణ కోసం టిఆర్ఎస్ నుంచి ఆర్ఎస్ఎస్ వరకు ఎవ-రితోనైనా కలిసి పని చేయడానికి సిద్ధమని చెప్పి ఎవరు మీటింగ్ పెట్టిగా వెళ్లి తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పేవారు.

మిలియన్ మార్చ్ జరిగిన విగ్రహాల విధ్వంసాన్ని ఆయన సమర్థించారు. తెలంగాణ కవులు, నాయకుల విగ్రహాలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. 2009లో కేసీఆర్ ఆమరణ దీక్షకు వచ్చిన తెలంగాణ ప్రకటనను నాటి హోం మంత్రి చిదంబరంకు ప్రత్యక్షంగా మాట్లాడి అనౌన్స్‌మెంట్ ఏవిధంగా తప్పులేకుండా, పొరపాటు జరగకుండా చెప్పాలో రాసి ఇచ్చింది జయశంకర్ సార్ అనే విషయం ఎంతమందికి తెలుసు? అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాంతో, ప్రధాని మన్మోహన్ సింగ్‌తో, ఎఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీతో, హోం మంత్రి చిదంబరంతో ప్రత్యక్ష చర్చలు జరిపిన ఒకే ఒక వ్యక్తి జయశంకర్ సార్.

'పుట్టుక నీది చావు నీది బతుకంతా తెలంగాణది' అని తెలంగాణ కోసం అహర్నిశలు పరితపించిన జయశంకర్ సార్ తెలంగాణ ఏర్పాటు జరగక ముందే 2011 జూన్ 21న క్యాన్సర్‌తో ఈ లోకాన్ని వదిలి వెళ్ళాడు. తను లేకపోయినా తను కలలుగన్న సామాజిక, ప్రజాస్వామిక తెలంగాణ ఏర్పాటు జరిగితేనే జయశంకర్ సార్ ఆత్మ శాంతిస్తుంది. అదే అతనికి తెలంగాణ సమాజం అర్పించే నిజమైన నివాళి.

(జూన్ 21 జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా)

– డా.మెంతబోయిన సైదులు
9010910956



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## బోధనేతర సిబ్బందికి ఆర్థిక సాయం ఆపేయండి

### బెంగాల్ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**కోల్‌కతా:** ఉద్యోగాలు కోల్పోయిన బోధనేతర సిబ్బందికి ఆర్థిక సాయం కోసం బెంగాల్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాన్ని ఆపేయాలని కోల్‌కతా హైకోర్టు ఆదేశించింది. ఈ పథకాన్ని సెప్టెంబరు 26 వరకు లేదా తదుపరి ఆదేశాలిచ్చే వరకు నిలిపివేస్తూ శుక్రవారం జస్టిస్ అమృత సిన్హా ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. నాలుగు వారాల్లోగా అఫిడవిట్ ఇవ్వాలని, ఆపై 15 రోజుల్లోగా పిటిషనర్లు స్పందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. బెంగాల్ ప్రభుత్వం స్కూల్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన 2016లో ఎంపిక ప్రక్రియ ద్వారా నియమించిన గ్రూప్ సీ గ్రూప్ డీ విభాగాల్లోని బోధనేతర సిబ్బందికి కోర్టు ఆదేశాలకు కట్టుబడి తాత్కాలిక ప్రాతిపదికన మానవతా దక్పథంతో పరిమిత జీవనోపాధి, మద్దతుసామాజిక భద్రత కల్పించేందుకు ఒక పథకాన్ని బెంగాల్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గ్రూప్‌సీ, గ్రూప్‌డీ ఉద్యోగులకు ఒక్కొక్కరికి వరుసగా రూ.25వేలు, రూ.20వేలు చొప్పున బెంగాల్ ప్రభుత్వం చెల్లించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై తీర్పు రిజర్వులో ఉంచారు. ఈ పథకాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలిచ్చింది.

## విమానాన్ని ఢీకొట్టిన పక్షి..
# తిరుగు ప్రయాణం రద్దు

**న్యూఢిల్లీ :** ఎయిర్ ఇండియా విమానాలు వరుస కష్టాలను ఎదుర్కొంటున్నట్టు కనిపిస్తోంది. ఢిల్లీ నుంచి పుణెకు శుక్రవారం ఉదయం బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానాన్ని పక్షి ఢీకొట్టడంతో తిరుగు ప్రయాణాన్ని రద్దు చేశారు. విమానం సురక్షితంగా పుణెలో ల్యాండ్ అయిందని, సేఫ్టీ చెక్‌లో విమానాన్ని పక్షి ఢీకొట్టినట్టు గుర్తించామని ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. ఎయిరిండియా విమానం వెంటనే ఢిల్లీకి తిరిగి వెళ్లాల్సి ఉందని, అయితే పక్షి ఢీకొట్టడంతో రిటర్న్ ఫ్లైట్‌ను రద్దు చేశామని తెలిపింది. ప్రయాణికులకు బోర్డింగ్ , రీఫండ్ ఏర్పాట్లు చేసినట్టు తెలిపింది. ప్రత్యామ్నాయ ఫ్లైట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. కాగా, పలు అంతర్జాతీయ విమాన సర్వీసులతోపాటు దేశంలో నడిచే వివిధ విమాన సర్వీసులను సైతం రద్దు చేస్తున్నట్లు ఎయిర్ ఇండియా శుక్రవారంనాడు ప్రకటించింది. విమాన సర్వీసుల భద్రత తనిఖీలు, వాతవరణ పరిస్థితులు, ఆకాశ మార్గంలో విధించిన నిబంధనలు కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాబోయే కొద్ది వారాల్లో 15 శాతం అంతర్జాతీయ సర్వీసులను తగ్గించాలని నిర్ణయించినట్టు చెప్పింది. జూన్ 20 నుంచి జూలై ప్రథమార్ధం వరకూ ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని తెలిపింది.

# 65% రిజర్వేషన్ ప్రతిపాదన తుంగలోకి..

### బిహార్‌లో బిజెపి డబుల్ ఇంజిన్ సర్కార్ నిర్వాకం
### రాష్ట్రంలో రిజర్వేషన్ చట్టాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలి : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** బిహార్ రిజర్వేషన్ల చట్టాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో భాగంగా చేయాలని కాంగ్రెస్ మరోసారి ఉద్ఘాటించింది. రిజర్వేషన్ల కోసం 50 శాతం పరిమితిని అధిగమించడానికి రాజ్యాంగాన్ని సవరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, ఇబిసిలకు రిజర్వేషన్లను అనుమతించే ఆర్టికల్ 15(5)ను అమలు చేయాలని మరోసారి డిమాండ్ చేసింది. రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో సామాజిక న్యాయం, సాధికారతకు ప్రాథమిక ప్రాముఖ్యత కలిగిన ఈ మూడు అంశాలను కాంగ్రెస్ కచ్చితంగా పరిశీలిస్తుందని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ పేర్కొన్నారు. 'ప్రధాని బిహార్‌లో ఉన్నారు. రాష్ట్రంలో మునుపటి ఇండియా కూటమి ప్రభుత్వం నిర్వహించిన కుల సర్వే ఆధారంగా, బిహార్ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఒబిసిలు, ఇబిసిలకు 65శాతం రిజర్వేషన్లను ప్రతిపాదించింది. ఇది కోర్టులలో సవాలు చేయబడింది' అని రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. బిహార్‌లోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం దాదాపుగా అన్నీ వదిలేసింనద్నారు. కానీ కాంగ్రెస్ చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నవి మూడు ఉన్నాయని, అవి 65 శాతం రిజర్వేషన్లను వాస్తవంగా మారుస్తాయన్నారు. బిహార్ రిజర్వేషన్ల చట్టాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో భాగం చేయాలని రమేష్ విజ్ఞప్తి చేశారు. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లను కాపాడటానికి 1994లో నరసింహారావు ప్రభుత్వం ఆ విధంగానే చేసిందని ఆయన అన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఒబిసి, ఇబిసిల రిజర్వేషన్ల కోసం 50 శాతం సీలింగ్‌ను అధిగమించడానికి రాజ్యాంగాన్ని సవరించాలని కూడా ఆయన కోరారు. గత ఆరు దశాబ్దాలుగా సుప్రీంకోర్టు ఇచ్చిన వివిధ తీర్పుల కారణంగానే ఈ సీలింగ్ విధించబడిందని రమేష్ అన్నారు. 'ఆర్టికల్ 15(5) ప్రైవేట్ విద్యాసంస్థల్లో కూడా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఒబిసి, ఇబిసిలకు రిజర్వేషన్లను అనుమతిస్తుంది. 2006లో డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణను సుప్రీంకోర్టు సమర్థించిన తర్వాత గత 11 సంవత్సరాలుగా ఇది అమలు కాలేదు' అని ఆయన అన్నారు. జూలై 21న ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో సామాజిక న్యాయం, సాధికారతకు ప్రాథమిక ప్రాముఖ్యత కలిగిన ఈ మూడు అంశాలను కాంగ్రెస్ కచ్చితంగా లేవనెత్తుతుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం నుండి రెండు రోజుల పాటు మూడు రాష్ట్రాల పర్యటన చేయనున్న నేపథ్యంలో రమేష్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ పర్యటనలో బిహార్, ఒడిశాలో బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సామూహిక యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. మోదీ శుక్రవారం బిహార్‌లోని సివాన్, ఒడిశాలోని భువనేశ్వర్‌లో పర్యటించారు.

# బెంగాల్‌లో కారు, ట్రక్కు ఢీ

### 9 మంది మృత్యువాత
### మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారే...



**పురిలియా :** పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ సరిహద్దులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారులోని 9 మంది యువకులు మృతి చెందారు. బెంగాల్‌లో జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లి, తిరిగి వస్తుండగా ఈ ఘోర ప్రమాదం జరిగింది. 'పశ్చిమ బెంగాల్‌లోని పురులియా జిల్లా, బలరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నామ్శోల్ గ్రామం సమీపంలో శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. హైవేపై బొలెరో ఎస్‌యువి కారు, ట్రక్కు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. దీనితో కారు బోల్తా పడి పూర్తిగా ధ్వంసం అయ్యింది. కారులో ఉన్న వారిని స్థానికుల సాయంతో ఆసుపత్రికి తరలించాం. అయితే అప్పటికే అందులోని తొమ్మిది మంది మరణించినట్లు వైద్యులు తెలిపారు. కారులో ఉన్నవారు బెంగాల్‌లో జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లి, తిరిగి వస్తున్నారు. వారంతా జార్ఖండ్‌లోని తిలైటాండ్ గ్రామానికి చెందినవారని తెలిసింది. ప్రాథమిక దర్యాప్తులో అతివేగం, నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. కేసు నమోదు చేశాం. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది' అని బలరాంపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ సౌమ్యదీప్ మల్లిక్ తెలిపారు. కాగా, మృతులందరూ ఒకే గ్రామానికి చెందిన యువకులు కావడంతో అక్కడ విషాధ ఛాయలు అలుముకున్నాయి. స్థానిక పోలీసుల సాయం తో పోస్ట్‌మార్టం తరువాత, మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగిస్తాం అని నీమ్‌దీహ్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ శాంతన్ తివా రీ తెలిపారు.

# వేదికపై ద్రౌపది ముర్ము కంటతడి



**న్యూఢిల్లీ :** డెహ్రాడూన్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వేదికపైనే భావోద్వేగానికి గురయ్యారు. కంట తడి పెట్టారు. రాష్ట్రపతి 67వ పుట్టినరోజు సందర్భంగా డెహ్రాడూన్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు అంధ విద్యార్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ గీతాలు ఆలపించారు. ఈ క్రమంలోనే ద్రౌపది ముర్ము భావోద్వేగానికి లోనయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఉత్తరాఖండ్‌లో మూడు రోజుల పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి డెహ్రాడూన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విజువల్లీ హ్యాండీక్యాప్డ్ డిసేబిలిటీ (ఎన్‌ఐఇపివిడి)ని సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ, పిల్లలు ఎంతో అందంగా పాడుతుంటే భావోద్వేగానికి గురయ్యానని చెప్పారు.'కన్నీళ్లు ఆగలేదు. పిల్లలు చాలా చక్కగా పాడారు. ఇది వారి హృదయం లోతుల్లోంచి వచ్చిన పాట' అని అన్నారు. పుట్టుకతోనే వైకల్యంతో పుట్టిన వారిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, వారిలో ఆత్మవిశ్వాసం నింపి ముందుకు తీసుకువెళ్తే ఒక నాటికి కచ్చితంగా వారు సక్సెస్ అవుతారని రాష్ట్రపతి అన్నారు. వైకల్యంతో ఉన్న పిల్లల సాధికారత, సమాన అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం పథకాల రూపకల్పన జరుగుతోందని చెప్పారు. వైకల్యంతో పుట్టిన పిల్లల సాధికారత కోసం పని చేస్తున్న ఎన్‌ఐఇపివిడిని అభినందించారు. ఉత్తరాఖండ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్ సింగ్ (రిటైర్డ్, ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ థామి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మరోసారి శుభాంశు శుక్లా రోదసియాత్ర వాయిదా

### కొత్త తేదీ త్వరలోనే ప్రకటన



**న్యూఢిల్లీ :** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా చేపట్టిన రోదసియాత్ర మరోసారి వాయిదా పడింది. దీనిని అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ యాక్సియం స్పేస్ చేపట్టింది. స్పేస్ ఎక్స్ సంస్థకు చెందిన డ్రాగన్ వ్యోమనౌకలో భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసిలోకి వెళ్లాల్సి ఉంది. జూన్ 19న యాత్ర ఉంటుందని ముం దుగా ఇస్రో ప్రకటించగా, ఆ తర్వాత జూన్ 22కు వాయి దా వేశారు. తాజాగా మరోసారి వాయిదా వేస్తూ ప్రయోగ తేదీని త్వరలో ప్రకటిస్తామని నాసా వెల్లడించింది.

**ఇప్పటికే పలుమార్లు వాయిదా**

యాక్సియం–4 మిషన్‌ను ఇస్రో, అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా), ఐరోపా అంతరిక్ష సంస్థ (ఇఎస్‌ఎ)లు కలిసి సంయుక్తంగా చేపట్టాయి. ఇందులో మరో ముగ్గురు ఆస్ట్రోనాట్లతో కలిసి శుభాంశు రోదసియాత్ర చేపట్టనున్నారు. పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ) పాల్గొననున్నారు. ఈ అంతరిక్ష యాత్రలో శుక్లాకు 'Shukx' అనే కాల్‌సైన్ కేటాయించినట్లు నాసా వర్గాలు తెలిపాయి. ఈ స్పేస్ క్యాప్సూల్‌ను ఫాల్కన్–9 రాకెట్ నింగిలోకి మోసుకెళ్లనుండగా, దీనికి శుభాంశు మిషన్ పైలట్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు. కాగా, ఇప్పటికే వాతావరణం అనుకూలించకపోవడం, సాంకేతిక సమస్య తలెత్తడం వంటి సాంకేతిక కారణాలతో యాక్సియం4 ప్రయోగం పలుమార్లు వాయిదా పడింది.

**14 రోజుల పాటు అంతరిక్షంలోనే**

భూమి నుంచి బయల్దేరిన 28 గంటల తర్వాత ఈ వ్యోమనౌక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)తో అనుసంధానం అవుతుంది. అనంతరం శుభాంశు బృందం అక్కడే 14 రోజుల పాటు ఉండనుంది. భారరహిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోదీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతోనూ ఈ బృందం ముచ్చటించనుంది.

## క్రిమినల్ కేసులో అనుమానితుడిగా ఓ జర్నలిస్టు
# తప్పుడుగా గుర్తించిన పోలీస్‌లు

**న్యూఢిల్లీ :** ఢిల్లీ పోలీసులు నోయిడాకు చెం దిన ఒక జర్నలిస్టును క్రిమినల్ కేసులో అనుమానితుడిగా తప్పుగా గుర్తించారు. జర్నలిస్ట్, పోలీసు బృందం పాల్గొన్న ఘటనకు చెందిన బహుళ వీడియోలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వైరల్ అయ్యాయి. ఘర్షణ తర్వాత, పోలీసు బృందం క్షమాపణ లేఖ రాసింది. జర్నలిస్టును అనుమానితుడిగా తప్పుగా గుర్తించినందుకు ఢిల్లీ పోలీసులు ఒక ప్రకటనలో క్షమాపణలు చెప్పారు. ఔటర్ ఢిల్లీలోని ప్రేమ్ నగర్ పోలీస్ స్టేషన్ నుండి సబ్‌ఇన్‌స్పెక్టర్, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌తో కూడిన బృందం భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 318(4) (విలువైన భద్రతతో మోసం), 61(2) (నేర పూరిత కుట్ర) కింద నమోదైన కేసును దర్యాప్తు చేస్తోంది. బహదూర్‌గఢ్ నివాసి రాహుల్‌గా గుర్తించబడిన నిందితుడు ఉన్న చోటును బృందం అతని మొబైల్ ఫోన్ ద్వారా ట్రాక్ చేస్తోంది అని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (షాహదారా) ప్రశాంత్ గౌతమ్ తెలిపారు. నోయిడాలోని పెట్రోల్ పంప్ వద్దకు తమ బృం దం సిగ్నల్ ద్వారా వెళ్ళిందని, అక్కడ అనుమానితుడి వివరణతో సరిపోలిన వ్యక్తి తో కారులో ఉన్న ఒక వ్యక్తిని కనుగొన్నారని ఆ యన అన్నారు. ఆ వ్యక్తి తరువాత తనను తాను నోయిడాకు చెందిన జర్నలిస్ట్ రా హుల్ షా అని పరిచయం చేసుకున్నాడు అ ని డిసిపి చెప్పారు. అయితే, తాను గుర్తిం పుకార్డు చూపించడానికి నిరాకరించాననే పోలీసుల వాదనను జర్నలిస్ట్ తోసిపుచ్చారు .

## సిఐసిలో ప్రధాన సమాచార కమిషనర్ పోస్ట్‌కు
# దరఖాస్తు గడువు పొడిగింపు

### సిబ్బంది మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ
### ఈ ఏడాది చివరినాటికి ప్రస్తుత ప్రధాన సమాచార కమిషనర్ హీరాలాల్ సమారియా పదవీకాలం పూర్తి

**న్యూఢిల్లీ :** కేంద్ర సమాచార కమిషన్ (సిఐసి)లో పారదర్శకత వాచ్‌డాగ్‌గా వ్యవహరించే ప్రధాన సమాచార కమిషనర్ పదవికి దరఖాస్తు చేసుకునేందుకు తుదిగడువును కేంద్ర ప్రభుత్వం ఈ నెలాఖరుకు పొడిగించింది. కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ గత నెలలో ఈ పదవి కోసం అర్హులైన అభ్యర్థులనుంచి దరఖాస్తులను కోరింది. దరఖాస్తులను స్వీకరించడానికి ఇంతకుముందు జూన్ 20ను ఆఖరుతేదీగా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, సిఐసిలో చీఫ్ కమిషనర్ నియమాకం కోసం దరఖాస్తుల స్వీకరణ తేదీని జూన్ 30వ తేదీ (సాయంత్రం 5గంటల) వరకు పొడిగించినట్లు సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుక్రవారం జారీచేసిన ఉత్తర్వులో పేర్కొంది. ప్రధాన సమాచార కమిషనర్‌కు సంబంధించిన నిబంధనలు, షరతులు, ఇతర అర్హత ప్రమాణాలు ఇంతకు ముందు తెలిపిన ప్రకారమే ఉంటాయని, ఎలాంటి మార్పు లేదని ఆ ఉత్తర్వులో వెల్లడించింది. కేంద్ర సమాచార కమిషన్ అభ్యర్థనలు, ఫిర్యాదులను సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) యాక్ట్ కింద అప్పీళ్లు, ఫిర్యాదులను నిర్ణయించే అధికారాన్ని కలిగి ఉంటుంది. సిఐసికి అధిపతిగా ప్రధాన సమాచార కమిషనర్ నేతృత్వం వహిస్తారు. సిఐసిలో గరిష్ఠంగా 10మంది సమాచార కమిషనర్లు ఉంటారు. ప్రస్తుతం కమిషన్‌లో ప్రధాన సమాచార కమిషనర్ హీరాలాల్ సమారియాతో పాటు ఇద్దరు సమాచార కమిషనర్లు పనిచేస్తున్నారు. పూర్వ ఐఎస్ ఆఫీసర్ సమారియా పదవీకాలం ఈ సంవత్సరం తర్వాత ముగియనుంది. ప్రధాన సమాచార కమిషనర్ కేంద్రం నిర్దేశించిన కాలం వరకు పదవిలో ఉంటారు. ఆ త ర్వాత ఆయన పునర్నియామకానికి అర్హులు కారు. 65 ఏళ్ల వయసు పూర్తి చేసుకున్న తర్వాత ఏ ప్రధాన సమాచార కమిషనర్ కూడా తన పదవిలో కొనసాగే అవకాశం లేదని సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులో తెలిపింది. 1960 సెప్టెంబరు 14న హీరాలాల్ సమారియా జన్మించారు. ఆయన్ను ప్రధాన సమాచార కమిషనర్‌గా 2023 నవంబరు 6న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రమాణస్వీకారం చేయించారు. సమాచార హక్కు చట్టం ప్రకారం...ప్రధాన సమాచార కమిషనర్ ప్రజాజీవితంలో ప్రముఖ వ్యక్తిగా చట్టం, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, నిర్వహణ, జర్నలిజం, మాస్ మీడియా, అడ్మినిస్ట్రేషన్, పాలనలో విస్తృత జ్ఞానం, అనుభవం కలిగి ఉండాలి.

# బిహార్ అభివృద్ధి ఘనత 'ఎన్‌డిఏ'దే

### సివాన్ బహిరంగ సభలో ఆర్‌జెడి-కాంగ్రెస్‌పై నిప్పులుచెరిగిన ప్రధాని మోదీ
### బిహార్‌ను పేదరికంలోకి నెట్టేసి..
### చట్టవిరుద్ధ పాలన సాగిస్తున్నారని ధ్వజం
### అంబేద్కర్ ఫొటోను వాళ్లు పాదాలకింద పెడితే, నేను నా హృదయానికి దగ్గరగా ఉంచానని విమర్శనాస్త్రాలు



**సివాన్ (బిహార్) :** యావత్ దేశం నిశితంగా గమనిస్తున్న బిహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచార వేడిని కేంద్రంలో బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఏ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరింత రగిలించారు. బిహార్ రాష్ట్రం సివాన్‌లో శుక్రవారం జరిగిన పబ్లిక్ ర్యాలీని ఉద్దేశించి నరేంద్రమోదీ ప్రసంగిస్తూ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) తీవ్రస్థాయిలో విమర్శల దాడి చేశారు. బిహార్‌ను పేదరికంలోకి నెట్టేసింది వారేనని, వారిపాలన చట్టరహితంగా సాగిందని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్‌ఆర్‌జెడి కలయికలోని 'జంగిల్ రాజ్'కు బిహార్ ప్రజలు చరమగీతం పాడాలని మోదీ పిలుపునిచ్చారు. బాబా సాహెబ్ భీమ్‌రావు అంబేద్కర్‌ను ఆర్‌జెడి అవమానపరుస్తున్నదని, దళిత విగ్రహాన్ని అవమానపరిస్తే బిహార్ రాష్ట్ర ప్రజలు సహించబోరని చెప్పారు. దశాబ్దాలుగా బిహార్ రాష్ట్రాన్ని వెంటాడుతున్న పేదరికాన్ని తట్టుకోలేక బిహార్ నుంచి అధిక సంఖ్యలో కార్మికులు పొట్టచేతబట్టుకుని వలసలు వెళుతున్నారని, అందుకు వారే కారణమని ధ్వజమెత్తారు. ఆర్‌జెడికాంగ్రెస్ పాలనలో వారి సొంత కుటుంబాలే సంపన్నులయ్యారని, ప్రజల అవసరాలను వారు పూర్తిగా విస్మరించారని, కాంగ్రెస్ లైసెన్స్ రాజ్ హయాంలో వారి నాయకులు ధనవంతులు కాగా, ప్రజలు మాత్రం మరింత పేదలుగా దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని మోదీ విరుచుకుపడ్డారు.'రాష్ట్రీయ జనతాదళ్ బాబాసాహెబ్‌ను, బిహార్ ప్రజలను అవమానపరిచింది. వారి నాయకులను బిహార్ రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ క్షమించరు. ఆర్‌జెడి కాంగ్రెస్ నాయకులు దేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ఫోటోను వారి పాదాలకింద ఉంచుకుంటారు. కానీ నేను మాత్రం ఆ ఫోటోను నా హృదయానికి దగ్గరగా ఉంచుకుంటాను' అని మోదీ తెలిపారు. ఆర్‌జెడి రాజకీయ దృక్పథాన్ని నరేంద్రమోదీ తూర్పారబట్టారు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్'ను మేం విశ్వసిస్తాం కానీ వారు 'పరివార్ కా వికాస్'ను మాత్రమే నమ్ముతారని ఎద్దేవా చేశారు. బిహార్ గత కష్టాలకు కారణం కాంగ్రెస్‌ఆర్‌జెడి కలయికే కారణమని, వారే మళ్లీ అధికారంపైన కన్నేశారని మోదీ హెచ్చరించారు. వారు జంగిల్‌రాజ్‌ను సృష్టించి, మళ్లీ తిరిగిరావాలని కోరుకుంటున్నారని, బిహార్ ప్రజలు త్వరలోనే జరుగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం నేర్పనున్నారని ఆయన చెప్పారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు కొద్ది నెలల్లో జరుగనున్నాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్‌డిఏ ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని ప్రధానంగా ప్రస్తావించారు. ఇటీవలి సంవత్సరాలలో జరుగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి ప్రధాన సాక్ష్యం అన్నారు. ఎన్‌డిఏ కింద 55,000 కి.మీ.ల గ్రామీణ రోడ్ల నిర్మాణం జరిగిందని, 1.5కోట్ల గృహాలకు విద్యుత్ సౌకర్యం అందిందని, 26 క్లోమంది ప్రజల దరికి తాగునీరు చేరిందని మోదీ చెప్పారు. యావత్ ప్రపంచం అంతా భారతదేశ అభివృద్ధి ప్రస్థానాన్ని గుర్తించిందన్నారు. ఇటీవలి తన విదేశీ పర్యటనలో పలువురు ప్రపంచ నేతలు భారతదేశ ప్రగతిని ప్రశంసించారని వివరించారు.


**రూ.5,900కోట్లకు పైగా విలువైన ప్రాజెక్ట్‌లను ప్రధాని ప్రారంభం, శంకుస్థాపనలు**

శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బిహార్ రాష్ట్రం సివాన్ జిల్లాలో ప్రధాని మోదీ రూ.5,900కోట్లకు పైగా విలువైన ప్రాజెక్ట్‌ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన రూ.400కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన వైశాలి డియోరియా రైల్వే లైన్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ఈ మార్గంలో నూతనరైలు సర్వీస్‌కు జెండా ఊపి ప్రారంభించారు.అంతేకాకుండా నార్త్ బిహార్‌ను అనుసంధానాన్ని బలోపేతానికి దోహదపడనున్న పాటలీపుత్ర (పాట్నా) గోరఖ్‌పూర్ వయా ముజఫర్‌పూర్‌బెత్తియా మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు కూడా ఆయన జెండా ఊపి ప్రారంభించారు. 'మేక్ ఇన్ ఇండియామేక్ ఫర్ ది వరల్డ్ 'ను మరింతగా ప్రోత్సహిస్తూ రిపబ్లిక్ ఆఫ్ గినియాకు ఎగుమతి చేయడానికి అత్యాధునిక లోకోమోటివ్ ప్లాంట్‌ను ప్రధాన మంత్రి మోదీ జెండా ఊపి ప్రారంభించారు. తన నిబద్ధతకు అనుగుణంగా ప్రధాని మోదీ గంగానది సంరక్షణ కోసం రూ.1,800కోట్ల విలువైన నమామీ గంగా ప్రాజెక్ట్ కింద ఆరు మురుగునీటి శుద్ధి కేంద్రాలను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు. బిహార్ వ్యాప్తంగా మొత్తం రూ.3,000కోట్ల ఎస్‌టిపి ప్రాజెక్ట్స్, పారిశుద్ధ్యం, నీటి సరఫరా ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపనలు చేశారు. ఇంధనరంగానికి ఊతం కల్పించేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ 500మెగా వాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ (బిఇఎస్‌ఎస్), రాష్ట్రం అంతటికీ ఉపకరించే ముజఫర్‌పూర్ సహా మోతిహరి, బెత్తియా, సివాన్‌లలో 15 గ్రిడ్‌సబ్‌స్టేషన్లకు శంకుస్థాపనలు చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనఅర్బన్ (పిఎంఎవైయు) కింద 53,600మంది లబ్ధిదారులకు మొదటి విడతను ప్రధాని మోదీ అందజేశారు. ఈ కార్యక్రమంలో 6,600కు పైగా పూర్తి అయిన ఇండ్ల గృహ ప్రవేశ్ వేడుక కోసం ఎంపిక చేసిన లబ్ధిదారులకు తాళాలు అందజేశారు. బిహార్ గవర్నర్ ఆరిఫ్ మోహమ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్‌కుమార్ సిన్హా, కేంద్ర మంత్రులు, పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ముస్తాబైన విశాఖ సాగరతీరం...

### నేడు విశాఖలో యోగా వేడుకలకు ప్రధాని





**విశాఖపట్నం :** శరీరం, ఆత్మల కలయిక యోగా , దేహాన్ని చైతన్యపరిచి, మనసుకు ఉత్తేజాన్ని కల్గించేది యోగా, సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే ఈ ప్రాచీన విద్య పరమావధి , ఈ అపూర్వ యోగ విద్యను సామాన్యుల దరికి చేర్చడం ద్వారా ప్రజలందరినీ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మహా ప్రదర్శనకు విశాఖ సాగర తీరం సిద్ధమయ్యింది. రాష్ట్రంలో నేడు యోగాంధ్ర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సామాన్యుల చెంతకు దరిచేర్చడమే లక్ష్యంగా నెల రోజులపాటు వివిధ వర్గాల ప్రజల భాగస్వామ్యంతో యోగా శిక్షణ పూర్తయ్యింది. యోగాంధ్ర చివరిరోజు కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ప్రదేశాల్లో యోగా ప్రదర్శన జరుగుతుంది. దీనిలో భాగంగా విశాఖపట్నం సముద్ర తీరంలో గిన్నిస్ రికార్డు సాధనే లక్ష్యంగా సుమారు 5 లక్షలమందితో శనివారం యోగా ప్రదర్శన నిర్వహించేందుకు ప్రభుత్వం యం త్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మెగా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర మం త్రులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలివచ్చే జనమంతా భాగస్వాములు కానున్నారు.

## బోధనాంశాల్లో 'గవర్నర్ పాత్ర,
# రాజ్యాంగ పరిమితులు'

### కేరళ విద్యా శాఖ ప్రకటన

**తిరువనంతపురం:** కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉన్నత మాధ్యమిక తరగతుల సిలబస్‌లో మార్పులు చేసింది. గవర్నర్ పాత్ర, అధికారాలు, రాజ్యాంగ పరిమితులను బోధనాంశాలుగా చేర్చనుంది. ఈ మేరకు కేరళ విద్యా శాఖ ఒక ప్రకటన చేసింది. సమాఖ్య రాజకీయాల గురించి తెలియజేసే ప్రజాస్వామ్యం, రాజ్యాంగ ప్రక్రియలపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు ఆయా అంశాలను కూడా సిలస్‌లో చేర్చినట్లు తెలిపింది. విద్యార్థి స్థాయి నుంచే ఈ అన్ని అంశాలు తెలియడం నేటి సామాజిక అవసరాల దృష్ట్యా ముఖ్యమని విద్యా శాఖ మంత్రి శివన్‌కుట్టి అన్నారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు మార్పులను వివరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయ్యే ముఖ్యమంత్రి, కేబినెట్, అసెంబ్లీ సమిష్టి బాధ్యతలు విద్యార్థులకు తెలియాలన్నారు. రాష్ట్ర నిధులతో నడిచే విశ్వవిద్యాలయాల నిర్వహణలో ఛాన్సలర్‌గా గవర్నర్ జోక్యం, అసెంబ్లీ తీర్మానించిన బిల్లుల ఆమోదానికి నిరాకరించడం, రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వు చేయడం ద్వారా కీలక బిల్లులను ఆలస్యం చేయడం, కార్యక్రమాల్లో రాజకీయ పార్టీల చిహ్నాలు ప్రదర్శించడం వంటి వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కేరళ ప్రభుత్వం ఈ మేరకు పాఠ్యాంశాల్లో మార్పులు చేయడం చర్చకు దారితీసింది. ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో భరతమాతగా ప్రదర్శించే సింహంపై కాషాయ జెండాతో ఉన్న మహిళ చిత్రాన్ని అధికారిక కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ప్రదర్శించడాన్ని నిరసిస్తూ శివన్‌కుట్టి వాకౌట్ చేసిన సంగతి తెలిసిందే.


SHRIRAM Finance

**వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనముల వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TG02 4575 | Tallapally Raja Mouli | DZIRE TOUR DIESEL 5 SEATER | 2015 |
| 2 | TS19E 4012 | Punna Harish | BOLT 13L XMS QUADRAJET DIESEL 5 SEATER | 2015 |
| 3 | TS25F 5925 | Renukunta Raju | SONALIKA DI 740 | 2021 |
| 4 | TS26T 9139 | Mahubub Bee Shek | EICHER 380 | 2020 |
| 5 | TS32D 9843 | Mohammad Sajith Pasha | DZIRE TOUR DIESEL 5 SEATER | 2015 |
| 6 | TS02FJ 8661 | Arepalli Shiva Krishna | NEW HOLLAND 4710 | 2023 |
| 7 | TS36J 7204 | Gorlla Ajay | NEW HOLLAND 4710 | 2020 |
| 8 | TG02T 0630 | Karre Sammaiah | SONALIKA DI 740 | 2024 |
| 9 | TS03EF 7923 | Milkuri Sridhar | JOHN DEERE 5042 | 2015 |
| 10 | TS02FJ 1457 | Moutam Pradeep | ERTIGA ZDI BS4 DIESEL 7 SEATER | 2015 |
| 11 | TS12EX 2898 | Punna Harish | SWIF DZIRE VDI DIESEL 5 SEATER | 2014 |
| 12 | TS03UD 5964 | Enugula Sudhakar | SWARAJ 843 XM | 2018 |
| 13 | AP36AN 1331 | Vijaya Laxmi Sampangi | JCB 3DX | 2010 |
| 14 | TS06EA 0184 | Kanukuntla Sampath | JOHN DEERE 5055 HARVESTER | 2014 |


AUCTION DATE: 24-06-2025

VENUE : SHRIRAM AUTOMALL, KARIMNAGAR, ALUGUNURU, HYDERABAD ROAD, KARIMNAGAR

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

H.No :12-209/1,1st floor, Upstairs of Telangana Grameena Bank, Warangal Road, Huzurabad. Cell : 7702785091



# జనరల్
STATE & REGIONAL NEWS

## విజ్ఞాన్ వర్శిటీ కళాశాల గుర్తింపు రద్దు చేయండి

మాల మహానాడు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూదాన్ పోచంపల్లి విజ్ఞాన్ యూనివర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యంతో దళిత విద్యార్థి మృతి చెందారని, ఇందుకు ఆ కళాశాలకు యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేయాలని మాల మహానాడు ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ఇటిక్యాల పురుషోత్తంను కోరారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో మృతి చెందిన విద్యార్థి తండ్రి బొడ్డు బానుప్రతాప్, రజనితో కలిసి మాలమహానాడు ప్రతినిధులు చిప్పల నర్సింగరావు, మహేందర్, భైరి హరితో కలిసి హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో పురుషోత్తంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిల్లి సుధాకర్ మాట్లాడుతూ విజ్ఞాన్ కళాశాల యుజిసి నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నారని ఆరోపించారు. దీనిపైన ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ పురుషోత్తం స్పందిస్తూ తగిన విచారణ నిర్వహి స్తామని వారికి హామీనిచ్చారు.



## భూ సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిషారం కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్మారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వీపనగండ్లలో రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో చివరి రోజు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. మండల పరిధిలోని గ్రామాలలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఇప్పటి వరకు 810 దరఖాస్తులు వచ్చాయని, 37 మంది రైతులు మీ సేవలో దరఖాస్తు చేసుకున్నారని వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని తహసీల్దార్ వరల మంత్రి జూపల్లికి వివరించారు. రైతుల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని సూచించారు. ఆగస్టు 15వ తేదీలోగా రెవెన్యూ సదస్సులు వచ్చిన దరఖాస్తులు పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని వనపర్తి ఆర్డీఓ సుబ్రహ్మణ్యం మంత్రి జూపల్లికి వివరించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా భూ సమస్యలను పరిష్కరించాలని, ఏ గ్రామాల్లో రైతులకు వివరించాలని సూచించారు. నయాబ్ తహసీల్దార్ కృష్ణమూర్తి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోదల బీరయ్య, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎత్తం కృష్ణయ్య, సుదర్శన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, గోపి, మహేష్ నాయుడు, చిన్నారెడ్డి, రామిరెడ్డి, గోపాల్ నాయక్ , వెంకటయ్య పాల్గొన్నారు.

## మ్యాచ్‌ఫిక్సింగ్‌లో భాగమే చంద్రబాబుతో చర్చలు, మంత్రివర్గ సమావేశం: హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మంత్రివర్గ సమావేశ ఏర్పాటు, చంద్రబాబుతో చర్చల ప్రతిపాదన ముందే కుదుర్చుకున్న మ్యాచ్ ఫిక్సింగ్‌లో భాగమని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గోదావరిలో తెలంగాణ రాష్ట్రానికి ఇప్పటికే జారీ చేసిన జిఒల ఆధారంగా 968 టిఎంసిల హక్కుకు తోడు సముద్రం లో కలుస్తున్న 3 వేల టిఎంసిలలో 1950 టిఎంసిల జలాలు తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కృష్ణా జలాల్లో 763 టిఎంసిల వాటా కోసం ట్రిబ్యునల్ ముందు కెసిఆర్ పోరాడితే, సిఎం రేవంత్ రెడ్డి 500 టిఎంసిలతో సరిపెట్టాలనుకోవడం తెలంగాణ రాష్ట్రాన్ని నిండా ముంచడమేనని ఆరోపించారు. అపెక్స్ కౌన్సిల్ కు డిమాండ్ చేయకపోవడం ,చంద్రబాబుతో చర్చలు చేస్తామనడం వెనక మతలబు ఏమిటని, ఇది చంద్రబాబుకు గురుదక్షిణగా భావించాలా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో 299 టిఎంసిలకే బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఒప్పుకున్నట్టు సిఎం రేవంత్ రెడ్డి అదేపనిగా దుష్ప్రచారం చేస్తున్నారని ఖండించారు. బనకచర్ల అసలు భాగోతం ఢిల్లీలో మాటల ద్వారా బయటపడిందని, బనకచర్లపై చంద్రబాబు నాయుడుతో సిఎం రేవంత్ ముందే లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని, గోదావరి లో 1000 టిఎంసిలు, కృష్ణా లో 500 టిఎంసిలు ఇస్తే చాలనే పల్లవిని వినిపిస్తున్నారని ఆరోపించారు.

## సంచలన కిడ్నాప్ కేసు ఛేదన

ఆరుగురు నిందితుల అరెస్ట్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** మాజీ డిసిసిబి చైర్మన్ చిక్యాల హరీష్ కుమార్ రావు కిడ్నాప్ కేసును నిర్మల్ పోలీసులు మూడు రోజుల్లో ఛేదించి, ఈ నేరంలో పాల్గొన్న ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కిడ్నాప్ వెనుక ప్రధాన సూత్రధారి షేక్ హైదర్ అని పోలీసులు గుర్తించారు. వ్యక్తిగత పగతో హదర్ ఈ కుట్ర పన్నినట్లు తెలిందీ. హైదర్ బానాల ప్రిన్స్ మరో నలుగురు సహచరులతో కలిసి ఈ కిడ్నాప్‌ను అమలు చేశారు. నిందితులు హరీష్ కుమార్ రావును కిడ్నాప్ చేయడమే కాకుండా, ఆయన వద్ద నుండి రూ.5000 నగదు, బంగారు ఆభరణాలను దొంగిలించి, భారీగా 3 కోట్ల విడుదల కోసం డబ్బు డిమాండ్ చేశారు. ఈ భయంకరమైన సంఘటన జూన్ 15అర్థరాత్రి జరిగింది. నిందితులు బలవంతంగా హరీష్ కుమార్‌రావు ఇంట్లోకి చొరబడి, ఆయన్ను కారులో ఎక్కించుకుని హైదరాబాద్ వైపు వెళ్లారు. అయితే, బాధితుడి అదృష్టం, పట్టుదల వల్ల మనోహరాబాద్ టోల్ ప్లాజా వద్ద హరీష్ కుమార్ రావు తన చేతి కట్లను విడిపించుకుని తప్పించుకున్నారు. నిందితులు అద్దె కారును వదిలి పారిపోయారు. ఫిర్యాదు అందిన వెంటనే, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జి.జానకి షర్మిల వెంటనే చర్యలు తీసుకున్నారు. కేసును దర్యాప్తు చేయడానికి నేరస్థులను పట్టుకోవడానికి ఆమె ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ అంకితభావంతో కూడిన బృందాలు అలసిపోకుండా పనిచేసి, వివిధ దర్యాప్తు పద్ధతులను ఉపయోగించి, ఆరుగురు నిందితులను విజయవంతంగా పట్టుకున్నారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన కారు, బంగారు చైన్ రూ.2000 నగదు, పలు మొబైల్ ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కేసు విజయవంతంగా పరిష్కరించబడిన సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, ప్రజల భద్రతకు పోలీసులు కట్టుబడి ఉన్నారని పునరుద్ఘాటించారు. అనుమానాస్పద కార్యకలాపాలను అధికారులకు తెలియజేయాలని ఆమె పౌరులను కోరారు.

### స్థానిక ఎన్నికల్లో కలిసికట్టుగా పోటీచేయడంపై...


## ఎంవిఎ భాగస్వామ్యపక్షాలు చర్చించాల్సి ఉంది

ఎన్‌సిపి చీఫ్ శరద్‌పవార్ వెల్లడి

**పుణే :** త్వరలో జరుగనున్న మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలలో కలిసికట్టుగా పోటీ చేసే విషయమై మహా వికాస్ అఘాడీ (ఎంవిఏ) భాగస్వామ్యపక్షాలు చర్చిస్తాయని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) చీఫ్ శరద్‌పవార్ తెలిపారు. జూన్ 22న పట్టణంలోని మాలేగావ్ సహకార పంచదార మిల్లు ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఎన్‌సిపి చీఫ్ అజిత్‌పవార్ నేతృత్వంలోని పుణే జిల్లా బారామతి కేంద్ర సహకార (పిడిసిసి) బ్యాంక్ బుధవారం అర్ధరాత్రి వరకు తెరిచి ఉండటం పట్ల ఆయన ఆశ్చర్యం వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు ఆదేశించినందున రాష్ట్రంలోని మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ త్వరలోనే ప్రారంభం అవుతుందని శరద్‌పవార్ బారామతిలో విలేకరుల ప్రశ్నకు సమాధానమిచ్చారు. మేం ఇప్పటివరకూ కాంగ్రెస్‌తో , మా పార్టీ, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివ్‌సేన (యుబిటి), షెట్కారీ కామ్‌గర్ పక్ష్, ఇతర పార్టీలు ఎన్నికలలో కలిసికట్టుగా పోటీచేసే విషయమై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని, తుది నిర్ణయం తీసుకున్నా మేం ఆశించిన మేరకు కలిసికట్టుగా పోటీచేస్తామని శరద్‌పవార్ చెప్పారు. ముంబయ్‌లో ఎంవిఐతో కలిసి ఉమ్మడిగా పోటీ చేసే అవకాశం ఏమైనా ఉందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఇప్పటి వరకూ అలాంటి చర్చ ఏమీ జరుగలేదని చెప్పారు. మా విషయానికి వస్తే, ముంబయిలో ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యుబిటి)కి గట్టి పట్టు ఉందని, వారిఅభిప్రాయాన్ని పరిగణనలోనికి తీసుకుంటామన్నారు.

# పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ఎజెండా

575మందికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/మోమిన్‌పేట్/మర్పల్లి :** దేశంలో పేదల కోసం కూడు, గుడ్డ, నీడ స్వర్గీ ఇందిరా గాంధీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని శాసన సభా స్పీకర్ ప్రసాద్ గుర్తుచేశారు. మోమిన్‌పేట్ మండలానికి సంబంధించి 312మందికి, మర్పల్లి మండలానికి సంబంధించి 263 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ళ మంజూరు పత్రాలను మోమిన్‌పేట్ మండలానికి సంబంధించిన 27మందికి, మర్పల్లి మండలానికి సంబంధించిన 60మందికి కల్యాణ లక్ష్మి షాదీముబారక్ చెక్కలను లబ్ధిదారులకు శాసన సభా స్పీకర్ ప్రసాద్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రాష్ట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కూడా అదే ఆశయంతో పనిచేస్తుందని ఆయన తెలిపారు. అందుకే రాష్టంలోని పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయడం జరిగిందని, మంజురైన వాళ్ళు వెంటనే పనులను మొదలు పెట్టి పూర్తి చేసుకోవాలని ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మొత్తం నాలుగు విడుతల్లో లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమచేయడం జరుగుతుందని అయన తెలిపారు. బేస్‌మెంట్ గాని, గోడలు గాని, శ్లాబ్‌గాని నిర్మాణ పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్ధిదారుల ఖతాలో వేయడం జరుగుతుందని అయన తెలిపారు.

ఈ ఏడాది నాలుగు లక్షల యాభైవేల ఇళ్లు వస్తాయని అయన తెలిపారు. నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్లో 22వేల 500 కోట్లను కేటాయించడం జరిగిందని, విడుతలవారిగా రాష్టంలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ళు వస్తాయని ఆయన తెలిపారు. స్పీకర్ హోదాలో ఉండడంతో వికారాబాద్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా 7000 ఇందిరమ్మ ఇళ్ళు వస్తాయని మన నియోజకవర్గంలో కూడా స్వంత ఇల్లు లేని పేదలందరికీ ఏడాదికి కొంతమందికి చొప్పున అందరికీ ఇళ్ళను మంజురు చేయిస్తామని అయన తెలిపారు.

ఓట్లు వేసిన, వేయనోళ్లు అనే భేదం లేకుండా రాజకీయాలకు అతీతంగా పేదలకు అందరికీ సంక్షేమ కార్యక్రమాలు అందుతాయని అయన పేర్కొన్నారు. రాష్టం ప్రభుత్వం మేనిపెస్టోలో పెట్టిన అంశాలతో పాటుగా ఇవ్వని హామీలను కూడా చేపట్టడం జరుగుతుందని అయన అన్నారు. గత 18నెలల్లోనే వ్యవసాయ రంగానికి లక్ష కోట్లు ఖర్చు చేసిందని అయన తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల కాలంలోని 25లక్షల మంది రైతులకు 22వేల కోట్ల రుణమాఫీ చేసిందని స్పీకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విజయలక్ష్మి , తహసీల్దార్ రవిందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు, శంకర్‌యాదవ్, సురేష్ యదవ్, కొండల్‌రెడ్డి, నోత్తమ్‌రెడ్డి, సుభాష్‌గౌడ్, సీరాజుద్దీన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసు భయంకరమైనది

కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసు చాలా భయంకరమైనదని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. జడ్జిలు, వ్యాపారస్తులు, సినీనటులు, ప్రతిపక్ష నాయకులు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, బిజెపి కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, నాయకులు, సోషల్ మీడియా టీమ్ ఫోన్‌లను సైతం ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం స్థానిక సంస్థల ఎన్నికల వర్క్‌షాప్‌లో మాట్లాడారు. అయితే ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో కాంగ్రెస్, బిఆర్ ఎస్ నాటకాలాడుతున్నాయని విమర్శించారు. ఈ విషయంలో రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు సిబిఐ దర్యాప్తునకు డిమాండ్ చేశారని, అధికారంలోకి రాగానే మరోలా మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ అంశాలను తెరపైకి తీసుకొస్తోందని ఆరోపించారు. బిఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అవినీతి, అక్రమాలను, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను నెరవేర్చకుండా వైఫల్యం చెందిన విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలన, ఇప్పుడు కాంగ్రెస్ పాలన రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేశాయని తెలిపారు. రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా అప్పుపుట్టకుండా, పేదల సంక్షేమ పథకాలు అమలుకాకుండా, అభివృద్ధి కార్యక్రమాలు నడవకుండా రాష్ట్రాన్ని దిక్కుతోచని స్థితిలోకి నెట్టేశారని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత నుంచి, బడుగు బలహీన వర్గాల నుంచి కొత్త నాయకత్వం రావాలన్నారు. మండల కమిటీలు, జిల్లా కమిటీల నుంచి వచ్చిన నూతన నాయకత్వం రానున్న రోజుల్లో ఉద్యమాలతో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం రావాలన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోనే తెలంగాణను రక్షించుకోగలుగుతామన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మండలాల వారిగా, జిల్లాలవారిగా బిజెపి వర్క్ షాప్‌లు నిర్వహించుకోవాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అంకితభావంతో, చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. 11 ఏళ్ల నరేంద్ర మోదీ పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు కిషన్ రెడ్డి సూచించారు.



## ఇజ్రాయిల్ దాడులను ఆపాలి, ప్రపంచ శాంతిని కాపాడాలి


అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** పాలస్తీనా, ఇరాన్ దేశాలపై చేస్తున్న దాడులు, యుద్ధాలను ఉక్రెయిన్, రష్యాల మధ్య జరుగుతున్నటువంటి యుద్ధాన్ని మాతృదేశాలు వెంటనే ఆపాలని, ప్రపంచ శాంతిని కాపాడాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ ఐక్యరాజ్యసమితిని సమితిని కోరారు. శుక్రవారం అఖిలభారత సంఘీభావ సంఘం కమిటీ పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా కోర్టులో ఐపోసి ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు గౌన్లు ధరించి ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా, పాలస్తీనాకు సంఘీభావంగా అడ్వకేట్స్ ఫర్ పీస్ (ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, యుద్ధం వద్దు మానవ ప్రగతి కావాలి) నినదిస్తూ భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రంగారెడ్డి జిల్లా కోర్టు మెయిన్ గేటు వద్ద జరిగిన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా ఇప్పటికే ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల వలన పాలస్తీనా వేలాదిమంది ప్రాణాలను కోల్పోయిందని, చిన్నారుల భవిష్యత్తును చిదిమేసిందని, విద్యాలయాలు వైద్యశాలలో పరిశ్రమలు అన్నీ దెబ్బతిన్నాయని, ప్రాణ నష్టం విపరీతంగా జరిగిందని అన్నారు. పైగా ఇటీవల ఇరాన్ పై కూడా ఇజ్రాయిల్ విరుచుకుపడుతుందని కెవిఎల్ తెలిపారు. ఈ యుద్ధాలు ఎవరు చేసినా దేశాలు విధ్వంసం అవుతాయని,ప్రజలు నాగరికత బూడిద పాలవుతుందన్నారు. భవిష్యత్తు అంధకారం అవుతుందని,అందుకే యుద్ధాలను వెంటనే ఆపాలని, ప్రపంచ శాంతిని కాపాడాలని రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ కోరారు. అనంతరం జిల్లా కోర్టు బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రతాపరెడ్డి మాట్లాడుతూ మేధావులంతా యుద్ధాలకు వ్యతిరేకంగా ప్రపంచ శాంతి కోసం నిలబడాలన్నారు. అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ బాసెట్టి కార్తీక్ మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలకు న్యాయం జరగాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయాలను అమలుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం నాయకులు, రమణారావు,విష్ణువర్ధన్ రెడ్డి, శాంతి సంఘం నాయకుడు డి.శ్రీనివాస్, బి.లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రపంచ ప్రజల జీవితాలను కాపాడాలన్నారు. రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కిషోర్ , ప్రముఖ న్యాయవాదులు కె.వీరబాబు, జూపల్లి కృష్ణారావు, నల్లబోతు సత్యనారాయణ రెడ్డి, జీవన్, నిర్మల, జ్యోతి, కర్ణం ప్రశాంత్, నారాయణ, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొని యుద్ధాలకు వ్యతిరేకంగా ప్రపంచ శాంతి ఉద్యమం బలోపేతం కావాలని మాట్లాడారు.

## త్వరలో గూగుల్‌తో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఎంఒయు

తద్వారా ట్రాఫిక్ కష్టాలకు చెక్

సిపి సివి ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ట్రాఫిక్ కష్టాలపై హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ వాహనదారులకు తీపి కబురు అందించారు. ట్రాఫిక్ నియంత్రణకు గూగుల్ తో కలిసి పని చేయబోతున్నామని సివి ఆనంద్ తెలిపారు.హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలు వాటి పరిష్కార మార్గాలపై టిజిఐసిసిసిలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో ప్రతి రోజూ సుమారు 1600 కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. మూడు కమిషనరేట్ల పరిధిలో కలిపి ఒక్క రోజుకు 91 లక్షల వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయి.. వాహనాల సంఖ్య 91 లక్షలకు చేరిందని ఫోర్ వీలర్ల సంఖ్య కూడా బాగా పెరిగిందని సీవీ ఆనంద్ చెప్పారు. అన్ని జంక్షన్లలో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయడానికి సిబ్బంది కొరత ఉందన్నారు. ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్ మెంట్ సిస్టమ్( ఐటిఎంఎస్) రూ.100 కోట్ల వ్యవస్థను ఎల్అండ్‌టి ఇదివరకే ఏర్పాటు చేసిందని దీనిలో ఉన్న అన్ని ఫీచర్లు ఇప్పటి వరకు ఉపయోగించుకోలేకపోయామన్నారు. కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో గూగుల్ తో ఎంఒయూ చేసుకుని వారి గూగుల్ మ్యాప్ డేటా అనలిటిక్స్ సిస్టమ్స్ ఉపయోగించుకుని ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థను మరింత మెరుగుపరుస్తామన్నారు. 'గత ఏడాది వరకు నగరంలో వాహనాల సగటు వేగం 17 నుండి 18 కిలోమీటర్లు ఉండేది. ప్రస్తుతం అది 24 నుండి 25 కిలోమీటర్లకు పెరిగింది. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఎంతో కష్టపడితేనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి. ఈ సందర్భంగా అందరికీ నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు శాస్త్రీయ పద్ధతులను అవలంభిస్తున్నామని డ్రోన్ ద్వారా ట్రాఫిక్ కంట్రోల్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ ఎక్కువ ఉన్న చోట్ల డ్రోన్లు వాడుతామని చెప్పారు. ఇప్పటికే ట్రాఫిక్ మేనేజ్ మెంట్ కోసం హైరైజ్ కెమెరాలు తీసుకువచ్చామని చెప్పారు. ఎక్కువ ఎత్తు కలిగిన బిల్డిగ్స్ యజమానులను ఒప్పించి అక్కడ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రస్తుతం 25 ప్రాంతాల్లో ఇటువంటి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. దీని ట్రాఫిక్ కు సంబంధించి బర్డ్ ఐ వ్యూ విజువల్స్ లభిస్తున్నాయన్నారు. ఇది కొత్త ఆలోచన అని రాబోయే రోజుల్లో ఈ హైరైజ్ కెమెరాలను పెంచబోతున్నట్లు చెప్పారు. అందువల్ల హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ట్రాఫిక్ ఫోరం ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ట్రాఫిక్ మార్షల్ స్కీమ్ ను పూర్తి స్థాయిలో అమలు చేయబోతున్నామని చెప్పారు. నగంలోని ట్రాఫిక్ కు అంతరాయం కలిగించేలా ఉన్న భారీ వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రుల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు ఆయా భవనాల సముదాయాలు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వీళ్లంతా ఐదారుగురు ఉద్యోగులను నియమించుకుని తమకు అప్పగిస్తే వారికి ట్రైనింగ్ ఇచ్చి సంబంధిత భవనాల వద్ద వారే ట్రాఫిక్ నియంత్రణ చేసేలా ఏర్పాటు చేస్తామన్నారు.ఈ సమావేశంలో అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు,సిఐలు,ఎసిపిలు, అదనపు డిసిపిలు, డిసిపిలు బికె రాహుల్ హెగ్డే, అశోక్‌కుమార్, వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ జాయింట్ సిపి డి.జోయల్ డెవిస్ హాజరయ్యారు.

# రైతు భరోసా గడువు పొడిగించాలి



టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిబాబా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతులకు పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం చేపట్టిన పథకం రైతు భరోసా సరిగ్గా అమలు కావడం లేదని, కొత్తగా ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే రైతులు నేటితో గడువు ముగుస్తుండటంతో చాలా మంది రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని టిడిపి సికింద్రాబాద్ పార్లమెట్ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిబాబా అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా గడువు చాలా తక్కువగా ఇవ్వడం, చాలామంది రైతుల దరఖాస్తు చేసుకోలేక పోయారని తెలిపారు. ప్రభుత్వం ఏదో ఆదరాబాదరాగా రైతు భరోసాను అమలు చేయడం కాకుండా అర్హులైన లబ్ధిదారులకు అందేలా ధరఖాస్తు చేసుకునే గడువు పెంచాలని కోరారు. ఎకరానికి 5 వేల చొప్పున 5 ఎకరాలలోపు రైతులు రైతు భరోసా పథకానికి అర్హులని ప్రకటించడం జరిగిందన్నారు. మూడు రోజుల కింద ఈ పథకాన్ని ప్రకటించారన్నారు. దాని గడువు శుక్రవారంతో ముగిసిందన్నారు. రైతుల ధరఖాస్తులో సంబంధిత పత్రాలు లేవని సగానికి పైగా రైతులను అనర్హులుగా తిరస్కరించడం అత్యంత దురదుష్టకరమన్నారు. సరైన పత్రాలు సమకూర్చడం కొరకు రైతులు ధరఖాస్తు చేసుకునే సమయం లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వారి కష్టాలను గుర్తించి, ప్రభుత్వం వెంటనే రైతు భరోసా దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలని సాయిబాబా డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసే సమయంలో సర్వర్లు పని చేయక చాలామంది రైతులు ధరఖాస్తు చేసుకోలేదన్నారు. రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని మరో వారంరోజులు గడువు పెంచాలని సాయిబాబా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నల్లెల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

### క్రీడా పాఠశాలలో ఆరోగ్య భద్రతపై

# సర్కారుకు చిత్తశుద్ధి

భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవు

రాష్ట్ర క్రీడా సాధికారిక సంస్థ చైర్మన్ శివసేనా రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి**

ప్రభుత్వ క్రీడా పాఠశాలలో ఆరోగ్యం, భద్రత విషయంలో రాష్ట్ర సర్కారు చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలంగాణ క్రీడా సాధికారిక సంస్థ చైర్మన్ శివసేనా రెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా మానేరు తీరంలోని క్రీడా పాఠశాలను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని క్రీడా మైదానంతో పాటు స్విమ్మింగ్ పూల్, విద్యార్థుల వసతి గదులను, వంటగదిని క్షుణ్ణంగా పరిశీలించిన శివసేన రెడ్డి అక్కడ పరిశుభ్రత నాణ్యత లోపించడం పట్ల సంబంధిత కాంట్రాక్టర్‌తో నేరుగా టెలిఫోన్‌లో మాట్లాడి తీవ్రంగా హెచ్చరించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు ఆరోగ్యకర జీవితం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కాస్మెటిక్ మెస్ చార్జీలను పెంచడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మానేరు తీరంలోని స్పోర్ట్స్ స్కూల్ అభివృద్ధి కోసం ఇటీవల జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.20 లక్షల రూపాయలు మంజూరు చేయగా ఆ నిధులతో విద్యార్థులకు సౌకర్యవంతమైన పడకలు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా క్రీడా అధికారి తమకు తెలియజేశారన్నారు. క్రీడా పాఠశాలలో మెరుగైన సౌకర్యాల కోసం తన శాఖ ద్వారా మరో రూ.20 లక్షలు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నట్ల మంత్రి పొన్నం తమతో స్వయంగా తెలిపారని, అందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా క్రీడా పాఠశాలలో మౌలిక వసతుల కోసం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి రూ.10 లక్షలు సుడా నిధులు వెచ్చించడం జరిగిందని, ప్రత్యేకంగా కలెక్టర్ క్రీడా పాఠశాల అభివృద్ధిపై దృష్టి సారించినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. వారి చొరవతో ఇటీవలే స్విమ్మింగ్ పూల్ ఆధునీకరించడం జరిగిందని తెలిపారు. క్రీడా పాఠశాల, క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ప్రైవేట్ సంస్థలు, ప్రవాస భారతీయులు, వ్యాపారులు ముందుకు రావాలని కోరారు. క్రీడాకారులకు ప్రోత్సాహకాలు, స్పోర్ట్స్ కిట్స్ అందజేయడం కోసం, రాష్ట్రవ్యాప్తంగా క్రీడాస్ఫూర్తి ఉన్న ధనవంతులు, విద్యావంతులు క్రీడా మైదానాల ఏర్పాటు కోసం స్వచ్ఛందంగా మూడు ఎకరాల వరకు భూమి ఇవ్వగలిగితే వారు కోరుకున్న వారి పేరు మీద చిరస్థాయిగా క్రీడా మైదానం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. వారిని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ పక్షాన స్వాగతిస్తున్నామని, కేవలం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మాత్రమే ఈ నిర్ణయం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి రూ.10 లక్షలు సుడా నిధులు వెచ్చించడం జరిగిందని, ప్రత్యేకంగా కలెక్టర్ క్రీడా పాఠశాల అభివృద్ధిపై దృష్టి సారించినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. వారి చొరవతో ఇటీవలే స్విమ్మింగ్ పూల్ ఆధునీకరించడం జరిగిందని తెలిపారు. క్రీడా పాఠశాల, క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ప్రైవేట్ సంస్థలు, ప్రవాస భారతీయులు, వ్యాపారులు ముందుకు రావాలని కోరారు. క్రీడాకారులకు ప్రోత్సాహకాలు, స్పోర్ట్స్ కిట్స్ అందజేయడం కోసం, రాష్ట్రవ్యాప్తంగా క్రీడాస్ఫూర్తి ఉన్న ధనవంతులు, విద్యావంతులు క్రీడా మైదానాల ఏర్పాటు కోసం స్వచ్ఛందంగా మూడు ఎకరాల వరకు భూమి ఇవ్వగలిగితే వారు కోరుకున్న వారి పేరు మీద చిరస్థాయిగా క్రీడా మైదానం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. వారిని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ పక్షాన స్వాగతిస్తున్నామని, కేవలం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మాత్రమే ఈ నిర్ణయం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. త్వరలోనే సిఎం రేవంత్ రెడ్డి, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో చర్చించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలలో రెండు ఎకరాల స్థలంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్లకు ఆదేశించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తం గా 150 నుంచి 1080 గ్రామాలలో 300, 400 గజాల స్థలంలో క్రీడా మైదానాలను రెండు ఎకరాల వరకు విస్తరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. క్రీడాకారుల వసతి గృహాలలో వారికి శిక్షణ ఇచ్చే వారితో పాటు సంబంధిత ధ్రువీకరించబడిన సిబ్బంది మాత్రమే ఉండాలని, ప్రైవేట్ వ్యక్తులు ఎవరైనా ఉంటున్నట్లు దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా యువజన క్రీడా శాఖ అధికారితో పాటు పలువురు క్రీడాకారులు, శిక్షకులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌పి భూముల సర్వే



ప్రజాపక్షం/హాలియా: అనుముల మండలంలోని ఇబ్రహీంపేట గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఎన్ఎస్పి భూములను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలతో శుక్రవారం సర్వే చేపట్టారు. సుదీర్ఘకాలంగా ఈ భూములపై కొనసాగుతున్న సర్వే ఉత్కంఠకు శుక్రవారం తెరపడింది. ఇబ్రహీంపేట గ్రామంలో ఉన్న ఎన్ఎస్పి భూములపై గత కొంతకాలంగా సాగుతున్న చర్చకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సర్వే చేపించి ఉత్కంఠకు తెరదించింది. ఇబ్రహీంపేట గ్రామంలో గల 15, 16,68 ,72 సర్వే నెంబర్లలో ఉన్న 30.17 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేశారు. మొత్తం 12 మంది సర్వేయర్లు ఈ సర్వేలో పాల్గొన్నారు. ప్రభుత్వ భూములను సర్వే చేసే సమయంలో ఎటువంటి ఆటంకాలు ఎదురుకాకుండా ఉండేందుకు హాలియా సీఐ సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ సర్వేలో హాలియా ఇన్చార్జి తాసిల్దార్ రఘు, ఆర్ ఐ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలి



ప్రజాపక్షం/నాంపల్లి: నాంపల్లి మండలం లోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ శుక్రవారం దేవరకొండ డిపో మేనేజర్ కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ నాంపల్లి మండలంలోని దేవత పల్లి, దామెర, నేరెళ్లపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని, సమయానికే అనుగుణంగా విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యాసంస్థల ప్రారంభమై నెల రోజులు కావస్తున్న గ్రామాలలో విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు. విద్యాసంస్థల సమయానికి అనుగుణంగా బసౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని అధికారులను కోరమని అన్ని గ్రామాలకు బస్సు దాకా కల్పించిన డిపో మేనేజర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.వినతి పత్రం అందజేసిన వారిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, శ్రీధర్, నరేష్ ఉన్నారు.





## 23న రాజభవన్ ముట్టడి

ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు): మావోయిస్టులతో శాంతిచర్చలు జరపకుండా అపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనులను, మావోయిస్టులను హతమారుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, నరమేధానికి స్వస్తి పలకాలని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు డిమాండ్ చేశారు. శుక్రవారం అఖిలభారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈనెల 23న రాష్ట్ర రాజభవన్ ముట్టడి కార్యక్రమాన్ని సంబంధించిన గొడపత్రికను చిలుకూరు మండల కేంద్రంలోని దొడ్డా నర్సయ్య భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వైపు ప్రజలు, ప్రజా సంఘాలు హక్కులు సంఘాలు, మావోయిస్టులు కేంద్రంతో చర్చలు జరుపుతాం, శాంతియుతంగా సమస్యను పరిష్కరిద్దాం అని కేంద్ర ప్రభుత్వానికి అనేక సార్లు లేఖలు రాసారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి యువజనులు పెద్ద ఎత్తున హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ చిలుకూరు మండల అధ్యక్షులు అనంతుల రాము, బాలెబోయిన మహేష్, మాదవరపు చిన్న, వెంకటి, షేక్ నాగుల్, కాంపాటి రంజిత్, అశోక్‌కుమార్, వినోద పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు పథకాలు

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరస్వామి డిమాండ్



ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ : అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు అందజేసి అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ పథకము క్రింద ఇండ్లు మంజూరి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజి పేరిట వార్డులలో గుంటలు తవ్వి వదిలివేయడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే మరమ్మత్తులు చేపట్టాలన్నా రు. అదేవిధంగా డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయాలని కోరారు. పోస్టాఫీస్ వద్ద పెన్షన్ పంపిణీ చేసే సమయంలో పెన్షన్ దారులకు త్రాగునీరు, నీడ సౌకర్యం ఏర్పాటు చేయాలని, భాస్కర్ టాకీస్ నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు, సుభాష్ విగ్రహం నుండి గొల్లగూడ పెద్ద బండ వరకు డ్రైనేజీ అసంపూర్తిగా ఉన్న రోడ్లను వెంటనే పూర్తిచేయాలన్నారు. అదేవిధంగా పెన్షన్ కోసం అప్లై చేసుకున్న పెన్షన్ దారులను విచారణ చేసి అర్హులైన వారికి వెంటనే పెన్షన్ ఇవ్వాలని కోరారు. కమిషనర్ కు విందుపత్రం సమర్పించిన వారిలో సిపిఐ పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, సుజాత, మాధవి,విజయ, వీరయ్య, సురేందర్, తదితరులు ఉన్నారు.

## పాఠశాల అభివృద్ధికి శ్రీనివాస్ సేవలు అభినందనీయం



ప్రజాపక్షం/డిండి : డిండి మండలంలోని తవక్లాపూర్ గ్రామానికి చెందిన గుంత జంగయ్య కుమారుడు డాక్టర్ గుంత శ్రీనివాస్ తవక్లాపూర్‌లో ఉన్నటువంటి ప్రాథమిక ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు తన వంతు విరాళంగా రూ.20 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన సందర్భంగా శుక్రవారం తవక్లాపూర్ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలలో డాక్టర్ గుంత శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఏఎస్పి మౌనిక మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి శ్రీనివాస్ చేసిన దాతృత్వానికి ప్రశంసించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ తన సొంత ఊరిలో తాను చదువుకున్న పాఠశాలకు భారీ సంఖ్యలో విరాళం ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని ఊరి ప్రభుత్వ బడిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో తహాశీల్దార్ ఆంజనేయులు, మండల విద్యాధికారి గోప్యానాయక్, ప్రధానోపాధ్యాయులు రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వంటావార్పులో పిజి స్టూడెంట్స్

కళాశాలకు తాళం వేసి నిరసన చేపట్టిన విద్యార్థులు



ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రానికి సమీపంలోని ప్రభుత్వ పిజి కళాశాలలో హాస్టల్ నిర్వహణకు వంట మాస్టర్‌ను నియమించకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాల ప్రారంభమై ఐదు రోజులవుతున్నా వంట మాస్టర్ ఎంపికలో ఆలస్యం పట్ల విద్యార్థులు విసుగు చెంది కళాశాల గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. కళాశాల హాస్టల్‌లో వంటి మాస్టరు లేక విద్యార్థులు స్వయంగా వంటలు వండుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని గత సంవత్సరం 60 మంది స్టూడెంట్స్ ఉండగా, కనీసం వందమంది ఉంటే హాస్టల్ నిర్వహణకు ఇబ్బంది ఉండదని ప్రిన్సిపాల్ పేర్కొన్నారని, ప్రస్తుతం 106 మంది విద్యార్థులు ఉన్న పీజీ కళాశాల యాజమాన్యం హాస్టల్ నిర్వహణలో విఫలమవుతున్నారన్నారు. వీసీకి రిజిస్టర్‌కు లేఖలు పంపామని కాలయాపన చేస్తున్నారు. తప్ప సమస్యను పరిష్కరించకపోవడంతో ఇటు పరీక్షలకు సతమతమవుతూనే వంటలు చేసుకోవడం వల్ల సమయం వృధా అవుతుందని, సమస్యను తక్షణమే పరిష్కరించి న్యాయం చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

# సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం

'సదరం' శిబిరం సక్రమంగా నిర్వహించాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట: సాధారణ ప్రసవాలు చేసేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అదేశించారు. సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సదరం క్యాంపు నిర్వహించేటప్పుడు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మెరుగైన వసతులు కల్పించి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజు వచ్చే పెషెంట్ల వివరాలు, జ్వరంతో హాస్పిటల్‌కు వచ్చే వారికి వైద్య సేవలు అందించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉండాలన్నారు. హాస్పిటల్‌కు వచ్చే వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తదుపరి నిర్మాణంలో ఉన్న ఎంసిహెచ్ సెంటర్ భవనాన్ని సందర్శించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. డిఅడిక్షన్ సెంటర్ కోసం స్థలం సేకరించాలని సూచించారు. అత్యవసర వార్డు, టిబి యూనిట్ వార్డు, జెరియాట్రిక్ వార్డు, జ్వరం, కోవిడ్ ఐసోలేషన్ వార్డులు కలెక్టర్ పరిశీలించారు. వైద్య సేవలు, మందులు ఇస్తున్నారా లేదా పెషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు బ్లడ్ టెస్టుల వివరాలు రిజిస్టర్‌లో నమోదు పరిశీలించారు. సెంట్రల్ స్టోర్‌లో మందుల లభ్యత పై ఆరా తీశారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. హాస్పిటల్‌లో పారిశుద్యం పనులు ఎప్పటికప్పుడు చేస్తూ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. ఆయన వెంట సూపరిటీడెంట్ సత్యనారాయణ, అర్‌యంవో డాక్టర్ వినయ్, ఆనంద్, డాక్టర్ లక్ష్మ ణ్, అధికారులు, సిబ్బంద పాల్గొన్నారు.

### పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఇండ్లను గ్రౌండింగ్ పూర్తి చేయాలి

ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్: పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఇండ్లకి సంబంధించిన గ్రౌండింగ్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ చాంబర్ నందు హౌసింగ్ అధికారులతో వెబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకి సంబంధించిన పునాది నిర్మాణం, గొడల నిర్మాణం, స్లాబ్, ఇల్లు పూర్తిగా నిర్మాణం పూర్తి అవ్వగానే నాలుగు దశలలో ఎప్పటికప్పుడు ప్రతివారం హౌసింగ్ ఎఈలు ఫోటో కాప్చర్ చేసి రిపోర్టు పిడికి పంపిస్తే ప్రతి శనివారం రోజు రాష్ట్రస్థాయి అధికారులకి ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన చెల్లింపుల కోసం పంపటం జరుగుతున్నదని, ప్రతిసోమవారం లబ్ధిదారుల అకౌంట్‌లో అమోంట్ చెల్లింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో ఎమైనా టెక్నికల సమస్యలు, లబ్ధిదారుల పేర్లు, బ్యాంకు అకౌంట్ నెంబర్‌లో తప్పులు ఉంటే ప్రజలకి ఇబ్బంది కల్గించకుండా అధికారులు సరిచేయాలని సూచించారు. ఈ వెబెక్స్ సమావేశంలో హౌసింగ్ పిడి ధర్మారెడ్డి, హౌసింగ్ డిప్యూటి డిఈ జబ్బార్, హౌసింగ్ ఎఇలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

భవిత కేంద్రం పనులను నాలుగైదు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/చండూరు: డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం ఆమె చండూరు మండల కేంద్రంలోని భవిత కేంద్రం , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మకంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పిహెచ్‌సిలోని ఓపి , ఏఎన్‌సి రిజిస్టర్‌లను పరిశీలించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రసవం కోసం వచ్చిన కేసులు ఎన్ని అందులో ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసిన కేసులు ఎన్నిఉన్నాయని పరిశీలించారు. డాక్టర్లతో పిహెచ్‌సిలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిహెచ్‌సిలో ఎలాంటి మాతా ,శిశు మరణాలు సంభవించకుండా చూసుకోవాలని గర్భిణీస్త్రీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత లేకండా ఐరన్ మాత్రల పంపిణీ వంటివి చేట్టాలని వైద్యులకు సూచించారు. నిత్యం డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఇన్చార్జ్ ఆర్డిఒ రమణారెడ్డితో కలిసి ఏరియా ఆస్పత్రి కోసం సేకరించిన అంగడిపేట రోడ్డులోని పెట్రోల్ బంక్ పక్కన ఉన్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జడ్పిహెచ్ఎస్ పాఠశాలలోని భవిత కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి నాలుగైదు రోజుల్లో అప్పగించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రక్కనే నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో కాసేపు గడిపి ముచ్చటించారు. పిల్లలందరికీ డెయిరీమిల్క్ బిస్కెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ , ఆర్డిఒ రమణారెడ్డి, మండల ప్రత్యేకాధికారి ,పశు సంవర్ధక సహాయ సంచాలకులు నాగమలేశ్వరరావు , తహసీల్దార్ కిరణ్మయి , ఎంపిడిఓ బంగారు యాదగిరి , పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సంధ్యబెస్లీ పాల్గొన్నారు.



## రూ.17 కోట్లతో పోచంపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులు

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : పోచంపల్లి మున్సిపాలిటీ మండల వ్యాప్తంగా హెచ్‌ఎండిఏ నిధుల మంజూరైన రూ 17 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అంతర్గత సిసి రోడ్ల నిర్మాణాలకు, వివిధ వార్డులలో పలు అభివృద్ధి పనులకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేసి త్వరలో పనులు ప్రారంభించాలని అధికారులను కాంట్రాక్టర్లను ఆదేశించారు. పోచంపల్లి పట్టణంలోని ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో చేపట్టాల్సిన మండలంలోని గ్రామాల, వార్డుల వారిగా అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.7.90 కోట్లు, మండలంలోని వివిధ గ్రామాలలోని పలు అభివృద్ధి పనులకు రూ. 9.10 కోట్లు మొత్తం రూ.17 కోట్ల నిధులతో నిర్మాణాలకు ఎంపీపీ కార్యాలయంలో ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పది సంవత్సరాల కాలంలో ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిన దాఖలాలు లేవని ప్రజలను మోసపూరితమైన మాటలతో మభ్యపెట్టిందే తప్ప అభివృద్ధికి నోచుకోలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ మోహన్ రెడ్డి, మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తులు మరో మూడు రోజులు స్వీకరించాలి

వ్య.కా.సం నేత ధనుంజయనాయుడు



ప్రజాపక్షం/నేరేడుచర్ల: భూ భారతి సదస్సును గ్రామ గ్రామన నిర్వహించడం హర్షనీయమని, దురదృష్టవశాత్తు అట్టి సదస్సులో పాల్గొనలేకపోయిన రైతాంగానికి మరో మూడు రోజులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూలిపాల ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం తహసిల్దార్ కార్యాలయం ముందు జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జరిగిన భూభారతి సదస్సులు నిర్వహించినప్పటికీ ఆరోగ్య కారణాల వల్ల మరి ఇతర కారణాల వల్ల దరఖాస్తు చేసుకోలేకపోయిన వివిధ గ్రామాల్లోని రైతులకు మరో మూడు రోజులు గడువు పెంచి అందరి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. సమయానికి గ్రామాల్లో లేకపోవడం వల్ల మాత్రమే దరఖాస్తు చేసుకోలేకపోయామని పలువురు రైతులు ధర్నాలో వాపోయారు. కావాలని ఏ రైతు కూడా నిర్లక్ష్యం చేయదని, అధికారులు గుర్తించాలని, రైతాంగానికి మరోక అవకాశం కల్పించాలని కోరినవెంటనే తహసిల్దార్ సంబంధిత పై అధికారులతో మాట్లాడి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంద సైదమ్మ, బొలెద్దు శైలజ, మహ్మద్ ఖాసీం, కె.శంకర్, బొలిశెట్టి నాగయ్య, రమేష్, దుద్దూరి సైదమ్మ, రేఖ, లలిత, బుజ్జమ్మ, కట్కూరి జానకిరాములు, మాలోతు సైదా, మాలోతు కల్పిన పాల్గొన్నారు.

## రెండు సంవత్సరాలు పూర్తయిన సూపర్‌వైజర్లను బదిలీ చేయాలి



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: జిల్లాలో రెండు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లను బదిలీ చేయాలని, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంపటి గురుజీ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేట అర్బన్ పరిధిలో పేద, ఒంటరి మహిళలు, దళిత టీచర్ల పట్ల సూపర్‌వైజర్లు కఠిన వైఖరిని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. కొంతమంది సూపర్‌వైజర్లు నెలవారి చిట్టీలు వేస్తూ వారి వద్ద చిట్టీలు కట్టని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను చిన్న చిన్న కారణాలను చూపుతూ ఇబ్బందులకు గురి చేస్తు న్నారన్నారు. చిన్న కారణాలకు మెమోలు ఇస్తూ, వేతనాలలలో కోతలు విధిస్తున్నారని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం పట్టణ ప్రాంతాల్లో అద్దె భవనాలకు ఆరువేలు, గ్రామీణ ప్రాంతాల్లో రెండు వేలు ఇవ్వాల్సి ఉన్న వారి మాట వినవి వారికి వివిధ కారణాలతో అద్దె మొత్తాన్ని తగ్గిస్తున్నారని పేర్కొన్నారు. సూర్యాపేట అర్బన్ పరిధిలోని సూపర్‌వైజర్లు, సిడిపివోలను చూస్తేనే అంగన్‌వాడీలు, హెల్పర్లు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అతి తక్కువ వేతనాలతో చిన్నారులు, గర్భిణీ, బాలింతలకు సేవలందిస్తున్న అంగన్ వాడీలకు నెలకు 24వేలు ఇవ్వాలని, 5 సంవత్సరాలు పూర్తైన వారిని రెగ్యూలర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకురాళ్లు నాగలక్ష్మి, తంతెనపల్లి సుజాత, గుండగాని సుజాత, పద్మావతి, జ్యోతి, సావిత్రి, రజిత, భాస్కరమ్మ, లక్ష్మి , లలీత, రమణ, చంద్రకళ పాల్గొన్నారు.

# రుద్రమ చెరువు రిజర్వాయర్‌తో రైతుల సమస్యలకు పరిష్కారం

అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే మందుల సామేలు




ప్రజాపక్షం/తుంగతుర్తి: రుద్రమ చెరువు రిజర్వాయర్ నిర్మాణంలో ఈ ప్రాంత ప్రజల రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. తుంగతుర్తి మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామంలోని రుద్రమ్మ చెరువు రిజర్వాయర్ 1.5 టిఎంసి, డిబిఎం70 నుండి 1.5 కిలోమీటర్, ఎస్సారెస్పీ కాలువ పొడగింపు కోసం క్షేత్రస్థాయిలో సంబంధిత నీటిపారుదల శాఖ డిఈ, అధికారులతో ఎమ్మెల్యే సామేలు శుక్రవారం పర్యవేక్షించారు. అనంతరం ఈ మీడియా సమావేశంలో మాట్లాడుతూ రుద్రమ్మ చెరువులో 800 మీటర్లు తవ్వితే ఆప్‌టిఎంసి నీటి నిల్వ ఉండి లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. రుద్రమ్మ చెరువు రిజర్వాయర్ పూర్తయితే తాగు, సాగునీటితో పాటు రాష్ట్రంలో నెంబర్‌వన్ పర్యాటక ప్రాంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గుట్టలలో రాణి రుద్రమదేవి తిరిగిన ఆనవాళ్లు ఇప్పటికీ ఉన్నాయని, కాకతీయుల, రెడ్డిరాజులు నిర్మించిన రుద్రమచెరువును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎస్సారెస్పీ సెకండ్ ఫేజ్‌లో బయ్యన్నవాగు నుండి మూడు డిఎంబిలుగా విభజించడం జరిగిందని తెలిపారు. 70 డిబిఎం నుండి దాదాపు తొమ్మిది కిలోమీటర్ల దూరం చెరువులోకి నీరు రానుందన్నారు. పనులు పూర్తయితే దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. రుద్రమ చెరువు ప్రాంతాన్ని టూరిస్టు ప్రాంత కేంద్రంగా చేయాలని టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డిని కోరానని తెలిపారు. చెరువును రిజర్వాయర్ చేయడమే నా సంకల్ప, దానికోసం నిర్విరామంగా కృషి చేస్తానని అన్నారు. ఎస్టిమేషన్ రిపోర్టు తయారు చేసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అందజేయాలని డిఈ హరిబాబును ఫోన్‌లో అదేశించారు. ల్యాండ్ అక్యుపేషన్ కోసం రైతులతో నేను మాట్లాడి ఒప్పిస్తానని అన్నారు. 13 కోట్ల వ్యయంతో నైజాం కాలం నాటి కేతిరెడ్డికాలువ పనులు జరగనున్నాయని, బునాది గాని కాలువ కోసం 267 కోట్లతో నిర్మించనున్నారని అన్నారు.

**సిఎం చేతుల మీదుగా రేషన్‌కార్డుల పంపిణీ**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా తుంగతుర్తి నియోజకవర్గంలో మొట్టమొదటిసారిగా రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్నిచేపడుతున్నట్లు ఎమ్మెల్యే మందుల సామేలు తెలిపారు. భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాక సందర్భంగా బహిరంగ సభ ఏర్పాట్లను చూడాలని తెలిపినట్లు చెప్పారు. దాదాపు 40వేల నుండి 50వేల మంది భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు గుడిపాటి నర్సయ్య, ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, తుంగతుర్తి, తిరుమలగిరి, నాగారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, ఎల్సోజు నరేష్, తోడుసు లింగయ్య, జిల్లా నాయకులు సుంకరి జనార్ధన్, దాసరి శ్రీను, మల్లేష్, మాచర్ల అనిల్, నవీన్ పాల్గొన్నారు.

## రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి



ప్రజాపక్షం /నల్లగొండ టౌన్: రోడ్డు పనుల ద్వారా నల్లగొండ పట్టణంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం టి.ఎస్. మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్లోని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మెతిలాల్‌ను అదేవిధంగా డిఎస్‌పి శివరాం రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా టి.ఎస్. మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎ.ఎ.ఖాన్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మహమ్మద్ షఫీ నవాజ్ ఖాన్ లు మాట్లాడుతూ పట్టణంలోని మ న్యంచల్క నీలగిరి రోడ్ హైదర్‌ఖాన్ గూడ, శాంతి నగర్, బర్కత్‌పురా డిఇఓ కార్యాలయం నుండి బిటిఎస్ డైట్ ఐటిఐ వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న సందర్భంగా రోడ్డును మూసివేయడంతో పాదచారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మన్యంచల్క నుండి కలెక్టరేట్ ఇక్బాల్ మీనార్ వరకు త్రిభుజాకార మార్గాన్ని దాటడానికి ఒక ఓపెన్ మార్గం ఉంది, చాలా కాలం నుండి మన్యంచల్క, హైదర్ఖాన్ గూడ, శాంతి నగర్, బర్కత్పుర నివాసం ఈ మూలను ఉపయోగించి ప్రకాశం బజార్ మార్కెట్‌కు, ఏరియా ఆసుపత్రికి, లిటిల్ ఫ్లవర్, గవర్నమెంట్ అప్పర్ ప్రైమరీ, ఆల్ఫా, రేడియన్స్ స్కూల్స్, లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజ్, కృష్ణ వేణి స్కూల్ ఎం.వి.ఆర్ స్కూల్‌కు, వెళ్తున్న విద్యార్థులు . మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేసుకునే వారు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రోడ్డు పనులు పూర్తి చేసి రోడ్డుకు ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్.షాహిద్ అహ్మద్, అక్సా మసీదు కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్, కరస్పాండెంట్ రేడియన్స్ స్కూల్. లయీఖ్ అహమద్ ఖాన్. మునవర్ అలీ ఇలియాస్. సులేమాన్, షకీర్, షేక్ జిలాల్ ఉర్ రెహమాన్. తదితరులు ఉన్నారు

## శాంతి భద్రతల కోసం కృషి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్( తిప్పర్తి): శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని తిప్పర్తి నూతన ఎస్ఐ వి. శంకర్ అన్నారు. శుక్రవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా శంకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన సాయి ప్రశాంత్ హాలియా కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐగా శంకర్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ ను అరికట్టడంతో పాటు గవర్నమెంట్ పథకం ద్వారా అందించే పిడిఎస్ రైస్ పక్కదారి పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిప్పర్తి మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు ప్రజలు సహకరించి మండలాన్ని శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉంచేందుకు సహకరించాలని సూచించారు. మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు అక్రమ చర్యలకు పాల్పడే వారుంటే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు.

## క్రీడా స్ఫూర్తికి ప్రతీక ఒలంపిక్ రన్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** విద్యార్థుల్లో క్రీడా స్పూర్తిని నింపడానికి ఎన్నో సంవత్సరాలుగా ఈ ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 39వ ఒలింపిక్ డే రన్ 2025 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జిల్లా క్రీడా మైదానం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు జరిగిన ఒలింపిక్ రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా థాయిలాండ్‌లో సాఫ్ట్‌బాల్ క్రీడల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారుడు కిరణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్‌పి వెంకటేశ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మిథున్‌రెడ్డి, ఒలింపిక్ సంఘం కార్యదర్శి కురుమూర్తి, డివైఎస్‌ఓ శ్రీనివాస్, రాములు యాదవ్, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి శారదాబాయి పాల్గొన్నారు.



## పేరుకే సర్కార్ హాస్టల్ .. పైన పటారం.. లోన లొటారం

### పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దు

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలోని ఎస్సి బాయ్స్ హాస్టల్ పెచ్చులుడుతున్నా గోడలు, కనీసం బాత్రూంలకు డోర్లు లేకపోవడం, దానికి తోడు మరుగుదొడ్ల వాసనతో విద్యార్థులు అనారోగ్యాలకు గురి అవుతున్నారని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా పివైఎల్ ఉపాధ్యక్షులు సిద్దు అన్నారు. ఇవన్నీ అక్కడున్న ప్రిన్సిపాల్‌కి, ఎంఈఓకు, డీఈఓకు, జిల్లా కలెక్టరుకు ఇవన్నీ కంటికి కనబడవా? ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు పేద విద్యార్థులు చదివే ధన్వాడ హాస్టల్‌లను బాగు చేయాలని డిమాండ్ చేశారు.





## పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ లక్ష్యం: ఎమ్మెల్యే కసిరెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరుచేసి పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సంకల్పమని ఎంపిడిఓ వెంకట్‌రాములు అన్నారు. మార్చాల గ్రామంలో 29మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని అన్నారు. కార్యక్రమంలో మార్చాల పంచాయతీ కార్యదర్శి బండపల్లి రమేష్, కార్యదర్శులు ఎల్లమ్మ, ఆంజనేయులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ చేశారు.

## సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తత



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** వర్షాకాలం ప్రారంభమైనందున నగర గ్రామీణవీధులలో చెత్తాచెదారం ఇంటి పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత అవసరమని జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటదాసు అన్నారు. శుక్రవారం పాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు పలు సూచనలు సలహాలు సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలద్వారా డెంగ్యూ చికెన్ గున్యా, మలేరియా, మెదడువాపు మొదలైన వ్యాధులు దోమలద్వారా వ్యాప్తి చెందుతాయని అన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పాలెం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ఐడిసిఎఫ్ అనగా ఇంటెన్సిఫైడ్ డయేరియా కార్యక్రమం గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ నర్సింహులు, ఎంపిహెచ్‌ఓ బాదం రాజేశ్వర్, హెల్త్ సూపర్‌వైజర్ సుజాత, హెల్త్ అసిస్టెంట్ గోవర్దన్, ఏఎన్‌ఎం గజవర్ధనమ్మ, విజయ, ఆశవర్కర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూర్ణచంద్రకళ కృష్ణయ్య పాల్గొన్నారు.

## ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు

### వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్




**ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి :** రైతులు ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు చక చక జమ అవుతున్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 16వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి హైదరాబాద్ నుండి రైతు నేస్తం కార్యక్రమం సందర్భంగా కంప్యూటర్ మీట నొక్కి రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా విడుదల చేశారు. జూన్ 16 నుండి రోజుకు కొంత మంది రైతులకు ఎకరాల చొప్పున రైతు భరోసా జమ చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం వనపర్తి జిల్లాలో 5 ఎకరాల వరకు ఉన్న 11476 మంది రైతుల ఖాతాల్లో రూ.30,05,62,758 లు జమ చేసినట్లు తెలియజేశారు.

## పరిశుభ్రతోనే రోగాల నివారణ



**ప్రజాపక్షం/పాన్‌గల్ :** పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలను నివారించవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా. చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల పరిధఇలోని వెంగలాయిపల్లి గ్రామంలో జ్వరపీడిత సర్వే ప్రై డే డ్రైడే, సమగ్ర ఆరోగ్య వైద్య శిబిరం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గునియా, వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారానికి ఒకసారి ఇంటిలోని మంచినీటి వనరులను నీటితోట్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకొని పాత నీటిని పారబోసి కొత్త నీటిని పట్టుకోవలెని అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పి డా. నాగరాజు, సూపర్వైజర్ సుమన శ్రీ, లేప్తా అసిస్టెంట్స్ రామచందర్, సతీష్ , రమాదేవి, శైలజ, సమగ్ర ఆరోగ్య శిబిరం సిబ్బంది, బంగారయ్య, లక్ష్మణ్ , పద్మ, వినోద్, లక్ష్మి నారాయణ, ఖాజా ప్రవీణ్ కుమార్, ఆశా కార్యకర్తలు విజయమ్మ, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సన్మానం




**ప్రజాపక్షం/జడ్చర్ల :** వాసవి క్లబ్ వారు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రతిభావంతులైన విద్యార్థులకు శుక్రవారం ప్రతిభావంతులైన విద్యార్థులకు శుక్రవారం సన్మానం నిర్వహించి మొమెంటో అందజేశారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులు ఐపీఈ పరీక్షల్లో ఉత్తమమైన ఫలితాలు కనబరిచి జిల్లాలోని అత్యధికంగా 80% ఉత్తీర్ణత చెందిన కళాశాలను అభినందించారు. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలకు దీటుగా 1000కి 950 నుండి 986 మార్కులు సాధించిన 14 మంది విద్యార్థులకు వాసవి క్లబ్ అధ్యక్షులు చిత్తనూరి రామకృష్ణ, వారి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి వారికి మొమెంటు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ రాధ, మేడిశెట్టి రామకృష్ణ గుడిపల్లి ప్రవీణ్ కుమార్, కండె కృష్ణ, కోశాధికారి హెచ్‌ఎం నవీన్, దిలీప్ మంచన గణేష్, మహేష్ బాదం రఘు, విద్యాసాగర్, జయప్రకాశ్, కోదండ రామయ్య, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా భూభారతిచట్టం అమలు

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లాలో నిర్వహిస్తున్న భూభారతిరెవెన్యూ సదస్సులు వందశాతం పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం బిజినేపల్లి మండలంలోని వెల్గొండలో రెవెన్యూ సదస్సును పరిశీలించి మాట్లాడుతూ భూభారతిచట్టం 2025 రైతులకి చుట్టగా, భూసమస్యలకి శాశ్వత పరిష్కారం లభించేలా నిపుణులు, అధికారులు, ప్రజలసూచనలతో రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈనెల 3నుంచి నేటివరకు చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా తహసీల్దార్ నేతృత్వంలో బృందాలు గ్రామాల్లో సదస్సులు నిర్వహించి రైతులనుంచి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. ఆగస్టు 15నాటికి భూసమస్యలు పరిష్కరించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులు ఇబ్బందులుపడకుండా పారదర్శకంగా చట్టం అమలుచేయాలని సూచించారు. కలెక్టర్‌వెంట బిజినేపల్లి తహసీల్దార్ మున్నూరోద్దీన్ ఇతర అధికారులు ఉన్నారు.

**రేషన్ పంపిణీ వందశాతం సజావుగా జరగాలి**

రేషన్ సన్నబియ్యం పంపిణీ సజావుగా వందశాతం నిర్వహించాలని, ఎక్కడా అక్రమాలకు తావులేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆదేశించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గం పరిధిలోని బిజినేపల్లి మండలం వెల్గొండ గ్రామంలో 16వనెంబర్ రేషన్ షాపును సందర్శించారు. గ్రామంలో 2రేషన్‌దుకాణాలు ఉన్నాయని, 16వ నెంబర్ రేషన్ దుకాణంలో 504కార్డులు, 38వ రేషన్‌దుకాణంలో 499 రేషన్‌కార్డులున్నాయని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరేషన్ డీలర్ ప్రభుత్వం విధించిన నిబంధనలుపాటిస్తూ పంపిణీ సజావుగా జరగాలని తెలిపారు. తెల్లరేషన్‌కార్డు లబ్దిదారులకు వందశాతం సన్నబియ్యం అందించాల్సిన అవసరం ఉందన్నారు.

**అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు**

నాగర్‌కర్నూల్ నియోజకవర్గపరిధిలోని బిజినేపల్లి మండలంలో ఉన్న అల్లీపూర్ గ్రామంలో మంజూరుచేసిన 70 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వివిధదశల్లో కొనసాగుతున్నట్లుఅధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరుచేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకంద్వారా తగినసాయాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్లకి నాణ్యతతో కూడిన ఇసుక సరఫరా చేయాలని సూచించారు.

**అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంక్షేమంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి :**

బిజినేపల్లి మండలం వెల్గొండ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్యానికి సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని, అంగన్‌వాడి కేంద్రాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని సూచించారు. కలెక్టర్ అంగన్‌వాడీలలో పిల్లల పెరుగుదల, అభివృద్ధికి సంబంధించిన వివరాలను కూడా తెలుసుకున్నారు. పిల్లలకు అందించే పోషకాహారం గురించి కలెక్టర్ ఆరా తీశారు. అంగన్‌వాడీలో పిల్లల నమోదు, ఆహరసరఫరా, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలువంటి వాటిని పరిశీలించారు. పిల్లలకు మెనూప్రకారం వారంలో రెండు రోజులు ఎగ్‌బిర్యాని అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన బాలింతలు, గర్భిణిలకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న ఆహారపదార్థాలు సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.

**ఎల్లవేళలా వైద్యులు అందుబాటులో ఉండాలి**

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. శుక్రవారం బిజినేపల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి ఆస్పత్రిలో ఓపిరిజిస్టర్, మందులస్టాక్‌ను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. సమయానుకూలంగా వైద్యులు, సిబ్బంది విధులకు హాజరుకావాలని , ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని వైద్యంకోసం వచ్చిన రోగులనువెంటనే ఆస్పత్రిలో చేర్చుకొని వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రిలో శుభ్రత, ఔషదాల అందుబాటు, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోగులపై సానుభూతితో వ్యవహరించాలని వారి సమస్యలు పటిష్టంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.



**రైతుల ముఖాల్లో సంతోషం**

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుభరోసా పథకం కింద ఇప్పటివరకు జిల్లాలోని 2,71,545 మంది రైతుల ఖాతాలలో రూ.308.792కోట్ల నిధులు జమ అయ్యాయని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్ కంటే ముందే నిధులను జమచేయడం రాష్ట్రప్రభుత్వ లక్ష్యమన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

**ప్రజాపక్షం/నారాయణపేట్ ప్రతినిధి :** భూ సమస్యల కొరకే భూ భారతి ప్రవేశపెట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. భూ భారతి రెవెన్యూ సర్వే చివరి రోజు శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ కృష్ణ, మాగనూర్, తాసిల్దార్ కార్యాలయలలో, మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. జిల్లాలో ప్రతి గ్రామపంచాయతీలలో రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరిగిందని వాటిలో వచ్చిన అప్లికేషన్లను స్వీకరించి కేటగిరీల వారీగా నోటీసులు అందజేసి ఆర్‌డిఓ ఎమ్మార్వో స్థాయిలను ఉంటే పరిష్కరించస్తామని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 3500 అప్లికేషన్స్ వచ్చాయని తెలిపారు. గత నెల కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు గ్రామంలో నిర్వహించడం జరిగిందని వచ్చిన అప్లికేషన్లను పరిష్కరించడం జరిగిదని తెలిపారు. మాగనూర్ తహసీల్దార్ కార్యాలయం లో వచ్చిన అప్లికేషన్స్ లను పరిశీలించారు. మాగనూరులో ఇప్పటివరకు ఎన్ని అప్లికేషన్స్ వచ్చాయని వాటిలో ఎన్ని పరిష్కరించారని తహసీల్దార్ ద్వారా తెలుసుకున్నారు. మండలంలో 264 అప్లికేషన్స్ వచ్చాయని వాటిలో 234 వరకు ఆర్డీవో, తహసీల్దార్ స్థాయిలో ఉన్నవాటిని పరిష్కరించడం జరిగిందని కలెక్టర్ కు తెలిపారు. పరిష్కరించబడ్డ వాటిని ఎప్పటికి అప్పుడు ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కృష్ణ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతిలో ఎన్ని ఫిర్యాదులు అందాయి వాటిలో ఎన్ని పరిష్కరింపబడ్డాయి వాటి వివరాలను తెలుసుకున్నారు. కృష్ణ మండలంలోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఇప్పటి వరకు ఎంతమంది విద్యార్థులు వచ్చారు అని యస్ఓ ద్వారా తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని పేర్కొన్నారు. ఫుడ్ కమిటీ తప్పనిసరిగా ఉండాలని ఉపాధ్యాయులలో ఒక్కరు భోజనం సమయంలో భోజనానికంటే ముందు భోజనం చేయాలని తప్పనిసరిగా రిజిస్టర్ మెంటైన్ చేయాలన్నారు. నటి వృదా కాకుండా కుళాయిలను మరమ్మత్తు చేయాలన్నారు. విద్యార్థులకు వసతి గృహ లలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టి కి తీసుకొని రావాలని సూచించారు.



## యూనియన్ డే సెలబ్రేషన్



**ప్రజాపక్షం/మక్తల్ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో యూనియన్ డే ఆఫ్ సెలబ్రేషన్‌లో భాగంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎస్‌సి వాడ మారుతీనగర్ మక్తల్ యందు యూనియన్ వ్యవస్థాపకులు వై.తారక్‌నాథ్ వర్ధంతిని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు తాగునీటి వసతి కోసం 200 లీటర్స్ స్టేన్‌లెస్ స్టీల్ వాటర్ ట్యాక్, 110 మంది విద్యార్థులకు పెన్నులు, చాక్లెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ నాయకులు వై.భ్రమరాంబ, బి.నర్సిములు, దిలీప్, శ్రీనివాస్, సుమన్ శెట్టి, వాకిటి రవికుమార్, నవీన్‌కుమార్, శ్రీబిందు, వి.మధు సూదన్, కిష్టప్ప, జగదీశ్ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గంజ్ రోడ్, ఎడిబి, కాన్కుర్తి, మరికల్, జక్లేర్), పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.కన్యాకుమారి, ఉపాధ్యాయులు, పి.బాలరాజు, వివేకానంద, వార్డ్ పెద్దలు తిరుపతి నర్సిములు, మామిళ్ళ కిష్టప్ప, నాగరాజు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఒలంపిక్ డే రన్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** తెలంగాణ రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.మల్లారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఈ నెల 22న ఆదివారం ఉద యం 7 గంటలకు మక్తల్ నల్ల జానమ్మ గుడి నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు (జూన్ 23 ఒలంపిక్ డే)ను పురస్కరించుకొని 39వ ఒలంపిక్ డే రన్‌ను నిర్వహిస్తున్నామని ఒలంపిక్ డే రన్ జిల్లా నిర్వహణ కమిటీ చైర్మన్ బి.గోపాలం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ ఒలంపిక్ డే రన్‌ను మన రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, క్రీడా శాఖ మంత్రి డాక్టర్.వాకిటి శ్రీహరి, క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభిస్తారని బి.గోపాలం తెలిపారు. జిల్లాలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ, ప్రైవేటు పీడీలు, పిఈటిలు, పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు క్రీడాభిమానులు, యువతి యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఒలంపిక్ డే రన్‌ను విజయవంతము చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నిర్వహణ కమిటీ కన్వీనర్ అమ్రేష్, వైస్ కన్వీనర్ విష్ణువర్ధన్, పిఈటిలు ఎన్. రఘు, రమేష్ పాల్గొన్నారు.

## సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహబూబ్‌నగర్ పట్టణంలోని కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న ఎస్సీ, బీసీ సంక్షేమ బాలికల వసతి గృహాలను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌కు వచ్చే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన హాస్టల్ అధికారులను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్పోరేషన్ ఆవరణలోని మున్సిపల్ కార్పోరేషన్ ఆవరణలోని మెప్మా కార్యాలయంలో ఆర్పీలకు ఉచితంగా అందిస్తున్న కంప్యూటర్ శిక్షణ సెంటర్‌ను ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని అన్ని తరగతి గదులను తిరిగి పరిశీలించారు. జూనియర్ కళాశాల భవనం కోసం ఆర్‌అండ్‌బి అధికారులతో సంప్రదించి వెంటనే ఎస్టిమేట్స్‌ను తయారుచేయించాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజిని ఎమ్మెల్యే సందర్శించారు. ఒకేషనల్ కోర్సుల్లో చేరిన విద్యార్థులతో ఆయన మాట్లాడారు. సమయం చాలా విలువైందని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. టెక్నికల్ ట్రేడ్‌లు చేసిన వారికి ఉపాధి అవకాశాలు ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్ వినోద్‌కుమార్, ఐఎన్టీయుసి రాములు యాదవ్, ప్రభుత్వం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవంతాచారి, ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ భగవాణి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## అడపిల్లలకు అండగా షీటీమ్




**ప్రజాపక్షం/మద్దూర్ :** జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు మద్దూరు మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నారాయణపేట షీటీం పోలీసులు పోక్సో చట్టం, షీటీమ్స్, యంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, డ్రగ్స్ ప్రభావం, గుడ్ టచ్ బాడ్ టచ్ ఆడపిల్లలపై వేధింపులు మొదలగు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం పోలీసులు బాలరాజు మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో ఆడపిల్లలను, మహిళలను ఎవరైనా వేధిస్తే నారాయణపేట షీటీం సెల్ నెంబర్ 8712670398కి సమాచారం ఇవ్వాలని లేదా వాట్సప్ రూపంలో మెసేజ్ కూడా చేయవచ్చని ఇచ్చిన వారి విరాలు గోప్యంగా ఉంచి అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చి పోయే సమయంలో ఎవరైనా వేధించిన, మానసికంగా, శారీరకంగా హింసించిన, భాధపెట్టిన అట్టి వ్యక్తుల సమాచారం తల్లిదండ్రులకు గాని, ఉపాధ్యాయులకు గానీ, షీటీమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు నరసింహ రెడ్డి, షీటీమ్ పోలీసులు చెన్నయ్య, జ్యోత, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** భూ సమస్యలపై భూ భారతి రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులు నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు సూచించారు. శుక్రవారం అడ్డాకుల మండలం గుడిబండ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరై అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా వివరాలుఅడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కార వేదికలుగా రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల వివరాల నమోదులో ఎలాంటి తప్పిదారులకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు అందించాలని, సంబంధిత రిజిస్టర్లలో తప్పని సరిగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. దరకాస్తుల స్వీకరణ నమోదు రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ, పక్కాగా రికార్డులను పొందుపర్చాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నిలబడతాం.. నెగ్గుతాం

### మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ధీమా

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీఆర్ఎస్ సత్తా చాటుదామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. జిల్లాలోని ఖిల్లా ఘనపూర్ మండలంలోని బీఆర్ఎస్ ప్రధాన నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య ఇంటివద్ద నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై పార్టీ శ్రేణులకు మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు జరిగినా సిద్దంగా ఉండాలని, ప్రతి నాయకుడు తన గ్రామంలో ప్రజల మధ్యకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వారికి వివరించాలని ఆయన అన్నారు. నాయకునిపై విశ్వాసం, పార్టీ పట్ల నిబద్ధత ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ జడ్పీటీసీ సామ్యానాయక్ , మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ బాలేశ్వర్ రెడ్డి, ఎస్‌టి సెల్ జిల్లా నాయకులు జాత్రునాయక్ , ఇతర మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామాల అధ్యక్షులు, మండలంలోని ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఓల్డేజ్ హోమ్ సందర్శించిన సివిల్ జడ్జి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట పట్టణంలోని బోరంబావి దగ్గర ఉన్న ఓల్డ్ ఏజ్ హోమ్‌ని సీనియర్ సివిల్ జడ్జి వీంధ్య నాయక్ అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అందరు హోమ్‌లో ఉన్నారా ఆజరు పట్టికను పరిశీలించారు. రోజు ఆహార దినపట్టికను అడిగి పరిశీలించారు. రోజు ఆహార దినపట్టికను అడిగి వసతులను, హోమ్‌లో పని చేస్తున్న స్టాఫ్ మెంబర్స్ డైలీ వస్తున్నారా హాజరుపట్టికను, వాళ్ళ డ్యూటీస్ కరెక్ట్ చేస్తున్నారా డ్యూటీస్‌లో ఉన్న స్టాఫ్ మెంబెర్స్ డ్యూటీలో ఉన్నారా తనిఖీ చేశారు. సిబ్బందిని ఆదేశించారు. అటెండెన్స్ రిజిస్టర్లు చూసారు. దిన వస్తువులను ఆహార ధాన్యాల నాణ్యత, తాగునీరు పరిశుభ్రత, రిజిస్టరులను, సీసీటీవీ ఫుటేజిలను, మూమెంట్ రిజిస్టర్, ఆఫీస్ ఆర్డర్స్ ప్రకారం అడ్మిషన్ తీసుకుంటున్నారా ఆఫీసర్ ఆర్డర్ ప్రకారం సంబంధించిన వాళ్ళకు అప్పచెపుతున్నారా లేదా తగిన రిజిస్టర్లు చూశారు. వచ్చిన సరుకుల, రైస్ క్వాంటిటీ రిజిస్టర్‌లో రాస్తున్నారా, డైలీ డైరీ, రిజిస్టర్స్ సంబంధిత అధికారి చేత పర్మిషన్ తీసుకొని రిజిస్టర్స్ రాయాలి అన్నారు. స్టాక్ ప్రతిరోజు ఎంట్రీ చెయ్యాలి స్టాక్ రిజిస్టర్ ప్రకారం ఎంట్రీ ఉన్నాయా చూసారు. వృద్ధులకి ఆహార దినపట్టికను అడిగి తెలుసుకున్నారు. గవర్నమెంట్ వాళ్ళు ఇచ్చిన మెనూ ప్రకారం పెడుతున్నారు. లేదా ప్రతిరోజు కూరగాయలు ఫ్రెష్‌గా కొనుగోలు చేయమని సిబ్బందికి ఆదేశించారు. ఎప్పటికప్పుడు టాబ్లెట్స్ సిరప్‌లు ఎక్సపైరీ డేట్ చూసారు. బెడ్‌షీట్స్, రూమ్స్, బాత్రూమ్, వాష్‌రూమ్స్ ఎప్పటికప్పుడు క్లీన్‌గా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. లైట్స్, ఫ్యాన్స్ వర్కింగ్‌లో ఉన్నాయా చూసారు. తుదుపరి సిబ్బందితో మాట్లాడుతూ వృద్ధులకు అన్ని విధాల 24 గంటల అందుబాటులో ఉండి వాళ్లకి ఎలాంటి ఇబ్బంది కలగకుండా సొంత ఇంటి వాళ్ళ మాదిరి చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.



# క్రీడ

## ఏజ్ ఫ్రాడ్‌కు చెక్..

### ఇకపై అండర్-16 క్రికెటర్లకు 'సెకండ్ బోన్' టెస్టు



క్రికెట్ అనే కాదు పలు ఆటల్లో కొందరు ఆటగాళ్ల వయసుపై వివాదాలు తలెత్తడం చూశాం. ఐపిఎల్ 18వ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ కూడా ఏజ్ ఫ్రాడ్ ఆరోపణలు ఎదుర్కొన్నాడు. అంతేకాదు అండర్ 16 ఆటగాళ్లను తదుపరి సీజన్‌లో వయసు పైబడిందనే కారణంతో అనుమతించడం లేదు. దాంతో, ఈ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై జూనియర్ స్థాయిలో ఏ క్రికెటర్ కూడా వయసును కప్పిపుచ్చకుండా వైద్యపరీక్షలను కఠినతరం చేసింది. ఇప్పటివరకూ 1416 ఏళ్ల అబ్బాయిలకే బోన్ టెస్ట్ జరిపేవారు. ఈ పరీక్షలో నిర్ధారణ అయిన వయసుకు ఒక ఏడాదిని కలిపేవారు. అంటే.. ఉదహరణకు ఒక ఆటగాడి వయసు 14.3 సంవత్సరాలు అనుకోండి.. బిసిసిఐ ప్రకారం అతడికి 15.3 సంవత్సరాలు ఉన్నట్టుగా పరిగణిస్తారు. దీన్నే మ్యాథమేటికల్ ఏజ్ అని పిలుస్తారు.

**ఎంపిక సమయంలో**

జూనియర్ స్థాయిలో ఆటగాళ్ల ఎంపిక సమయంలో బోన్ టెస్టు చేస్తారు. ఈ పరీక్షలో వారి వయసును పక్కాగా లెక్కించడం సాధ్యమవుతుంది. అయితే..ఈ ఏడాది అండర్ 16 టీమ్‌లో ఆడిన వాళ్ల తదుపరి సీజన్ సమయానికి వయసు 17క చేరడంతో అనర్హతకు గురవుతున్నారు. అందుకు.. ఇకపై వీళ్లకు సెకండ్ బోన్ టెస్టు జరపాలని బిసిసిఐ నిర్ణయించింది. ఈ టెస్టును 16 ఏళ్లున్న అబ్బాయిలకు, 15 ఏళ్లున్న అమ్మాయిలకు నిర్వహిస్తామని తెలిపింది.



## హాకీ క్రీడాకారులకు బొనాంజా..

భారత హాకీ క్రీడాకారులకు గుడ్‌న్యూస్. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వాళ్ల కోరిక ఫలించనుంది. అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతున్న ఆటగాళ్లకు ప్రోత్సాహకంగా కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ బంపర్ బొనాంజా ఇవ్వనుంది. జాతీయ క్యాంప్‌నకు ఎంపికైన పురుష, మహిళా ప్లేయర్లకు ప్రతి నెల అదనంగా రూ.25వేలు చెల్లించనుంది. గురువారం జరిగిన మిషన్ ఒలింపిక్ సెల్స్ నెలవారీ సమావేశంలో హాకీ ఇండియా అభ్యర్థనను అంగీకరించిన మంత్రిత్వ శాఖ.. టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం కింద ఈ అలవెన్స్ అందజేస్తామని మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. ఈ స్కీమ్ ద్వారా మొత్తంగా 80 మంది (40 మంది పురుషులు, 40 మంది మహిళా క్రీడాకారులు) లబ్ధి పొందనున్నారని హాకీ ఇండియా వెల్లడించింది. హాకీ ప్లేయర్లకు అదనపు భత్యం ఇవ్వాలని హాకీ ఇండియా పలుమార్లు విజ్ఞప్తి చేసింది. ఈ విషయంపై గురువారం జరిగిన మిషన్ ఒలింపిక్ సెల్ సమావేశంలో చర్చ జరిగింది. ఆటగాళ్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నెల నెలా రూ.25 వేలు ఇవ్వాలని నిర్ణయించాం. ఫామ్, ఫిట్‌నెస్.. ఈ రెండు అంశాల ఆధారంగా ఆటగాళ్లను ఎంపిక చేస్తాం అని మంత్రి మాండవీయ వెల్లడించారు. అంతేకాదు ఈ సమావేశంలో కోర్ గ్రూప్ అథ్లెట్లకు ప్రతి నెల రూ.50 వేలు ఇవ్వాలని తీర్మానించామని ఆయన తెలిపారు. హాకీ ఆటగాళ్లకు నెలనెలా రూ.25 వేలు ఇవ్వడం కోసం ప్రభుత్వం రూ.20 లక్షలు ఖర్చు చేయనుంది.

**పారిస్ ఒలింపిక్స్‌లో భారత ఆటగాళ్ల సంబురాలు**

క్రికెటర్ల మాదిరిగానే తమకూ సెంట్రల్ కాంట్రాక్ట్ ఇవ్వాలని హాకీ ఆటగాళ్లు ఎప్పటినుంచో కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రిత్వ శాఖ నెల నెలా రూ.25 వేలు ఇవ్వాలని నిర్ణయించడం క్రీడాకారులకు ఎంతగానో ఉపయుక్తం కానుంది. గత కొన్నేళ్లుగా భారత పురుషుల, మహిళల జట్లు అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతున్నాయి. టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యంతో మెరిసిన హర్మన్ ప్రీత్ సింగ్ బృందం.. పారిస్ విశ్వక్రీడల్లోనూ సంచలన ప్రదర్శనతో కంచు మోత మోగించి చరిత్ర సృష్టించింది. అయితే.. ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్‌లో మాత్రం వరుస వైఫల్యాలతో తీవ్రంగా నిరాశపరుస్తోంది.

## శతక్కొట్టిన గిల్, యశస్వీ..



### తొలి టెస్టులో టీమిండియా భారీ స్కోర్

ఇంగ్లాండ్ పర్యటనలో సీనియర్లు లేకున్నా సరే తొలి టెస్టులో భారత జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది. లీడ్స్‌లోని హెడింగ్లే మైదానంలో ప్రత్యర్థి బౌలర్లకు పీడకలను మిగిలిస్తూ కెప్టెన్ శుభ్‌మన్ గిల్(127 నాటౌట్), యశస్వీ జైస్వాల్(101) సెంచరీలతో కదం తొక్కారు. వైస్ కెప్టెన్ రిషభ్ పంత్(65 నాటౌట్) సైతం మెరుపు హాఫ్ సెంచరీతో బాదగా.. తొలి రోజే మూడొందలు కొట్టేసింది టీమిండియా. కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన గిల్ భారీ స్కోర్‌కు బాటలు వేశాడు. దాంతో, తొలి రోజు ఆట ముగిసే సరికి భారత్ 3 వికెట్ల నష్టానికి 359 రన్స్ చేసింది. దంచికొట్టిన ఈ ఇద్దరూ క్రీజులో ఉండడంతో హెడింగ్లే టెస్టులో గిల్ సేన పట్టుబిగించడం ఖాయం అనిపిస్తోంది. హెడింగ్లే టెస్టులో భారత జట్టు పట్టుబిగించే దిశగా సాగుతోంది. టాస్ ఓడిన టీమిండియాకు ఓపెనర్లు ఓపెనర్ యశస్వీ జైస్వాల్(101), కేఎల్ రాహుల్ (42) శుభారంభమిచ్చారు. తొలి వికెట్‌కు 91 రన్స్ జోడించి ఇంగ్లాండ్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. తొలి సెషన్‌లో చెలరేగి ఆడిన ద్వయాన్ని బ్రాండన్ కర్సే విడదీశాడు. ఆ తర్వాత వచ్చిన సాయి సుదర్శన్(0) స్టోక్స్ వెనక్కి పంపాడు. సాయి వెనుదిరిగాక యశస్వీ జతగా గిల్ జట్టును పటిష్ట స్థితిలో నిలిపాడు. బౌండరీలతో ఇంగ్లండ బౌలర్లను పరుగులు పెట్టించిన ఈ జోడీ మూడో వికెట్‌కు 130 పరుగుల భాగస్వామ్యం నిర్మించింది. ఐదో సెంచరీ బాదిన యశస్వీని టీ సెషన్ తర్వాత స్టోక్స్ బౌల్డ్ చేశాడు. అయినా సరే గిల్ పట్టుదలగా ఆడాడు. రిషభ్ పంత్(48 నాటౌట్), గిల్ నాలుగో వికెట్‌కు 138 రన్స్ చేసి.. స్టోక్స్ సేనను డీలా పడేలా చేశారు.

# ఫోకస్ సైన్స్

## ఆసక్తిగొలిపే సూర్యాయనం



భూమికి సంబంధించి నంత వరకూ జూన్ 21వ తేదీ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఏడాదిలో అత్యంత సుదీర్ఘమైన పగలు నమోదయ్యే రోజు ఇది. సాధారణంగా జూన్ 20 లేదా 21 తేదీల్లో 'సమ్మర్ సోల్‌స్టైస్' (సూర్యాయనం) చోటు చేసుకుంది. ఇది అత్యంత ఆసక్తికరమైన పరిణామం. ఈ ఏడాది సమ్మర్ సోల్‌స్టైస్ జూన్ 21వ తేదీ శనివారం ఉదయం 8.11 నిమిషాలకు జరుగుతుంది. పగలు 15 గంటలా, 9 నిమిషాలు కొనసాఅప్ అవకాశం ఉంది. మిగతా నెలలతో పోలిస్తే పాలపుంత (మిల్కీ వే) జూన్‌లో చాలా స్పష్టంగా కనిపించడానికి కారణం కూడా దే. మిల్కీ వే గెలాక్సీ మన రాత్రి ఆకాశంలో కనిపించే తెల్లటి మబ్బులా ఉండే వెలుగు పట్టీ. ఇది మిల్కీ వేలోని కోట్లాది నక్షత్రాలు, గ్యాస్, డస్ట్ కలిసి ఏర్పడినదే. మిల్కీ వే గెలాక్సీ స్పైరల్ ఆకారంలో ఉంటుంది. మన సౌరమండలం ఈ గెలాక్సీలోని ఒరియన్ ఆర్మ్‌లో ఉంది. రాత్రి సమయాల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, మిల్కీ వేను ఆకాశంలో స్పష్టంగా చూడవచ్చు. ఇది సగం ఆకాశాన్ని విస్తరించి, తెల్లటి పట్టీలా కనపడుతుంది. ఇక సూర్యాయనం రోజు సూర్యుడు ఉత్తర దిక్కుకు అత్యంత దగ్గరగా, మధ్యాహ్నం అత్యధిక ఎత్తులో ఉంటాడు. ఫలితంగా, ఉత్తరార్ధ గోళంలో సంవత్సరంలో అత్యంత పొడవైన రోజు, రాత్రి అత్యల్పంగా ఉంటుంది. సూర్యాయనం రోజు సూర్యుడు ఆకాశంలో అత్యంత ఎత్తులో ఉంటాడు, కాబట్టి మధ్యాహ్నం సూర్యుడు సాధారణ రోజులతో పోల్చితే ఎక్కువ సమయం ఆకాశంలో ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో, సూర్యోదయం లేదా సూర్యాస్తమయ సమయంలో ప్రత్యేక రంగుల ఆకాశం (ఆరంజ్, ఎరుపు) చూడవచ్చు. సూర్యాయనం తర్వాత రాత్రి ఆకాశం త్వరగా చీకటిగా మారుతుంది. బుధుడు, శుక్రుడు, అంగారకుడు, శని గ్రహాలు స్పష్టంగా కనిపిస్తాయి. సూర్యుడు ఉత్తరార్ధ గోళానికి అత్యంత దగ్గరగా ఉండటంతో, ఎక్కువ వేడి అనుభూతి అవుతుంది. వేసవి తుది దశలో ఉండే ఈ కాలంలో, పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా అధికంగా ఉంటాయి. వేడి గాలులు, తక్కువ మేఘావృతం: చాలా ప్రాంతాల్లో పొడి గాలులు వీస్తాయి, కొన్ని చోట్ల మేఘావృతం తగ్గిపోతుంది. అయితే, కొన్నిచోట్ల వర్షాకాలం ప్రారంభ దశలో ఉండటం వల్ల మేఘాలు, తేలిక పాటి వర్షాలు కూడా ఉండొచ్చు. సవి చివరిలో వాయు నాణ్యత మెరుగ్గా ఉంటుంది, కానీ వేడి కారణంగా కొన్ని ప్రాంతాల్లో పొడి గాలులు వీస్తాయి.



### భూమి లోపల చంద్రుడి అవశేషాలు!

భూమికి ఉపగ్రహమైన చంద్రుడిపై పరిశోధనలు దశాబ్దాలుగా జరుగుతున్నాయి. అయితే, భూమి లోపల చంద్రుడి అవశేషాలు దాగి ఉన్నాయన్న వార్త ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇటీవల పరిశోధకుల తాజా నివేదిక ప్రకారం, సుమారు 450 కోట్ల సంవత్సరాల క్రితం 'థియా' అనే అంగారకుడి పరిమాణంలో ఉన్న గ్రహం భూమిని ఢీకొట్టింది. ఆ ఘటనలో విడిపోయిన శకలాలు చంద్రుడిగా మారాయి. కానీ, థియా గ్రహంలోని కొన్ని భాగాలు చంద్రుడిగా కాకుండా భూమి లోపలే మిగిలిపోయాయి. ఇవి భూమి ఉపరితలం కింద రెండు పెద్ద ముద్దలుగా ఉన్నాయని, భూకంప తరంగాల విశ్లేషణ ద్వారా వీటి ఉనికి గుర్తించారని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. ఈ సిద్ధాంతం ప్రకారం, భూమి లోపల దాగి ఉన్న ఆ అవశేషాలు భూమి యొక్క అంతర్గత నిర్మాణాన్ని, భూకంప తరంగాల ప్రవర్తనను ప్రభావితం చేస్తున్నాయని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ నివేదికలోని అంశాలపై మరింత లోతైన పరిశోధన జరగాల్సిన అవసరం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

### 'సైంటిస్ట్' అవతారమెత్తుతున్న ఎఐ



కృత్రిమ మేధస్సు (ఎఐ) అత్యంత వేగంగా అన్ని రంగాల్లోనూ విస్తరిస్తున్నది. తాజా దశలో ఏకంగా 'సైంటిస్ట్' అవతారం ఎత్తుతున్నది. స్వయంచాలక యంత్రాల పరిశోధనలో తాజా దశగా 'ఎఐ సైంటిస్ట్' అనే కొత్త తరహా కృత్రిమ మేధస్సు ఏజెంట్లు అభివృద్ధి అవుతున్నాయి. ఇవి స్వయంగా పరిశోధన చేయగలిగే సామర్థ్యం కలిగి ఉండడం విశేషం. కొత్త సిద్ధాంతాలు ప్రతిపాదించడంలో, డేటా విశ్లేషణలో, ప్రయోగాలు రూపొందించడంలో ఇవి సహాయపడతాయి. ఇది ఆటోమేటెడ్ రీసెర్చ్‌కు కొత్త దారులు తెరుస్తోంది. కొత్త పరిశోధనా ఆలోచనలను రూపొందించడం, కోడ్ రాయడం, ప్రయోగాలు నిర్వహించడం, ఫలితాలను విశ్లేషించడం, విజువలైజేషన్ చేయడం, శాస్త్రీయ పత్రాలు తయారు చేసి, స్వయంగా రివ్యూలు సిద్ధం చేయడం వంటి పనులను ఎఐ చేస్తున్నది. ఒక రకం ఎఐ సాంకేతికత వ్యవస్థలు మానవ శాస్త్రవేత్తల మాదిరిగానే పరిశోధనను పూర్తిగా స్వతంత్రంగా నిర్వహించగలవు. గత పరిశోధనలపై ఆధారపడి, కొత్త ఆవిష్కరణలకు దారితీసేలా ఐడియాలను అభివృద్ధి చేయడం వీటి ప్రత్యేకత. అయితే, శాస్త్రవేత్తలు మాత్రం పరిమితులను ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. మానవ పరిశోధకుల సృజనాత్మక ఆలోచన, సందర్భోచిత తార్కికతను అనుకరించడంలో యంత్రాలు ఇప్పటికీ పరిమితులకు లోబడే ఉన్నాయని, శాస్త్రీయ సమస్యలను బహుముఖీనంగా విశ్లేషించే సామర్థ్యం మానవులకు మాత్రమే ఉందని స్పష్టం చేస్తున్నారు. అంతేకాదు, పరిశోధనా ఫలితాలను స్వయంచాలకంగా సమగ్రపరచడం, వాటిని క్రొత్త సిద్ధాంతాలతో సమన్వయించడం సవాలుగా మిగిలింది. ఇది మానవయంత్ర సహకారాన్ని తప్పనిసరిగా చేస్తుంది. ప్రస్తుత శాస్త్రీయ సంస్థలు (జర్నల్స్, పీర్ రివ్యూ విధానాలు) ఎఐజనిత పరిశోధనలకు అనుగుణంగా మారవలసి ఉంది. నూతన ప్రమాణాలు మరియు ధ్రువీకరణ విధానాల అవసరం తీవ్రంగా ఉంది. ఇలా వుంటే, యంత్రాల ద్వారా కనుగొన్న ఆవిష్కరణలకు స్వాతంత్ర్యపు స్థాయి, సృజనాత్మకతకు హక్కు వంటి నైతిక సమస్యలు చర్చనీయాంశంగా మారాయి. ఈ సవాళ్ల అధిగమించడానికి మానవయంత్ర సహయోగాన్ని ప్రోత్సహించే సంస్థాగత మార్పులు, ఎఐ సిస్టమ్లలో సందర్భ సున్నితత్వాన్ని పెంపొందించే సాంకేతిక నవీకరణలు అవసరం.

## ప్రజా పోరాటాలు చేసేది కమ్యూనిస్టులే

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/కొహెడ :** ప్రజా పోరాటాలు చేసేది కమ్యూనిస్టులేనని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం సిద్ధిపేట జిల్లా కొహెడ మండల కేంద్రంలో తాళ్లపల్లి ఎల్లయ్య, పిల్లి రజిని అధ్యక్షతన జరిగిన సిపిఐ కొహెడ మండల 14వ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన్నారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా భారతదేశ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్రం కోసం, పరాయి పాలనను ఎదిరించి స్వాతంత్రం మా జన్మ హక్కని దేశ ప్రజలను కూడగట్టి దేశానికి స్వాతంత్ర్యం తేవడంలో క్రియాశీలక పాత్ర పోషించిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. అనేక మందిని త్యాగం చేసి, సమ సమాజ స్థాపనే లక్ష్యంగా, దోపిడీ లేని సమాజం కోసం అంతరాలు లేని వ్యవస్థ కోసం పోరాడిన దేశంలోనే మొట్టమొదటి రాజకీయ పార్టీ సిపిఐ అని, నాటి నుండి నేటి వరకు కార్మిక, కర్షకుల సమస్యలతో పాటు దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతూ హక్కుల సాధన కోసం, సమస్యల పరిష్కారం పోరాడుతూ వంద సంవత్సరంలోకి సిపిఐ అడుగు పెట్టిందన్నారు. దేశాన్ని పాలిస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పక్కన పెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి కేవలం కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు, సంపన్నవర్గాలకు అనుకూల నిర్ణయా లు చేస్తూ దేశ సంపదను కొల్లగొడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యంలో చేసి యువతకు ఉపా ధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్‌కు ఎన్నికల హామీలను అమలు చేయడంలో ఆలస్యం అవుతుందని, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన, పెన్షన్ల పెంపు, రైతుల రుణమాఫీ తదితర హామీలను నేరవేర్చాలని, లేకుంటే ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం శ్రామిక వర్గాల విముక్తి కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహించి లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత సిపిఐ పార్టీది అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, పీడిత వర్గాల పక్షాన నిరంతరం ఉద్యమించడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సభలో సిపిఐ కొహెడ మండల నూతన కార్యదర్శిగా వేల్పుల శ్రీనివాస్‌ను, 21 కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కనుకుంట్ల శంకర్, కిష్టపురం లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ముంజ గోపి, జేరిపోతుల జనార్థన్, బోనగిరి శంకర్, నాయకులు చల్ల సత్తిరెడ్డి, జాగిరి బాలయ్య, ఎఐఎస్ఎఫ్ నాయకులు చిట్యాల శేఖర్, వేల్పుల ప్రసన్న కుమార్, మిట్టపల్లి సుధాకర్, అంతయ్య, రామనకర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కోసం పనిచేసే పార్టీ సిపిఐ




### పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ఓట్లు, సీట్లు అధికారంతో సంబంధంలేకుండా నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక పార్టీ సిపిఐ అని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్ నర్సింహ్మా అన్నారు. శుక్రవారం సిపిఐ పెద్దకొత్తపల్లి మండలం 18వ మహాసభల వెన్నచర్ల గ్రామంలో జరిగింది. మహాసభ సందర్భంగా గ్రామంలో సిపిఐ జెండాలు చేతబూని వందలాదిమంది కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. మహాసభలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి బాల్‌నర్సింహ్మా మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నిర్వహించి లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచిన ఘనత సిపిఐకి ఉందన్నారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని పార్టీ నాయకత్వాన్ని కోరారు. మహాసభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ఎండి ఫయాజ్, జిల్లా కార్యవర్గసభ్యులు టి.నర్సింహ్మా, పెబ్బేటి విజయుడు, మండల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాస్, నాయకులు బండి లక్ష్మి పతి, శివ,స్వామి, లక్ష్మి నారాయణ, కృష్ణయ్య, సాయిలు, కృష్ణ, వాసు, గోపాల్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోడు రైతుల పక్షాన పోరాటం

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా




**ప్రజాపక్షం/చంద్రుగొండ :** పోడు భూముల రైతుల పక్షాన పోరాటం చేస్తున్న పార్టీ సిపిఐ అని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. శుక్రవారం చంద్రుగొండ మండలం దామరచర్ల గ్రామంలోని ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జడ శ్రీను, పలగాని రామకృష్ణ అధ్యక్షతన సిపిఐ చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల మహాసభలను ఘనంగా నిర్వహించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా సాబీర్ పాషా హాజరై మాట్లాడుతూ సిపిఐఆధ్వర్యంలో ఈ ప్రాంత పోడు సాగు దారు రైతులకు అండగా ఉండి కేసులు, నిర్బాంధాలను ఎదుర్కొని ఈ ప్రాంత రైతులకు న్యాయం జరిగేలా అనేక పోరాటాలు చేశామన్నారు. జలగం వెంగళరావు ప్రాజెక్టు పూర్తిగా గిరిజన ప్రాంత రైతులకు ఉపయోగకరమైన ప్రాజెక్టు అని అలాంటి ప్రాజెక్ట్ తెగి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని సిపిఐ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఏ సమస్య ఉన్న మొదటిగా ప్రజల పక్షాన పోరాడే ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. అనంతరం చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఐ చంద్రుగొండ మండల కార్యదర్శిగా బొర్రా కేశవరావు మూడవ సారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సహాయ కార్యదర్శిగా కుర్సం రాములు, గంగుల లక్ష్మీ నారాయణ, మండల కమిటీ సభ్యులుగా 15 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే సిపిఐ అన్నపురెడ్డిపల్లి మండల కార్యదర్శిగా ఉకే నారాయణ, సహాయ కార్యదర్శిగా పలగాని రామకృష్ణతో పాటు మరో 15 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. మహాసభలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్డి సలీం, రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు గార్లపాటి రామనాథం, నేరెళ్ళ రమేష్, చంద్ర నరేంద్రకుమార్, గుండెపిన్ని వెంకటేశ్వర్లుతో పాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ పాఠశాలలను నిషేధించాలి

### ఫీజు బకాయిలు ఇవ్వకపోతే ప్రభుత్వంపై తిరుగుబాటే

### విద్యార్థులకు స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు ఎప్పుడు ఇస్తారు?

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రాష్ట్రంలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలను నిషేధించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం భయపడుతుందని ఆయన అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మణికంఠరెడ్డి, ఎఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు తాండ్ర సదానందం, రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలసాని లెనిన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీకీ రాష్ట్రప్రభుత్వం, విద్యాశాఖ వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. ప్రభుత్వ గురుకులాలు, బెస్ట్ అవలేబుల్ స్కీమ్ పాఠశాలలు మూతపడుతున్న ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోతే స్థానికసంస్థల ఎన్నికల్లో విద్యార్థుల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. విద్యార్థులకు రూ.ఐదు లక్షల భరోసా కార్డు, ఎలక్ట్రిక్ స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు ఇంకెప్పుడు ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి వ్యాపారం చేస్తున్నారని, ప్రభుత్వం అధిక ఫీజులను నియంత్రించకుండా ప్రైవేట్ విద్యాసంస్థలకు వత్తాసుగా వ్యవహరిస్తుందని, అధిక ఫీజులు వసూలు చేస్తే సీజ్ చేసే దమ్ము ధైర్యం విద్యాశాఖ అధికారులకు లేదని విమర్శించారు. రాష్ట్రప్రభుత్వం విద్యార్థుల ఆర్‌టిసి బస్‌పాస్ చార్జీలను పెంచడం సరికాదని, విద్యార్థులకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో సరైన సౌకర్యాలు లేవని, ప్రభుత్వ గురుకులాలకు బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు బిల్లులు చెల్లించక అందులో చదివే విద్యార్థులు ఇంటి వద్ద ఉండే పరిస్థితి ఉందన్నారు. పాఠశాల, కళాశాల, యూనివర్సిటీలలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గురుకులాలు మోడల్ స్కూల్లో, కెజిబివిలలో నాణ్యమైన ఆహారం అందించేందుకు కృషిచేయాలన్నారు. విద్యార్థులు లేరని సాకుతో ప్రభుత్వం 12 ఎస్‌సి గురుకుల ఇంటర్ కళాశాలలను మూసివేసే నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు. రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తే ఆ పాఠశాల, కళాశాలల గుర్తింపు రద్దు చేసే విధంగా కఠిన చట్టం తేవాలన్నారు. ప్రతి ప్రైవేట్ విద్యాసంస్థ నిబంధనలు పాటించాలని లేని పక్షంలో ఆ విద్యాసంస్థల ఎదుట ధర్నాలు చేస్తామన్నారు. ప్రభుత్వం విద్యార్థుల చదువులకు నిధులు విడుదల చేయకుండా జాప్యం చేయడం సరికాదని, వెంటనే అన్నిరకాల ఫీజు బకాయిలు విడుదల చేయాలని, సిఎం రేవంత్‌రెడ్డి స్వయంగా విద్యాశాఖను నిర్వహిస్తున్న తరుణంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఇంజనీరింగ్ కళాశాలలో ఫీజులను ఎట్టి పరిస్థితిలో ప్రభుత్వం పెంచవద్దని బి కేటగిరి సీట్లను లక్షల రూపాయలకు అమ్ముతున్న కళాశాలలను బ్లాక్ లిస్టులో పెట్టాలని మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి ఆజాద్ , జిల్లా ఉపాధ్యక్షులు మొలుగూరి నితీలేష్, జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మాతంగి సాగర్, శివరామకృష్ణ, హర్ష, సిహెచ్ వైష్ణవి, నాగరాజు, శివ, అనుప్ సాయి, శంకర్, సృజన్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పట్టాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/రఘునాథపల్లి :** అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కంచనపల్లి గ్రామంలో నివసించడానికి ఇళ్లులేక డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ఆశ్రయించిన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు అందజేయాలని ఆయన కోరారు. ఈ మేరకు స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు. శుక్రవారం సిపిఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి ఆధ్వర్యంలో జిల్లా నాయకత్వంతో కలిసి హన్మకొండలోని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కంచనపల్లి గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలని, అక్కడి పరిస్థితిని ఎమ్మెల్యేకు వివరించడంతోపాటు ఇందిరమ్మ ఇండ్ల గురించి మాట్లాడి వినతిపత్రం అంద జేశారు. ఇందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కడియంను కలిసిన వారిలో సిపిఐ జిల్లా నాయకులు పాతూరి సుగుణమ్మ, ఆది సాయన్న, ఆకుల శ్రీను, మండల నాయకులు దానియేల్, కందుకూరి మల్లేశం, వెంకటయ్య, కృపానందం, శ్రీలత, గొంగళ్ల అనిత, శోభ, అనిత, తదితరులున్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసిపిగా ఎస్.మోహన్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సెంట్రల్‌జోన్ ట్రాఫిక్ విభాగం ఎసిపిగా ఎస్. మోహన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. డిజిపి కార్యాలయంలో అటాచ్మెంట్‌లో ఉన్న ఆయన సెంట్రల్‌జోన్ ట్రాఫిక్ ఎసిపిగా బదిలీ అయ్యారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఆయన 1995లో పోలీస్‌శాఖలో ఎస్‌ఐగా ఎంపికయ్యారు.1996–99 మధ్యకాలంలో హబీబ్‌నగర్‌లో, 2000–03 వరకు చార్మినార్, 2003–09వరకు దక్షిణ మండలం టాస్క్ ఫోర్స్‌లో ఎస్‌ఐగా పని చేశారు. 2009లో ఎస్‌ఐగా పదోన్నతి పొందారు. 2011 వరకు మీర్‌చౌక్ , 2012లో దక్షిణమండలం, 2012–14వరకు చార్మినార్, 2014–17 వర కు పంజాగుట్ట, 2018 వరకు తూర్పు మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహించారు. 2018లో డిఎస్‌పిగా పదోన్నతి పొందారు. దక్షిణ మండలం స్పెషల్ బ్రాంచ్ ఎసిపిగా, సూర్యాపేట డిఎస్‌పిగా, హైదరాబాద్ సిసిఎస్ విభాగంలో ఎసిపిగా, పంజాగుట్ట డివిజన్ శాంతి భద్రతల విభాగం ఎసిపిగా బాధ్యతలు నిర్వహించారు.

## నిధుల దుర్వినియోగంపై మాజీసర్పంచ్ అరెస్ట్

**ప్రజాపక్షం/గండిపేట:** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మహేశ్వరం సునీత ను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె సర్పంచ్ పదవీ కాలంలో పంచాయతీ నిధులుగా ఉన్న రూ. 2,02,30,885 రూపాయలను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రాజేంద్రనగర్ డివిజన్‌కు చెందిన డివిజినల్ పంచాయతీ అధికారి ఫిర్యాదు ప్రకారం ఫిర్యాదులో పేర్కొన్న పంచాయతీ నిధులు పెద్ద మొత్తంలో దారి మళ్లించబడ్డాయని తెలిపారు. పబ్లిక్ సర్వెంట్‌గా నమ్మక ద్రోహం మోసానికి పాల్పడినందుకు తెలంగాణ లోకాయుక్త ఆదేశాల మేరకు క్రిమినల్ కేసు నమోదు చేసి. న్యాయ ప్రక్రియలకు అనుగుణంగా ఆమెను అరెస్ట్ చేసి న్యాయస్థానానికి హాజరు పరిచారు. సంబంధిత వ్యక్తుల పాత్రలపై కూడా విచారణ కొనసాగుతోంది. నార్సింగి ఎస్‌ఐ మునీందర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసును చేధించారు.

## మోసం చేయడంలో సుధీర్‌రెడ్డి దిట్ట

మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ ధ్వజం



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** ఎల్‌బి నగర్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను మోసం చేయడంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దిట్టా అని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ ఆరోపించారు. శుక్రవారం వనస్థలిపురం డివిజన్‌లోని ప్రశాంత్ నగర్‌లోని కనకదుర్గ దేవాలయం సమీపంలో సిసి రోడ్డును స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడతూ ఎల్‌బి నగర్ నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా సుధీర్‌రెడ్డి మోసం చేశారన్నారు. వనస్థలిపురం డివిజన్‌ను ప్రశాంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామన్నారు. సమావేశంలో దెంది శశిధర్ రెడ్డి, వేణుగోపాల్, పాశం అశోక్ గౌడ్, బుద్ద సత్యనారాయణ, కవిత, స్వర్ణ మాధవి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

## విద్యార్థులు పట్టుదలతో చదువుకోవాలి



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ :** విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చందువుకోవాలని పెద్ద అంబర్‌పేట్ పురపాలక సంఘం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని పసుమముల ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నోట్ పుస్తకలు, పెన్నులు, పెన్సిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చర్లపల్లి శంకరయ్యగౌడ్, మాజీ కౌన్సిలర్ జంగయ్య, బాక్కి యాదయ్యగౌడ్, సంఘ బిక్షపతి, వెంకటేష్ గౌడ్, బాబుగౌడ్, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ విజయవంతం చేయాలి

బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** వికసిత్ భారత్ సంకల్ప సభను విజయవంతం చేయాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం కార్పొరేటర్ నివాసంలో వికసిత్ భారత్ 2047 కార్యక్రమ కార్యాచరణ కార్యక్రమానికి వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సామ రంగారెడ్డి, కొత్త రవీందర్ గౌడ్, విష్ణువర్ధన్‌గౌడ్, ప్రబారి నందికొండ గీతారెడ్డి తదితరులతో కలిసి మాట్లాడుతూ ఈనెల 22న సికింద్రాబాద్‌లో నిర్వహించే సంకల్ప సభను విజయవంతం చేయాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు.

## చింతపట్ల ఎస్‌సి కాలనీలో లేఅవుట్‌తో ఇండ్లస్థలాలు కేటాయించాలి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని చింతపట్ల ఎస్సికాలనీలో లేఅవుట్‌చేసి అర్హులైన వారందరికీ ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని శుక్రవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు అమృతా కేసరి సాగర్, పాండురంగారెడ్డి, లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ చింతపట్ల గ్రామంలోని సర్వేనంబర్ 209 లో 0.29 గుంటల భూమి ఉంది, సర్వేనంబర్ 210 లో 1.35 గుంటల భూమి ఉంది.2001 సంవత్సరంలో ప్రభుత్వం పట్టా దారుల నుండి భూమిని తీసుకుంది నేటికి ఇండ్ల స్థలాలు పంపిణి చేయలేదని తెలిపారు. ఆ భూమిని సర్వే చేయించి అర్హులైన వారందరికి కెటాయించాలని కోరారు.

## ఎడ్యుకేషన్ అవార్డు అభినందనీయం



**ప్రజాపక్షం/షాబాద్ :** ప్రగతి వెల్ఫేర్ సొసైటీ 2025 ఎడ్యుకేషన్ అవార్డ్సు అందజేసి విద్యార్థులకు ప్రోత్సహించడం అభినందనీయం అని మండల అభివృద్ధి అధికారిణి అపర్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో 2025 ఎడ్యుకేషన్ అవార్డు ఉత్సవం మండల విద్య అధికారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రగతి వెల్ఫేర్ సొసైటి సంస్థ ప్రొగ్రాం మేనేజర్ మురళి కృష్ణ కార్తీక్, ప్రగతి, తులసి, శృతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

చింతల్ బస్తీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంత్రి పొన్నం ఆకస్మిక తనిఖీలు

వైద్యసిబ్బందికి దిశానిర్దేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేదలకు మరింత మెరుగైన వైద్యం అందేలా వైద్యాధికారులను, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. హైదరాబాద్‌లోని చింతల్‌బస్తి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యునాని ఆస్పత్రులను శుక్రవారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సిబ్బంది హాజరు రిజిస్టర్‌తో పాటు మెడికల్ స్టోర్‌లో మందుల నిల్వ, క్యాడర్ స్ట్రెంత్, డాక్టర్ల పనితీరుపై పరిశీలించారు. ప్రజాఆరోగ్యగానికి సంబంధించి హెడ్ నర్స్ శకుంతలను ఆరా తీశారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. విధులకు గైర్హాజరైన ఎఎన్‌ఎంలపై చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఉన్న ఎఎన్‌ఎంలకు ఫోన్ చేసి ఎక్కడున్నారు.. ఏ వీధిలో వైద్యసేవలు అందిస్తున్నారు.. ఆ ఇంటి యజమానితో మాట్లాడించాలని ఎఎన్‌ఎంలను సూచించగా వారు స్పందించి ఇంటి యజమానితో మాట్లాడించారు. మంత్రి వారితో మాట్లాడుతూ వైద్య సేవలు సరిగా అందిస్తున్నారా, మందులు ఇస్తున్నారా, ఎఎన్‌ఎంలు సరిగా విధులు నిర్వహిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. వైద్యశాలకు వచ్చే రోగులకు చికిత్స అనంతరం మందులు అందించాలని, అలాగే గర్భిణీలు, బాలింతలు, వృద్ధులకు కచ్చితంగా వైద్యం అందించాలని సూచించారు. ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్, సిబ్బందిని నియమించడం జరుగుతుందన్నారు. ఒపి వార్డులో ఔట్ పేషెంట్ రిజిస్టర్‌ను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు కొరత లేకుండా చూడాలని, అలాగే వైద్య అధికారులు, ఎఎన్‌ఎంలు క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది, ప్రశంసనీయమైనదని, పేదలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఇక మీదట జిల్లాలో ప్రతివారం పాఠశాలలు, ఆస్పత్రులు, హాస్టల్స్‌ను జిల్లా కలెక్టర్, జిహెచ్‌ఎంసి కమిషనర్‌తో కలిసి తాను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం ద్వారా సానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ సూపర్‌వైజర్ శకుంతల, కార్పొరేటర్ విజయ రెడ్డి, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

డెంగీ ప్రబలకుండా పరిశుభ్రత పాటించాలి

క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించిన జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం ఉంటుందని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ నగర వాసులకు కోరారు. కమిషనర్ ముషీరాబాద్ సర్కిల్ గాంధీ నగర్, అరుంధతి నగర్, కవాడిగూడ పాఠశాల, ఇందిరా పార్కు లను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, డెంగీ, మలేరియా వ్యాధికి గురికాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. ఇంట్లో, ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా పిల్లలు దోమల బారిన పడకుండాముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కవాడిగూడ పాఠశాలలో విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలను విద్యార్థులకు కమిషనర్ వివరించారు. అనంతరం ఇందిరా పార్కును సందర్శించారు. అక్కడ వాకర్స్‌తో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాకర్స్ సమన్యలను పరిష్కరించాలని యుబిడి అధికారులను ఆదేశించారు. కమిషనర్ సందర్శకుల వసతుల కోసం కొన్ని సూచనలు చేశారు. సందర్శనలో కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ ఎన్. రవి కిరణ్, డిప్యూటీ కమిషనర్ రామానుజులరెడ్డి ఉన్నారు.



### ఆస్తిపన్ను వసూళ్లలో లక్ష్యాన్ని పూర్తిచేయాలి

ఆస్తిపన్ను లక్ష్యాన్ని పూర్తిచేయాలని కమిషనర్ ఆర్‌వి కర్ణన్ అన్నారు. అదనపు, జోనల్, డిప్యూటీ కమిషనర్లతో శుక్రవారం ఆస్తిపన్ను వసూలు, ఫాగింగ్, పూడికతీత అంశాలపై సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జోనల్ కమిషనర్లు సర్కిల్ వారీగా సమీక్షించి, నిర్దేశించిన లక్ష్యం మేరకు పన్ను వసూలు చేయకుంటే బిల్లు కలెక్టర్లపై శాఖ పరంగా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు చేపట్టిన ఫాగింగ్‌పై పర్యవేక్షణకు ఒక వార్డుకు ఒక్క సూపర్‌వైజర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రెండు అంత కంటే ఎక్కువ వార్డులకు సూపర్ వైజర్లు నియమించవద్దని అదనపు కమిషనర్(ఆరోగ్యం)ను ఆదేశించారు. పార్కులలో దోమల ఉత్పత్తి కాకుండా ఫాగింగ్ చేయలన్నారు. పూడికతీతలో కొన్ని సర్కిళ్లు వెనుకబడి ఉన్న ఇఇలు, డిప్యూటీ ఇఇలకు షోకాజు నోటీసులు జారీచేయాలని చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశించారు.

## బేకరీలపై జిహెచ్‌ఎంసి ఆకస్మిక తనిఖీలు

నిబంధనల ఉల్లంఘనలపై నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆహార పదార్థాల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించని బేకరీలపై మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) కొరడా ఝులిపిస్తోంది. కమిషనర్ ఆర్‌వి కర్ణన్ ఆదేశాల మేరకు శుక్రవారం జిహెచ్‌ఎంసి పరిధిలోని దాదాపు 90 పైగా బేకరీలపై ఆకస్మిక దాడులతో తనిఖీలు జరిపారు. 80 బేకరీలలో నమూనానాలు సేకరించి, విశ్లేషణ కోసం నాచారంలోని రాష్ట్ర ఫుడ్‌ల్యాబ్‌కు పంపించారు. బేకరీలు, అక్కడి వంట శాలలలో స్వచ్ఛత పాటించాల్సిన అవసరం ఉందని, భోజన వస్తువుల తయారీ, విక్రయ ప్రదేశాలలో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని ఫుడ్ సేఫ్టీ అధికారుల హెచ్చరించారు. కౌంటర్ లలో ఉంచిన పదార్థాలపై తయారీ తేదీ, నిల్వ కాలం వంటి వివరాలు తప్పనిసరిగా లేబులింగ్ చేయాలని స్పష్టం చేశారు. సరైన ప్రమాణాలు పాటించని బేకరీ యజమాన్యాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఆహార భద్రతా ప్రమాణాల ఉల్లంఘనపై సంబంధిత సంస్థలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. తీవ్రమైన తప్పిదాలు ఉంటే సంబంధిత అధికారి ఎదుట విచారణకు పంపుతామని తెలిపారు.



**తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన సామాన్య ఉల్లంఘనలు..**
– ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ లైసెన్స్‌ను బేకరీలో స్పష్టంగా ప్రదర్శించడం లేదు
– అమ్మకానికి ఉంచిన పదార్థాలపై ఉత్పత్తి తేదీ, ముగింపు తేదీలు ముద్రించడం లేదు
– మురుగు డబ్బాలు తెరిచి ఉండడాన్ని గుర్తింపు
– ప్రాంగణంలో ఈగలు, కిటకాలు వాలడాన్ని గుర్తించారు
– ఆహార పదార్థాలు మురికిగా ఉన్న నేలపై వేసి ఉండటం
– వంటలు చేసేవారి ఆరోగ్య పత్రాలు, నీటి పరిశీలన నివేదికలు లేవు
– వంటలు చేసేవాళ్లు హెయిర్‌నెట్‌లు ధరించకుండానే పనిచేస్తుండటం గుర్తించారు.

## అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు

సిపిఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి నర్సింహ్మా



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ఎల్‌బినగర్ మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్5 లో యాదేచ్ఛగా అక్రమ సెల్లార్ తవ్వకాలు చేపడుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని సిపిఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ్మా ఆరోపించారు. శుక్రవారం సిపిఐ సరూర్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో ఎస్‌ఎడాంగె భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సింహ్మా మాట్లాడుతూ ఆర్‌కెపురం డివిజన్ వాసవికాలనీలో అష్టలక్ష్మీ కమాన్ వెళ్లె ప్రధాన రహదారిలో డబుల్ సెల్లార్‌ల తవ్వకాల నిర్మాణాల పై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ప్రజాపాలనలో జోనల్ కమీషనర్‌కు వినతిపత్రం అందించామన్నారు. వారం రోజులైన ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు పై వెళ్లే ప్రజలకు, పక్కనే ఉన్న కాలేజీలు, స్కూల్ ఉన్నా బ్లాసింగ్ చేస్తూ టిప్పర్లతో సౌండ్ పొల్యూషన్ చేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకుపోయిన పట్టించుకుపోవడం దారుణమన్నారు. డివిజన్‌లో అనేక సెల్లార్‌లు ఎలాంటి భద్రత లేకుండా విచ్చలవిడిగా తవ్వుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బోయపల్లి రాములుగౌడ్, ఎల్‌బినగర్ నియోజవకవర్గం కార్యధర్శి రమావత్ సక్రునాయక్ పాల్గొన్నారు.

## కార్పొరేట్‌స్థాయి విద్య అందించాలన్నదే లక్ష్యం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్నదే లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినంధించడంతోపాటు సన్మానించారు. నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నత స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలన్న లక్ష్యంతోనే జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించడం జరుగుతుందని వివరించారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన భవనాన్ని నిర్మించి విద్యార్థులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. ఇందులో భాగంగానే కొందుర్గు మండల కేంద్రంలో ఏకీకృత పాఠశాల భవనాన్ని తీసుకువచ్చినట్లు, గురుకుల పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, నేతలు మహ్మద్ ఇబ్రహీం, మంగులాల్‌నాయక్, సయ్యద్ సాధిక్, అగిరు రవికుమార్‌గుప్తా, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, ప్రదీప్‌కుమార్, ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

### మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించేదుకు కృషి

మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రాజీవ్‌నగర్ కాలనీ, వెంకటరమణ కాలనీల్లో ఉన్న పార్కుల అభివృద్ధికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యజీవితంలో ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులే లక్ష్యంగా పని చేస్తున్నామని వివరించారు. సిసిరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేయడంతోపాటు పార్కులను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి వార్డులో ప్రజలకు అవసరమయ్యే పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, బాబర్‌ఖాన్, మాధవులు, మాజీ కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి, బస్వం, రఘునాయక్, ఇబ్రహీం, చంద్రశేఖర్, ఖధీర్, మంగులాల్‌నాయక్, మురళిమోహన్, లింగారెడ్డి గూడ అశోక్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బికెఎంయు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య అన్నారు. శుక్రవారం షాద్‌నగర్‌లో వచ్చే నెల జూలై 5,6వ తేదిల్లో నిర్వహించే జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ రాష్ట్ర రాజదాని హైదరాబాద్‌కు కూతపెట్టు దూరంగా షాద్‌నగర్ ప్రాంతం ఉందని, చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకొకుండా పోతున్నాయని వివరించారు. పట్టణీకరణ నేపథ్యంలో షాద్‌నగర్, చేవెళ్ల, శంషాబాద్, ఇబ్రహీంపట్నం వంటి ప్రాం తాలు అభివృద్ధి చెందుతున్నాయని, వాటి చుట్టుపక్కల ఉన్న గ్రామాలు మాత్రం వెనుకబడిపోతున్నాయన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పుణ్యామా అంటూ చుట్టు పక్క ప్రాంతాల గ్రామాలు పూర్తిగా వెనకబడిపోతున్నాయని వివరించారు. సన్న, చిన్నకారు రైతులు, వ్యవసాయ కార్మికులు పట్టణాలలో కొంతమేర ఇండ్లు కట్టుకుని పనులు లభించక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించేందుకు కృషి చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం సమావేశంలో బికెఎంయు ఫరూఖ్‌నగర్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.రాములు, ప్రధాన కార్యదర్శిగా కె.రాజు నాయక్, ఉపాధ్యక్షులుగా జి.జంగయ్య, పి.శంకర్, కార్యదర్శులుగా కె.రాములు గౌడ్, చెన్నయ్య, కోశాధికారిగా పైకి రమేష్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బికెఎంయు జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, జిల్లా నాయకులు స్వరూప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకిచ్చిన హామీలు అమలు చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య




**ప్రజాపక్షం/షాబాద్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్ల నియోజక వర్గ పరిధిలోని శంకర్‌పల్లి మండల కేంద్రంలో సిపిఐ మండల మహాసభ ఘనంగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న బివిఆర్ గార్డెన్‌లో సిపిఐ మండల కార్యదర్శి పి.సుధీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అధిదులుగా జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జ్ రామస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై మండిపడ్డారు. చేవెళ్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నిరు పేద ప్రజలకు ఇండ్ల స్థలాల పట్టా దృవ పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం శంకరపల్లి మండల సిపిఐ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభులింగం, సిపిఐ సీనియర్ నాయకులు సుభాన్‌రెడ్డి, మహిళ సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఆలయాలకు బోనాల నిధులు : ఎమ్మెల్యే డిమాండ్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఆషాఢ మాస బోనాల పండుగకు ఆలయాలకు నిధులు కేటాయించాలంటూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి కోరారు. బిఆర్ఎస్ శ్రేణు లు మేకల రాము యాదవ్, బద్దం పరశురాంరెడ్డి, హేమంత్ పటేల్‌లతో కల్సి ఆయన శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కల్సి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.



## 4,859 మంది రైతుల ఖాతాల్లో రూ.3.76కోట్లు జమ

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** రైతు భరోసా పథకం ద్వారా అన్నదాతకు అండగా ఉండే లక్ష్యంగా ప్రభుత్వం ఆర్థికంగా చేయూతను అందిస్తోందని జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద జిల్లాలో 4859 మందికి రైతుల ఖాతాల్లో రూ.3.76 కోట్లు జమ చేయటం జరిగిందని, విడతల వారీగా వారికి నేరుగా బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తుంటామన్నారు. వ్యవసాయానికి పెట్టుబడి భారాన్ని తగ్గించి వ్యవసాయోత్పత్తులు పెంపొందించుకొనేందుకు ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందన్నారు.



## యోగా ప్రతి ఒక్కరి జీవన శైలి కావాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఎల్‌బి స్టేడియంలో శుక్రవారం జరిగిన యోగా కార్యక్రమంలో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ దేశంలో అనాది కాలంగా వస్తున్న యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవనంలో భాగంగా చేసుకోవాలన్నారు. యోగాకు ప్రపంచ వ్యాప్తంగా ప్రధాని మోడి ప్రత్యేక గుర్తింపు తీసుకొని వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి శ్రేణులు రవి, శ్రీనివాస్,నందు యాదవ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



## చెరువు, కుంటలు మింగేసిన ఎమ్మెల్యే

### కొలను హన్మంతరెడ్డి ఆరోపణ

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** హ్యాట్రిక్ ఎమ్మెల్యే చెరువులు, కుంటలను మింగేసి పబ్బం గడుపుకుంటున్నాడని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంతరెడ్డి ఆరోపించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారంలోని పలు కాలనీలలో హన్మంతరెడ్డి పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను స్థానికులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. బోరు బావులు ఎండి పోవడంతో నీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు హన్మంతరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ సూరారంలోని సర్వేనంబరు 21లో ఉన్న కొత్తకుంట చెరువుని కొందరు బిఆర్ఎస్ నాయకులు మట్టిపోసి చదును చేస్తున్నారని, చెరువులను, కుంటలను సైతం వదిలిపెట్టకుండా కబ్జా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూరారంలో నీటి ఎద్దడి సమస్యను సైతం పరిష్కరించే విధంగా చూస్తానని అన్నారు. కొత్తకుంట చెరువుని కబ్జా చేస్తున్న ఏ ఒక్కరిని వదిలి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలను తిరిగి నిర్మించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాలకృష్ణ, సంజీవరెడ్డి, సంతోష్ ముదిరాజ్ , సోమన్న, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.



## లేబర్ కోడ్‌ల రద్దుపై కార్మిక సంఘాల డిమాండ్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కార్మికుల ఉద్యోగ భద్రతను తొలగిస్తూ,పెట్టుబడిదారుల ప్రయోజనాలకే మక్కువ చూపుతున్న కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సిఐటియూ రాష్ట్ర కార్యదర్శి జె చంద్రశేఖర్,ఏఐటియూసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శంకర్‌రావులు అన్నారు.శుక్ర వారం తెలంగాణ రాష్ట్ర,కేంద్ర కార్మిక సంఘాలు,స్వతంత్ర ఫెడరేషన్లు,అసోసియేషన్లు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కమలా నగర్ సిఐటియూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల ఉద్యోగ భద్రత,హక్కులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని అన్నారు.29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కోడ్‌లను వ్యతిరేకిస్తూ జూలై 9న జరగనున్న దేశవ్యాప్తంగా కార్మిక సమ్మెకు అన్ని సంఘాలు మద్దతు ప్రకటించింది.ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియూ అధ్యక్షులు ఎర్ర అశోక్, టియూసిఐ ప్రవీణ్, ఐఎఫ్‌టియూ లక్ష్మయ్య,టిఆర్ఎస్‌కెవి ప్రభాకర్,ఉన్ని కృష్ణ,రేవతి కళ్యాణి,శ్రీనివాస్,రాజశేఖర్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నిజాంపేట్‌లో పలు ప్రాంతాల్లో విద్యుత్‌ని నిలిపివేయడం జరుగుతుందని నిజాంపేట్ విద్యుత్ సబ్ స్టేషన్ ఎఇ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. నిజాంపేట్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రశాంతి హిల్స్ 11కెవి ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రశాంతి హిల్స్, మధురానగర్, ఎన్‌టిఆర్ నగర్ కాలనీ కొంత భాగం నిలిపివేస్తున్నామని, శ్రీనివాస కాలనీ 11 కెవి ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా శ్రీనివాస కాలనీ, బాలాజీ నగర్, ఎన్‌టిఆర్ నగర్ కాలనీలో మధ్యాహ్నం 2 గంటల నుండి 3 గంటల వరకు, అదేవిధంగా పాండురంగ 11కెవి ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా బండారు లే అవుట్ కాలనీలో కొంత భాగంలో, రెడ్డీస్ ఎవెన్యూ, శ్రీనివాస కాలనీలలో ఉదయం 10:30గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఎఇ కోరారు.

## ప్రజాస్వామ్య హక్కుల రక్షణకు ప్రజలంతా ఉద్యమించాలి

### ఛలో రాజ్ భవన్ మహాధర్నా గోడ పత్రిక ఆవిష్కరణలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర

**ప్రజాపక్షం/ ఘట్‌కేసర్, మేడ్చల్ ప్రతినిధి :** దేశంలో కమ్యూనిస్టుల ను లేకుండా చేసేందుకే కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్ చేపట్టిందని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేందర్ అన్నారు. శుక్రవారం ఎఐవైఎఫ్ ఘట్ కేసర్ మండల సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ముందు ఛలో రాజ్ భవన్ మహాధర్నాకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా కల్లూరి ధర్మేందర్ మాట్లాడుతూ మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపాలని కగార్ నిర్వహించే ప్రాంతంలో ఖనిజ సంపద ఉన్న నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని కార్పొ రేటర్లకు అప్పగించే ప్రయత్నం మోదీ ప్రభుత్వం చేస్తుందని ఆయన ఆరోపించారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం జరిపిన క్రూర మావోయిస్టుల హత్యలపై సుప్రీం కోర్టు న్యాయ మూర్తితో నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. శాంతిభద్రతల సమస్యగా సృష్టించి బూటకపు ఎన్‌కౌంటర్లను చేస్తున్నదని అన్నారు. డెడ్‌లైన్ విధించి మావో యిస్టులు ఆ సంస్థలను అంతం చేస్తామంటూ కేంద్రం ప్రకటించడం వెనుక ఆర్‌ఎస్‌ఎస్ రహస్య అజెండాను కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్నట్లు వారు ధ్వజమెత్తారు. ఇలాంటి భయానక దాడులను తక్షణమే ఆపాలని ఆర్థిక రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సమస్యగా పరిగణించి చర్చల ద్వారా పరిష్కరించాలని వారు సూచించారు. శాంతిభద్రతల సమస్యగా చూడటం సరైంది కాదని ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు ప్రజలంతా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, మండల కార్యదర్శి సంపంగి శివలు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కాకుంటే మావోయిస్టులు కాకుంటే మరో రూపంలో ప్రతిఘటన ప్రజాస్వామిక హక్కులను కాపాడుకోవడంకోసం ప్రజలు ముందుకొస్తారని అన్నారు. ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జూన్ 23న అడవుల్లోని ఖనిజ సంపదను వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టే ఆపరేషన్ కగార్‌ను ఆపాలని కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణను ప్రకటించి మావోయిస్టు పార్టీ తో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తు ఛలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గిరిబాబు, మండల కార్యవర్గ సభ్యులు శివకుమార్, వెంకటే, పద్మ, పద్మశ్రీ,తదితరులు పాల్గొన్నారు.



**ఆపరేషన్ కగార్‌ను ఆపాలన్న డిమాండ్‌తో చలో రాజ్‌భవన్ : ఎఐవైఎఫ్ సత్యప్రసాద్**

మావోల నిర్మూలన పేరిట కేంద్రం కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపేసి శాంతి చర్చలు జరిపాలన్న డిమాండ్‌తో ఈ నెల 23న తలపెట్టిన చలో రాజ్‌భవన్ ముట్టడికి సంబంధించి గోడ పత్రికలను ఎఐవైఎఫ్ శ్రేణులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈసిఐఎల్‌లోని జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి తోకల సత్యప్రసాద్, జిల్లా అధ్యక్షుడు సల్మాన్ బేగ్, ఉపాధ్యక్షుడు గిరిబాబు, ఎం.శేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రజని, కోమల, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సత్యప్రసాద్, సల్మాన్ బేగ్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూర్ఖంగా మోవోలను యుద్ధ తరహాలో కేంద్ర బలగాల సాయంతో అత్యంత ఆయుధాలను వినియోగించి నరహంతక చర్యలకు పాల్పడుతోందన్నారు. ఛత్తీస్‌ఘడ్ అటవీ ప్రాంతంలో లభించే బొగ్గు, బాక్సైట్,ఇనుము, సున్నపు రాయి, డోలమైట్ లాంటి ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాధత్తం చేసే యోచనతోనే కేంద్రం ఇలాంటి చర్యలను కొనసాగిస్తోందని విమర్శించారు. పాలకులు అనుసరిస్తున్న విధానాలతో దేశం ఒక విచిత్రమైన సంక్షోభంలో పడి పోయిందన్నారు. దండకారణ్యం నెత్తురోడుతోందని, విప్లవోద్యమం అణచివేతే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్ ఆదివాసి హననానికి కారణమవుతోందన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి 2023 మార్చి నాటికి మావోలను పూర్తిగా అంతంచేస్తామని ప్రకటించటం పట్ల ప్రజలు, మేధావులు, ప్రజా సంఘాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపేసి శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్న మావోలను ఆహ్వానించి శాంతి పరిష్కారం తీసుకొని రావాలన్న డిమాండ్‌తో ఛలో రాజ్‌భవన్ నిర్వహిస్తున్నామని తెలిపారు.





## పోరాటాల ద్వారా పేదలకు ఇళ్లు ఇప్పించిన ఘనచరిత్ర కమ్యూనిస్టులదే

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలకు భారీ సంఖ్యలో హాజరు కావాలంటూ పార్టీ వినాయకనగర్ మండల కార్యదర్శి టి.యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా కౌన్సిల్ సభ్యులు కాసర్ల నాగరాజు మాట్లాడుతూ ఆగస్టు 19 నుండి నాలుగు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర మహాసభలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి వెయ్యిమందికి పైగా ప్రతినిధులు హాజరవుతారన్నారు. మేడ్చల్ జిల్లాలో పోరాటాల ద్వారా అనేకమంది పేదలకు ఇళ్లు ఇప్పించిన ఘనచరిత్ర కమ్యూనిస్టులదేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు బి.యాదగిరి, జె.రాములు, ఎస్‌కె అజీజ్, జె.వెంకటరమణ, సయ్యద్ యూసూఫ్, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.



## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను మాజీ మంత్రి, స్థానిక మేడ్చల్ ఎంఎల్‌ఎ చామకూర మల్లారెడ్డి శుక్రవారం ఆయన నివాసంలో బాధితులకు అందజేశారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటి ఉద్దెమర్రికి చెందిన త్రీగుళ్ల మాధవ శర్మ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం సిఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.59,500 మంజూరయ్యాయి. ఇట్టి చెక్కును మల్లారెడ్డి మాధవశర్మకు అందజేశారు. అలాగే అలియాబాద్ మున్సిపాలిటి మజీద్‌పూర్‌కు చెందిన అబ్బగౌని ఆనంద్‌కు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.31,500 అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముక్కెర్ల సంజీవ్‌యాదవ్, శామీర్‌పేట బిఆర్ఎస్ అధ్యక్షుడు సరసం మోహన్ రెడ్డి, వంగ వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు నెలాఖరులోగా గ్రౌండింగ్ పూర్తి

### అధికారులకు కలెక్టర్ మనుచౌదరి ఆదేశం

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మేడ్చల్ జిల్లా కు గాను ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన 1409 ఇళ్లకు సంబంధించి ఈ నెలాఖరు లోగా గ్రౌండింగ్ పూర్తి చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖాధికారులను కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ రాధికా గుప్తాతో కల్సి ఆ శాఖాధికారులతో నిర్వహించిన సమీక్ష నిర్వహించారు. ఇప్పటికి 516 ఇళ్లకు సంబంధించి గ్రౌండింగ్ పూర్తయిందని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రమణ మూర్తి వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వెంటనే గృహ నిర్మాణ సంస్థకు చెందిన 8 మంది ఏఈలకు 900 ఇళ్ల బాధ్యత అప్పచెప్పి ఇంటింటికి తిరిగి వారంలోగానే పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

అదే విధంగా జిల్లాలోని గ్రామీ ణ ప్రాంతాల్లో ఉన్న స్థానిక కోటాకు సంబం ధించి వెయ్యి రెండు పడకల గృహాలను సైతం ఎల్2 కోటాలో కేటాయించాలని తెలిపారు. దీంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల బేస్మెంట్ నిర్మాణం చేయలేకపోతున్న వారిని మహిళా సంఘాలలో చేర్పించి లక్ష రూపాయలు రుణాలుగా మంజూరు చేస్తూ ఇంటి నిర్మాణాలు చేపట్టేలా చూడాలన్నారు.



## ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### ఎమ్మెల్యే కెపి.వివేకానంద



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని బిఆర్ఎస్ పార్టీ శాసనసభ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ ఓక్షిత్ హిల్ వ్యూ కాలనీలో రూ.60లక్షల వ్యయం తో సిమెంటు రోడ్డు పనులను ఎమ్మెల్యే కెపి వివేక్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా, ప్రజా సంక్షేమమే పరమావధిగా ముందుకువెళ్తున్నానని అన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, నియోజకవర్గంలో రోజురోజుకి కాలనీలు పెరిగిపోతున్నాయని, అందుకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పించడమే నా బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులను చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, లేని పక్షంలో సహించేది లేదని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, నాయకులు కృష్ణ గౌడ్, నాగరాజు, సురేంద్ర, శ్రీనివాస్ యాదవ్, నవాబ్ భాయ్, తదితరులు పాల్గొన్నారు.

**ఖైసర్ నగర్‌లో పర్యటన**

గాజులరామారం డివిజన్ ఖైసర్ నగర్‌లో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద పర్యటించారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల వ్యయంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. ఖైసర్ నగర్‌లో ప్రతి వీధికి మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీటిని అందించామని అన్నారు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తక్షణమే ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

కార్యక్రమంలో గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డి, వాటర్ వర్క్స్ జిఎం మాధవి, ఇఇ కిష్టప్ప, నాయకులు శ్రీనివాస్ యాదవ్, కరుణాకర్ రాజు, మక్సూద్, అజయ్‌గుప్తలు పాల్గొన్నారు.

## ముగిసిన రెవెన్యూ సదస్సులు

**ప్రజాపక్షం/వికారాబాద్ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా జూన్ 3న ప్రారంభం అయి 20 శుక్రవారంతో ముగిసింది. వికారాబాద్ మండల పరిధిలోని రెవెన్యూ గ్రామల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెవెన్యూ సదస్సులలో ముఖ్యంగా, మిస్సింగ్ సర్వేనెంబర్, విరసత్‌కు సంబంధించి నాయి సుమారుగా 14వందల వరకు అర్జీలను స్వీకరించడం జరిగింది అని తహసీల్దార్ లక్ష్మి నారాయణ తెలిపారు. ఈ సదస్సులను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్,అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డిఓ వాసుచంద్ర నిరంతర పర్యావేక్షణ ద్వారా అధికారులను సమనవ్వయం చేస్తు సలహాలు సూచలు చేస్తు సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేశారు. తహసీల్దార్లకు ఎప్పటికప్పుడు కలెక్టర్ అదనపు కలెక్టర్ పర్యవేక్షణతో రెవెన్యూ సదస్సు ఎటువంటి అటంకలు లేకుండా ముగించా రు. ఇందులో ముఖ్యంగా అధికారులు గ్రామల్లోకి వెళ్లి అర్జీలు స్వీకరించడంతో అర్జీలను అధికారులు త్వరగా పరిష్కార మార్గాలు చూపడానికి ఆస్కారం ఉంది అని తెలుస్తుంది. ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్‌లో అధికారులు నమోదు చేయడం జరుగుతుంది. అల్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా సమస్య పరిష్కారం త్వరగా జరిగే అవకాశం ఉంది అని తెలుస్తుంది. ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను అధికారులు తెలుసుకొని రెవెన్యూ సదస్సు లో పరిష్కారం అయ్యే సమస్యలను పరిష్కరించారు. కొన్ని అర్జీలను రికార్డులను పరిశీలించిన తర్వాత పరిష్కారం చూపడానికి అధికారులు కృషి చేస్తారని తెలిపారు. ప్రతి భూమిని సర్వే నిర్వహిస్తే తప్ప భూ సమస్యలు శాశ్వత పరిష్కారం అవుతాయని తెలుస్తుంది.

## 22న బిజెపి సంకల్ప సభ

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడి 11ఏళ్లు, కాగా, మల్కాజిగిరి ఎంపిగా ఈటల వచ్చి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా ఈ నెల 22న సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్స్ లో తలపెట్టిన సంకల్పసభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలంటూ బిజెపి శ్రేణులు మోలాలి డివిజన్‌లో కరపత్రాల పంపిణీ చేసా రు. డివిజన్‌కు చెందిన బిజెపి నేతలు మోహన్‌యాదవ్, హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజు, శేఖర్, శివకుమార్, తదితరులు హనుమాన్ నగర్, జవహర్‌నగర్, మౌలాలి ప్రాంతాల్లో శుక్రవారం ఇంటింటికి వెళ్లి సంకల్పసభకు రావాలని కోరారు.ఈ సంకల్ప సభలో బిజెపి గత 11ఏళ్లుగా అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో పాటు ఏడాది కాలంగా ఎంపి ఈటెల రాజేందర్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ఎగ్జిబిషన్ ప్రదర్శనలు ఉంటాయన్నారు.



## పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు అందజేసిన ఎస్ఐ

**ప్రజాపక్షం/పరిగి:** పరిగి మండల పరిధిలోని మాదారం గ్రామానికి చెందిన నర్సింలు, పరిగి పట్టణానికి చెందిన హమీద్ రమేష్ గడి సింగపూర్ గ్రామానికి చెందిన మహిపాల్ సంబంధించిన ముబైల్ ఫోన్‌లను పోగొట్టుకొని పరిగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సిఈఐ ఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి శుక్రవారం బాధితులకు మొబైలను అందజేసిన ఎస్ సంతోష్‌కుమార్ . ఈ నెలలోనే 15సెల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు తెలిపారు.

## నేడు ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ పత్రాల పంపిణీ

### హాజరుకానున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**ప్రజాపక్షం/కోట్‌పల్లి:** వికారాబాద్ జిల్లాలో పర్యటనలో భాగంగా కోట్‌పల్లి మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ పత్రాలను తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మ నోహర్‌రెడ్డిల చేతుల మీదుగా అందించనున్నట్లు ఎంపీడివో డ్యానియెల్ ఓ ప్రకటనలో తెలిపారు.

## బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో షెడ్యూల్ కుల విద్యార్థులకు ప్రవేశాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** బెస్ట్ అవలబుల్ పాఠశాలల్లో (డే స్కాలర్) ఒకటో తరగతి నుండి జిల్లాలోని షెడ్యూల్ కులాల బాల బాలికల నుండి 2025–26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు ధరఖాస్తులు సమర్పించాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కోరారు. 5 నుండి ఆరేళ్ల వయస్సు కలిగి ఉండాలని, మేడ్చల్ జిల్లా వాస్తవ్యులై ఉండాలని, అభ్యర్థుల తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.5లక్షలు, పట్టణ ప్రాంత వాసులకు రూ. 2 లక్షల లోపు ఉండాలని, ఒక కుటుంబం నుండి ఒకే విద్యార్థికి ప్రవేశం ఉంటుందని, కుల, ఆదాయ ధృవపత్రాలు మీ సేవ ద్వారా పొంది ఉండాలన్నారు. పూర్తిచేసిన ధరఖాస్తు ఫారాలను జూలై 23 సాయంత్రం 5 గంటల లోపు కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో నేరుగా సమర్పించాలని, వచ్చిన ధరఖాస్తుల్లో ఈ నెల 25న లాటరీ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. జిల్లాలో బెస్ట్ అవలబుల్ పాఠశాలలుగా గుర్తించిన చింతల్‌లోని ఆర్ఎస్‌కె ఉన్నత పాఠశాల, కుషాయిగూడలోని బ్రిలియంట్ గ్రామర్ ఉన్నత పాఠశాల, కూకట్‌పల్లిలోని బ్రిలియంట్ గ్రామర్ ఉన్నత పాఠశాల, బోడుప్పల్‌లోని పద్మశ్రీ ఉన్నత పాఠశాల, మల్కాజిగిరిలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల, తూంకుంటలోని విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాల, జగద్గిరిగుట్టలోని శ్రీసాయి విద్యా నికేతన్ ఉన్నత పాఠశాలల్లో ఈ ప్రవేశాలు ఉంటాయన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**ప్రజాపక్షం / కొడంగల్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను గాను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి చేతులమీదుగా భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదనపు తరగతి గదుల కోసం, కోస్గి రోడ్‌లో గల బిసి హాస్టల్ భవన నిర్మాణం కోసం, మున్సిపల్ పరిధిలోని అండర్ డ్రైనేజీ, వాటర్ సప్లయ్, రోడ్ల విస్తరణ, ప్రధాన జంక్షన్‌ల విస్తరణ, వీధి దీపాలు వంటి పలు అభివృద్ధి పనులకై దాదాపు 300 కోట్ల నిధులతో పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. కొడంగల్‌తో పాటు కోస్గి మున్సిపల్ పరిధిలోని దాదాపు 350 కోట్ల నిధులతో అభివృద్ధి శంకుస్థాపనలు చేయడం జరుగుతుందని తెలిపారు. దీంతో పాటు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాడిన మద్దూర్ మున్సిపల్ భవన నిర్మాణానికి, డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను కూడా ప్రారంబించడం జరుగుతుందని తెలిపారు. అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

# రీల్

## 'కరుప్పు' టైటిల్ ఫస్ట్ లుక్



సూర్య తన మాగ్నమోపస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ #సూర్య45 కోసం దర్శకుడు ఆర్జే బాలాజీతో చేతులు కలిపారు. తమిళ, తెలుగు, హిందీ చిత్ర నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. ఈ చిత్రానికి 'కరుప్పు' అని టైటిల్ పెట్టారు. దర్శకుడు ఆర్జే బాలాజీ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. టైటిల్ పోస్టర్ పవర్ ఫుల్‌గా కనిపిస్తోంది, సూర్య చేతిలో కత్తి పట్టుకుని, అతని వెనుక ఒక దేవత ఉన్నట్లుగా ఫెరోషియస్ అవతార్‌లో కనిపించారు. సినిమా యాక్షన్‌తో నిండి ఉంటుందని, సూర్య వైల్డ్ పాత్రలో కనిపిస్తాడని పోస్టర్ ద్వారా తెలుస్తుంది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మించిన చిత్రాల్లో కరుప్పు అత్యంత భారీ బడ్జెట్ చిత్రం. మంచి ఎంటర్‌టైనర్లను తీసే ఆర్జే బాలాజీ బడ్జెట్, విజన్, స్టార్ కాస్ట్ పరంగా కరుప్పుతో నెక్స్ట్ లెవల్‌కి వెళ్తున్నారు. రెండు దశాబ్దాల తర్వాత సూర్య, త్రిష కృష్ణన్ తిరిగి ఈ చిత్రంలో జోడిగా నటిస్తున్నారు. ఇద్దరూ తమ మునుపటి చిత్రాలతో పోలిస్తే భిన్నమైన మేకోవర్‌లో కనిపిస్తారు.

## ఇద్దరికి రెండేళ్లు



రామ్ చరణ్ ఉపాసనల కుమార్తె క్లింకార తన పుట్టిన రోజు సందర్భంగా జూ పార్క్‌ను సందర్శించారు. తాము దత్తత తీసుకున్న బెంగాల్ టైగర్ తెల్లపులికి జూ పార్క్ అధికారులు కూడా క్లింకార అని నామకరణం చేశారు. రామ్ చరణ్ ఉపాసనల కుమార్తెకు రెండేళ్లు నిండిన సందర్భంగా శుక్రవారం జూ పార్క్‌కు వెళ్లిన ఉపాసన తన కుమార్తె క్లింకారకు పులి క్లింకారను చూపించింది. ఆ తెల్ల పులిని చూసి కూతురు క్లింకార ఎంతో సంతోషపడ్డారని ఉపాసన తెలిపారు. గతేడాది జూపార్క్‌లో కొత్తగా పుట్టిన బెంగాల్ టైగర్ తెల్లపులిని రామ్ చరణ్ ఉపాసన దంపతులు దత్తత తీసుకున్నారు. ఈ పులి క్లింకార, రాంచరణ కుమార్తె క్లింకార ఇద్దరి వయసు రెండేళ్లు కావడం విశేషం.

## 'పెద్ది'లో రామ్ బుజ్జిగా.. దివ్యేందుశర్మ



రాంచరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో నిర్మిస్తున్న సినిమాలో హీరోకు ఆపోజిట్ విలన్‌గా బాలీవుడ్ నటుణ్ని తీసుకున్నారు. 'మీర్జాపూర్' సిరీస్ ఫేమ్, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ కీలక పాత్ర చేస్తున్నారు. ఈ చిత్రంలో 'రామ్ బుజ్జి' అనే ఇంట్రస్టింగ్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. దివ్యేందు శర్మ. క్రికెట్ బంతిని ఎగరేస్తూ ఇంటెన్స్ లుక్‌లో కనిపించి దివ్యేందు శర్మ పోస్టర్ విడుదల చేశారు. దివ్యేందు శర్మను 'రామ్ బుజ్జి'గా పరిచయం చేసిన పోస్టర్‌కి సోషల్ మీడియాలో ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. పెద్దిలో 'రామ్ బుజ్జి' క్యారెక్టర్ చాలా ఇంట్రస్టింగ్‌గా వుండబోతోంది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన సెట్లో రామ్ చరణ్ విలన్ల మధ్య యాక్షన్ సన్నివేశాలతో పాటు దివ్యేందు శర్మ, రామ్ చరణ్ మధ్య కూడా ఆసక్తికరమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు.

## మెగా 157 ప్రమోషనల్ వీడియో రిలీజ్



మెగాస్టార్ చిరంజీవి హీరోగా, నాయనతార హీరోయిన్‌గా నటిస్తున్న సినిమా గురించి ప్రమోషన్ షూటింగ్ మొదలై రోజు నుంచే మొదలు పెట్టారు. తాజాగా ముస్సోరీలో షెడ్యూల్ పూర్తి చేసుకున్న సందర్భంగా కూడా ఒక ప్రమోషన్ వీడియోను రిలీజ్ చేశారు. మెగా 157పేరుతో రిలీజ్ చేసిన ఈ ప్రమోషనల్ వీడియోకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఇటీవలే ముస్సోరీ నుంచి రిలీజ్ చేసిన వీడియోలో చిరంజీవి వింటేజ్ అవతార్‌లో అలరించారు. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను సాహు గారపాటి, సుష్మిత కొణిదెల, షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. తాజాగా మేకర్స్ ముస్సోరీ షెడ్యూల్ పూర్తి చేశారు. ఈ షెడ్యూల్‌లో చిరంజీవి, నయనతార మీద కీలక సన్నివేశాలు షూట్ చేశారు. ఈ సన్నివేశాలు సినిమాలో హైలెట్ గా ఉండబోతున్నాయి. ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రాఫర్. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్. ఎస్. కృష్ణ, జి.ఆదినారాయణ కో రైటర్స్. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఇంకా టైటిల్ నిర్ణయించని ఈ సినిమాకు 2026 సంక్రాంతికి విడుదల చేయనున్నారు.

## ఎవరినీ కించపరచలేదు

### రచయిత ఆకెళ్ళ శివప్రసాద్ వివరణ

విష్ణు మంచు కథానాయకుడిగా నటించిన 'కన్నప్ప' చిత్రం మీద గత కొద్దిరోజులుగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని చూసి సినిమాకి మాటల రచయితగా పనిచేసిన నా మనసుకి ఆవేదన కలిగి, కొన్ని విషయాలు చెప్పదల్చుకున్నాను అని రచయిత ఆకెళ్ళ శివప్రసాద్ అన్నారు. కన్నప్ప సినిమాలో బ్రాహ్మణులను కించపరిచే విధంగా తీశారు అని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ వివాదంపై వివరణ ఇచ్చేనందుకు రచయిత ఆకెళ్ళ శివ ప్రసాద్ ప్రయత్నించారు. ఆకెళ్ళ విడుదల చేసిన ప్రత్రికా ప్రకనటలో ఇలా పేర్కొన్నారు. 'నేనూ బ్రాహ్మణుడిని. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన ముకేష్ కుమార్ కూడా ఉత్తర భారత దేశానికి చెందిన బ్రాహ్మణులు. టీవీ సీరియల్ మహాభారతాన్ని అత్యద్భుతంగా తీసిన దర్శకులు. ఈ చిత్రంలో బ్రాహ్మణులని గానీ, ఏ ఇతర కులాల వారిని గానీ కించపరచలేదు. ఇదివరకు కన్నప్ప చరిత్ర మీద వచ్చిన చిత్రాలలో కన్నడ కంఠీరవ రాజ కుమార్ నటించిన 'శ్రీ కాళహస్తి మహత్యం', కృష్ణంరాజు నటించిన 'భక్త కన్నప్ప' చిత్రాలలో గుడిలో ప్రధాన పూజారి మహదేవ శాస్త్రి పాత్రను (మొదటి చిత్రంలో ముదిగొండ లింగ మూర్తి, రెండవ దాంట్లో శ్రీ రావు గోపాల రావు పోషించారు) గుడిలో దేవుడి నగలు తీసుకెళ్ళి తన ఉంపుడుగత్తెకు ఇచ్చినట్టుగా చూపించారు. కానీ కన్నప్ప చిత్రంలో కథానాయకుడిగా నటించడమే గాక, కథా రచన చేసిన విష్ణు మంచు ధూర్జటి 16వ శతాబ్దంలో రచించిన శ్రీ కాళహస్తి మహత్యం గ్రంథం ఆధారంగా, మోహన్ బాబు పోషించిన మహదేవ శాస్త్రి పాత్రని మహా శివ భక్తుడి పాత్రగా చాలా ఉన్నతంగా తీర్చిదిద్దారు. సినిమా చూశాక, ప్రేక్షకులందరికీ ఆ విషయం అర్థమవుతుంది. ఈ చిత్ర కథని రాస్తున్నప్పుడే కాకుండా, చిత్రాన్ని పూర్తి చేశాక కూడా పరమ పవిత్రమైన కాళహస్తి దేవస్థానం ప్రధాన అర్చకులకి చూపించారు. వారు చిత్రం ఎంతో ఉన్నతంగా వుందని ప్రశంసించి, మోహన్ బాబుని, విష్ణుని వేదమంత్రాలతో ఆశీర్వదించారు.ఈ చిత్రంలో పాటని రాసిన శ్రీ రామ జోగయ్య శాస్త్రితో పాటు ఎందరో బ్రాహ్మణులు వివిధ శాఖలలో పనిచేసారు. ఏ వర్గం వారిని కించపరచడానికి, కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి, ఎన్నో వ్యయ ప్రయాసలను భరించి చిత్రాన్ని నిర్మించవలసిన అవసరం ఎవరికీ లేదు. చివరగా, కన్నప్ప చిత్రం ఇంకా విడుదల కాకుండానే ఏవేవో వదంతులు పుట్టించి, దుష్ప్రచారం చేస్తున్న వారి విషయం ఆ పరమేశ్వరుడే చూసుకుంటాడు' అని ఆకెళ్ళ శివ ప్రసాద్ పేర్కొన్నారు.



## విరాటపాలెం: పిసి మీనా రిపోర్టింగ్

## 27న ప్రీమియర్‌కు సిద్ధం



ప్రముఖ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ జీ5 ఇప్పుడు 'విరాటపాలెం: పీసీ మీనా రిపోర్టింగ్' అనే ఇంట్రెస్టింగ్ సిరీస్‌తో అలరించబోతోంది. సోషల్ మీడియా సెన్సేషన్ అభిజ్ఞ వూతలూరు ప్రధాన పాత్రలో నటించిన 'విరాటపాలెం: పీసీ మీనా రిపోర్టింగ్' సిరీస్‌కు పోలూరు కృష్ణ దర్శకత్వం వహించారు. సౌత్ ఇండియన్ స్క్రీన్స్ బ్యానర్‌పై కెవి శ్రీరామ్ ఈ సిరీస్‌ను నిర్మించారు. ఈ సిరీస్ జూన్ 27న ప్రత్యేకంగా జే5లో ప్రీమియర్ కానుంది. ఇటీవల 'విరాటపాలెం: పీసీ మీనా రిపోర్టింగ్' ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. విరాటపాలెం గ్రామంలో ఓ శాపం ఉంటుంది. ఆ ఊర్లో ఏ పెళ్లి జరిగినా సరే మరుసటి రోజు పెళ్లి కూతురు చనిపోతుంటుంది. అలా పదేళ్లుగా ఆ ఊరిని శాపం పట్టి పీడిస్తుందని ప్రజలు నమ్ముతుంటారు. అలాంటి ఊరికి లేడీ కానిస్టేబుల్ మీనా (అభి) వస్తుంది. ఊరి ప్రజల మూఢ నమ్మకాన్ని, ఆ ఊరి రహస్యాల్ని పటా పంచెలు చేయడానికి పెళ్లికి రెడీ అవుతుంది మీనా. ఆ తరువాత ఏం జరిగింది? అసలు ఈ మరణాల వెనుకున్న ఉన్నది ఏంటి? కానిస్టేబుల్ మీనా నిజాన్ని ఊరి ప్రజలకు తెలిసేలా చేసిందా? లేదా? అనే ఆసక్తికరమైన కథాశంతో సాగే సిరీస్ ఇది.80వ దశకానికి చెందినట్టుగా కనిపిస్తోంది. నటీనటుల కట్టూబొట్టూ, మాట తీరు, విజువల్స్ అన్నీ కూడా ఆ కాలానికి తీసుకెళ్లినట్టుగా అనిపిస్తున్నాయి. 'విరాటపాలెం: పిసి మీనా రిపోర్టింగ్' అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకర్షించే ఎడ్జ్‌ఆఫ్ దిసీట్ థ్రిల్లర్ అని అర్థం అవుతోంది. కుటుంబ సమేతంగా ఈ సిరీస్‌ను చూడొచ్చు.

## 'ఏ మాస్టర్ పీస్'లో అరవింద్ కృష్ణ

ముంబైలోని డోమ్‌లో జరిగిన మొట్టమొదటి బడ్ఎక్స్ ఎన్‌బిఏ హౌస్ సెలబ్రిటీ గేమ్‌లో దక్షిణ భారత నటుడు, అథ్లెట్ అరవింద్ కృష్ణ సంచలనం సృష్టించారు. దిశా పటాని, బాద్షా, రణ్విజయ్ సింఘా, వరుణ్ సూద్ వంటి జాతీయ దిగ్గజాలు పాల్గొన్న ఈ ఆటలో దక్షిణాది నుంచి ప్రాతినిధ్యం వహించిన ఏకైక నటుడిగా అరవింద్ కృష్ణ నిలిచారు. మూడో నంబర్ జెర్సీ ధరించి కోర్ట్‌లో అడుగు పెట్టారు. గత ఏడాది మోకాలి గాయంతో బాధ పడిన అరవింద్ ఈ సారి మరింత శక్తివంతంగా తిరిగి వచ్చారు. అరవింద్ తన ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు. అరవింద్ కృష్ణ ప్రస్తుతం నటిస్తున్న 'ఏ మాస్టర్ పీస్' సినిమాలో బాస్కెట్ బాల ప్లేయర్‌గా నటిస్తున్నాడు. గేమ్‌లో ఇతని ఆటను చూసిన ఎన్‌బిఏ ఇండియా అధికారిక స్పాట్‌లైట్ ప్రశంసించింది.



## అనంత పద్మనాభ స్వామి టెంపుల్ సెట్‌లో 'నాగబంధం'



ఎన్ఐకె స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ పతాకంపై నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రం నాగబంధం. విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామ దర్శకత్వంలో రూపొందిస్తున్న ఈ సినిమా కోసం ప్రస్తుతం అనంత నాభ దేవాలయంలో అయిదు వందల మంది డ్యాన్సర్లతో డ్యాన్స్ మాస్టర్ గణేష్ ఆచార్య సారథ్యంలో చిత్రీకరిస్తున్నారు. దీనికోసం భారీ సెట్ నిర్మించారు. ఇక్కడే పాటలతో పాటు కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కేరళలోని అసలు దేవాలయానికి కచ్చితమైన ప్రతిరూపంగా ఇక్కడ సెట్ వేశారు. ఈ సెట్ కోసం సుమారు పది కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. పురాణ ఇతిహాసాల నుంచి తీసుకున్న కథాంశాన్ని మిళితం చేస్తూ పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ దేవాలయాల వద్ద ఇటీవల కనుగొనబడిన గుప్త నిధుల నుంచి ప్రేరణ పొంది, ఆధ్యాత్మిక సాహసోపేతమైన ఇతివృత్తాలతో ఈ కథ సాగుతుందని దర్శకుడు అభిషేక్ నామ తెలిపారు. పవిత్ర స్థలాలను రక్షించే నాగబంధం పురాతన ఆచారాలపై దృష్టి సారించి, భారతదేశంలోని విష్ణు దేవాలయల చుట్టూ ఉన్న రహస్యాన్ని నాగబంధంలో అద్భుతంగా ప్రజెంట్ చేస్తున్నామన్నారు.

## హరీశ్‌రావు యత్నం


(మొదటి పేజీ తరువాయి)

పట్టం కట్టారన్నారు. తెలంగాణ నీటిని ఎపికి దారాదత్తం చేసిందే కెసిఆరేనన్నారు. హరీష్ రావు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడే నీళ్ళ పంచాయితీ, బనకచర్ల పంచాయితీ మొదలైందన్నారు. అప్పటి ఎపి సిఎం జగన్‌తో నాలుగు సార్లు మంతనాలు జరిపి తెలంగాణ నీళ్లకు అన్యాయం చేసింది కెసిఆరేనని, హరీష్ రావు వైఖరి వల్లే ఎపి నేతలు బనకచర్లకు నీళ్ళు తరలించుకుందామనే ఆలోచన చేశారన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావుకు కంటెంట్ కంటే ఎక్కువ ఆవేశమే ఉందని, బిఆర్ఎస్ నేతలు సిఎం కుర్చీలో రేవంత్‌రెడ్డిని చూడలేకపోతున్నారన్నారు. నదీ జలాలు ఎవరి అయ్య జాగీరు కాదని హరీష్ తెలుసుకోవాలన్నారు. నీళ్ళ అంశంపై హరీష్ తనకు, మామ కెసిఆర్‌కు తప్పా ఎవరికీ ఏమీ తెలియదని అనుకుంటున్నారన్నారు. బనకచర్లపై ఏకగ్రీవ తీర్మాణం చేద్దామని అనుకునే సమయానికి అఖిలపక్ష సమావేశం నుంచి బిఆర్ఎస్ ఎంపి వాకౌట్ చేయడం విడ్డూరమన్నారు. కెసిఆర్‌కు ఉన్న అపరజ్ఞానం వల్లే కాళేశ్వరం కూలేశ్వరం అయిందన్నారు. గోదావరి జలాలపై గొంతు చించుకునే బిఆర్ఎస్ నేతలు కృష్ణా జలాలపై ఎందుకు మాట్లాడరని ఆయన ప్రశ్నించారు.

# పేదల పక్షాన నిలబడేది సిపిఐ ఒక్కటే

### నిత్యావసర వస్తువుల ధరల అదుపులో కేంద్రం విఫలం

### దామరచర్ల మండల సిపిఐ మహాసభలో శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ (దామరచర్ల):** అలుపెరగని పోరాటం చేసి, పేదల పక్షాన నిలబడే పార్టీ సిపిఐ అని సిపిఐ జిల్లా కార్యదర్శి, శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అన్నారు.శుక్రవారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండల 9వ మండల మహాసభ జరిగింది. మహాసభలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడుతూ.. సిపిఐ దేశంలోనే వందేళ్ల చరి త్ర కలిగిన పార్టీ అన్నారు. పేదల కోసం, భూముల కోసం, భుక్తి కోసం, పోరాటాలు చేసి కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం త్యాగాలను చేసిన పార్టీ అని తెలిపారు. ప్రజా సమస్యలే అజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సిపిఐ అని, దున్నేవాడికి భూమి కావాలని, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించినపార్టీ సిపిఐ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల సరుకుల అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని వారన్నారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఈ దేశంలో ఉన్న సంపదను కట్టబెట్టి చెం దకు ప్రయత్నాలు కొనసాగిస్తుందని ఆరోపించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. భూభారతిలో గిరిజనులు పెట్టుకున్నటువంటి దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలనచేసి తాతల, తండ్రులను దగ్గర నుండి భూమిని సేద్యం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న వారికి బేషరతుగా పట్టాలివ్వాలన్నారు స్థానిక ఫ్యాక్టరీలలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని యాదాద్రి పవర్ ప్లాంట్‌లో భూమి కోల్పోయిన రైతులందరికీ కంపన్ చేసినవ్వాలని కోరారు. ఈ మహాసభలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సయ్యద్, సిపిఐ దామరచర్ల మండల కార్యదర్శి ధీరావత్ లింగ నాయక్, మిర్యాలగూడ మండల కార్యదర్శి అంజనపెల్లి రామలింగం, వేమనపల్లి మండల కార్యదర్శి జిల్లా యాదగిరి, మండల సహాయ కార్యదర్శి డి.శాంతి, పోలేపల్లి ఉదయ్, కల్లెపెల్లి అమ్మ పాఠశాల చైర్మన బుజ్జి లింగ నాయక్, మహిళా సమాఖ్య నాయకులు పోలిపల్లి మమత, లక్ష్మయ్య, రవి, అన్నపూర్ణ, నిర్మల, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి తీరుతాం

### మాట ఇచ్చినాం కట్టుబడి ఉంటాం

### టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ నగరంలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు మాట ఇచ్చినాం మాట నిలబెట్టుకుంటామని నెల రోజుల్లో నగర జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ అన్నారు. ఇళ్ల స్థలాల సాధన కోసం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు నిజామాబాద్ నుంచి తరలివెళ్లారు. జర్నలిస్టుల ఎన్ని ఏళ్ల కళ సొంతింటి కల సాకారం చేయాలని శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, బంజారా హిల్స్ షబ్బీర్‌అలీలను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. నివాసయోగ్యం కానీ గుండారం గుట్టలు కాకుండా నగరానికి సమీపంలో నివాసయోగ్యం కలిగిన స్థలాలను జర్నలిస్టులకు ఇవ్వాలని చేసిన డిమాండ పట్ల ఇరువురు సానుకూలంగా స్పందించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గుండారం భూములు జర్నలిస్టుల నివాస స్థలాల కోసం ప్రతిపాదించరాదని జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణరెడ్డికి, ఆర్డీఓ రాజేందర్‌కుమార్‌లకు సూచించారు.

గుండారం గుట్టలకు బదులుగా ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణం కోసం సహకరిస్తామని మాటనిచ్చారు. ఈ సందర్భంగా నగర జర్నలిస్టులు మహేష్‌కుమార్‌గౌడ్, షబ్బీర్‌అలీలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

## బిజెపి టాప్ (మొదటి పేజీ తరువాయి)

చేశాయి. ఈ ఖర్చులో జాతీయ పార్టీలు రూ.2,204 కోట్లకు పైగా (65.75 శాతం) ఖర్చు చేశాయి. సేకరించిన మొత్తం నిధులలో జాతీయ పార్టీలు రూ. 6,930.246 కోట్లు (93.08 శాతం) సేకరించగా, ప్రాంతీయ పార్టీలు రూ. 515.32 కోట్లు (6.92 శాతం) సేకరించాయి ఎడిఆర్ తన నివేదికలో పేర్కొంది. సాధారణ ఎన్నికలు జరిగిన 90 రోజుల్లోపు, రాష్ట్ర ఎన్నికలు జరిగిన 75 రోజుల్లోపు రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ (ఇసి)కి దాఖలు చేయాల్సిన తప్పనిసరి వ్యయ ప్రకటనల ఆధారంగా ఈ విశ్లేషణ చేశారు. అయితే వ్యయానికి సంబంధించిన గణాంకాలను రాష్ట్రం వారీగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 168 రోజులు ఆలస్యంగా, బిజెపి 139 నుండి 154 రోజుల తర్వాత సమర్పించినట్లు ఎడిఆర్ గుర్తించింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల రెండింటికీ కాంగ్రెస్ మాత్రమే ఏకీకృత నివేదికను సమర్పించింది. ఖర్చుల జాబితాలో ప్రచారమే అగ్రస్థానంలో ఉంది. అందుకు పార్టీలు తమ మొత్తం ప్రకటించిన ఖర్చులో రూ. 2,008 కోట్లు లేదా 53 శాతం కంటే ఎక్కువ ఖర్చు చేశాయి. ఆ తరువాత ప్రయాణానికి రూ. 795 కోట్లు ఖర్చు చేయగా, అభ్యర్థులకు ఒకేసారి రూ. 402 కోట్లు చెల్లింపులు చేశాయి. పార్టీలు వర్చువల్ ప్రచారాలకు రూ.132 కోట్లకు పైగా, అభ్యర్థుల నేర చరిత్రలను ప్రచురించడానికి రూ.28 కోట్లు ఖర్చు చేశాయి. 32 రాజకీయ పార్టీలు ప్రచారం కోసం చేసిన మొత్తం ఖర్చులో, రూ.1,511.3004 కోట్లు లేదా 75.25 శాతం జాతీయ పార్టీలు ఖర్చు చేశాయి, రూ.496.99 కోట్లు లేదా 24.75 శాతం ప్రాంతీయ పార్టీలు ఖర్చు చేశాయి. ప్రయాణ ఖర్చులు కూడా స్టార్ క్యాంపెయినర్లకు భారీగా పెరిగాయి. ప్రయాణానికి ఖర్చు చేసిన రూ.795 కోట్లలో, రూ.765 కోట్లు (96.22 శాతం) ప్రముఖులను తీసుకెళ్లడానికి కాగా, రూ.30 కోట్లు మాత్రమే ఇతర నాయకులకు వెచ్చించారు. పారదర్శకతపై ఎడిఆర్ అనేక ఆందోళనలను లేవనెత్తింది. నివేదిక తయారుచేసినప్పుడు ఎన్‌సిపి, సిపిఐ, జెఎంఎం, శివసేన (యుబిటి) సహా 21 పార్టీల ప్రకటనలు ఇసి వెబ్‌సైట్‌లో అందుబాటులో లేవు. 2024 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలలో పోటీ చేసిన ఆర్‌జెడి, ఎల్‌జెపి (ఆర్‌వి), ఎజెఎస్‌యు, కెసి (ఎం) పార్టీల ఖర్చు నివేదికలు అందుబాటులో లేవు. అదే విధంగా జమ్మూకశ్మీర్ పిడిపి, కేరళ కాంగ్రెస్ (ఎం) అనే రెండు పార్టీలు పోటీ చేసినప్పటికీ ఖర్చు శూన్యం అని ప్రకటించాయి. గత సంవత్సరం సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 690 గుర్తింపు లేని రాజకీయ పార్టీలు పోటీ చేశాయని, అరుణాచల్ ప్రదేశ్‌లో ఒకటి, ఆంధ్రప్రదేశ్‌లో 74, ఒడిశాలో 35, సిక్కింలో రెండు ఒకే సారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశాయని ఎడిఆర్ పేర్కొంది. ఈ పార్టీల ఖర్చు నివేదికలను నివేదికలో భాగంగా విశ్లేషించలేదు. సాధ్యమైన చోటల్లా, ఖర్చును చెక్కులు లేదా డిడి (డిమాండ్ డ్రాఫ్ట్) లేదా ఆర్‌టిజిఎస్ ద్వారా లావాదేవీలకే పరిమితం చేయాలని, తద్వారా ఇసి జారీ చేసిన పారదర్శకత మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల్లో నల్లధన వినియోగాన్ని తగ్గించాలని నివేదిక పేర్కొంది. అభ్యర్థుల ఖర్చును ట్రాక్ చేసే మాదిరిగానే పార్టీ ఖర్చులను పర్యవేక్షించడానికి పరిశీలకులను నియమించాలని ఎడిఆర్ ఇసిని కోరింది.

## భారతీయుల డిపాజిట్లు

(మొదటి పేజీ తరువాయి)

స్విస్ ఫ్రాంక్‌లకు చేరుకున్నాయి. ఈ వార్షిక పెరుగుదల ఉన్నప్పటికీ గత దశాబ్ద కాలంలో డిపాజిట్లు తగ్గాయి. అయితే, స్విస్ బ్యాంకులో భారతీయుల డిపాజిట్లు మాత్రమే కాదు. ప్రపంచంలోని అనేక ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థలు ఉన్న దేశస్థుల డిపాజిట్లు కూడా తగ్గుముఖం పట్టాయి. యుకె జాతీయుల డిపాజిట్లు 2015లో 44 బిలియన్ స్విస్ ఫ్రాంక్ ల నుంచి 2024 నాటికి 31 బిలియన్ స్విస్ ఫ్రాంక్ లకు తగ్గాయి. చైనా దేశస్థుల డిపాజిట్లు కూడా తగ్గుముఖం పట్టాయి. 5.01 బిలియన్ స్విస్ ఫ్రాంక్ ల నుంచి 4.3 బిలియన్ స్విస్ ఫ్రాంక్ లకు తగ్గాయి. భారత్ పొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశీయుల కూడా స్విస్ బ్యాంకులో డిపాజిట్లను తగ్గించారు. గత పదేళ్లలో స్విస్ బ్యాంకుల్లో పాకిస్థాన్ జాతీయుల డిపాజిట్లు భారీగా తగ్గాయి. పాకిస్థాన్ దేశస్థుల డిపాజిట్లు 2015లో 947 మిలియన్ స్విస్ ఫ్రాంక్‌లుగా ఉన్నాయి. కానీ 2024 నాటికి 241 మిలియన్ స్విస్ ఫ్రాంక్ లకు గణనీయంగా తగ్గాయి. డిపాజిట్లలో దాదాపు 75 శాతం తగ్గుదల కనిపించింది. బంగ్లాదేశ్ జాతీయుల విషయంలో కూడా ఇదే ధోరణి కన్పించింది. స్విస్ బ్యాంకుల్లో బంగ్లా దేశీయుల డిపాజిట్లు 2015లో 48 మిలియన్ స్విస్ ఫ్రాంక్ లు ఉన్నాయి. 2024లో కేవలం 12.6 మిలియన్ స్విస్ ఫ్రాంక్ లకు తగ్గాయి. దాదాపు 73 శాతం డిపాజిట్లు తగ్గాయి. సౌదీ అరేబియా పౌరుల డిపాజిట్లు గత పదేళ్లలో దాదాపు సగానికి తగ్గాయి. 2015లో 8.3 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌ల డిపాజిట్లు ఉండేవి. అవి 2024 నాటికి 4.8 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌లకు తగ్గాయి. అమెరికన్ జాతీయుల డిపాజిట్లలో కూడా భారీ తగ్గుదల కనిపించింది. స్విస్ బ్యాంకుల్లో వారి డిపాజిట్లు 2015లో 64.2 బిలియన్ స్విస్ ఫ్రాంక్ లు ఉండేవి. 2024 నాటికి అవి 24.4 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌లకు పడిపోయాయి. దాదాపు 62 శాతం తగ్గుదల కనిపించింది. స్విస్ నేషనల్ బ్యాంక్ విడుదల చేసిన డేటా ప్రకారం, స్విస్ బ్యాంకుల్లో విదేశీ డిపాజిట్లు తగ్గుతున్న విస్తృత ధోరణి కనిపించింది. నిబంధనలను కఠినతరం చేయడం, పెరిగిన పరిశీలన, అంతర్జాతీయ ఆర్థిక పారదర్శకత నిబంధనలలో మార్పులు వంటి వివిధ కారణాల వల్ల స్విస్ బ్యాంకుల్లో విదేశీ డిపాజిట్లు తగ్గుతున్నాయి. గత దశాబ్దంలో స్విస్ బ్యాంకుల్లో భారతీయుల డిపాజిట్లు తగ్గాయి. అయితే, 2021లో కొవిడ్ సమయంలో డిపాజిట్లలో తాత్కాలిక పెరుగుదల కనిపించింది. ఆ తర్వాత మళ్లీ డిపాజిట్లు తగ్గుముఖం పట్టాయి.

## మేం నీళ్లెందుకు ఇవ్వాలి?..

### కెనాల్ ప్లాన్‌ను వ్యతిరేకించిన ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్ జలాలను ఉత్తరాది రాష్ట్రాలకు అనుసంధానించే కెనాల్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వ్యతిరేకించారు. మొదట తమ జలాలను తాము వాడుకోవాలని, జమ్మూలో కరవు తరహా పరిస్థితి ఉందని, తామెందుకు పంజాబ్‌కు జలాలు పంపాలని ఆయన ప్రశ్నించారు. సింధు జాలాల వ్యవస్థ నుంచి జమ్ముకశ్మీర్ షేర్‌లోని మిగులు జలాలను పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌కు మళ్లించేందుకు 113 కిలోమీటర్ల కెనాల్ ప్రాజెక్టుకు ప్లాన్ జరుగుతోంది. దీనిపై ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. సింధు జలాల ఒప్పందం కింద పంజాబ్ ఇప్పటికే జలాలు పొందుతోందని చెప్పారు. 'మాకు అవసరమైతే వాళ్లు నీళ్లిస్తారా?' అని ప్రశ్నించారు. పఠాన్‌కోటలో షాపుర్‌కండి ఆనకట్ట నిర్మాణానికి సంబంధించి 45 ఏళ్లుగా పంజాబ్, జమ్మూకశ్మీర్ ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతోంది.

## మరి సాగు ఎలా? (మొదటి పేజీ తరువాయి)

ప్రార్థిస్తున్నారు.

**సూర్యాపేట జిల్లాలో 75శాతం లోటు వర్షపాతం**

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 20 రోజులవుతున్నా సరైన వానలు కురవకపోవడంతో జిల్లాలో మెట్టపంటల సాగు ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు పదిశాతం మంది రైతులు మాత్రమే మెట్ట పంటల సాగుచేశారు. అదికూడా పత్తి మాత్రమే. భూమిలో వేసిన విత్తనాలు కూడా పదును లేకపోవడంతో నేటికి మొలకెత్తలేదు. అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం ఈనెలలో 75 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో 62.9 మీల్లిమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 15.6 మీల్లిమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైనట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. రానున్న నాలుగైదు రోజుల్లో వానపడే అవకాశం లేదని చెప్పకనే చెబుతున్నారు. ఇలానే వానలు పడడం మరింత ఆలస్యమైతే మెంటపంట సాగు కూడా అదును పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com